www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు : 14
సంపుటి (Volume) :22
సంచిక (Issue) : 267
బుధవారం | 25-12-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: దశమి రా. 10.29 తదుపరి ఏకాదశి; నక్షత్రం: చిత్త మ. 3.22 తదుపరి స్వాతి
వర్జ్యం: రా. 9.36-11.24; దుర్ముహూర్తం: ఉ. 11.53-12.37; అమృతఘడియలు: ఉ. 8.08-9.57; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 5.44
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేడు క్రిస్మస్


విద్యుత్ వెలుగుల్లో మెదక్ చర్చి

తప్పు జరిగిపోయింది!

చిక్కడపల్లి ఠాణాలో అల్లు అర్జున్ భావోద్వేగం!.. తొక్కిసలాట దృశ్యాలు చూసి చలించిన బన్నీ

అతడి తరఫు న్యాయవాది సమక్షంలో విచారణ

ఉదయం 11:05 నుంచి మధ్యాహ్నం 2:45 దాకా..

సినిమాకి నేరుగా వెళ్లక రోడ్‌షో ఎందుకు చేశారు?

అనుమతి లేనిదే రోడ్ షో చేయడం తప్పని తెలీదా?

రేవతి చనిపోయిన విషయం మీకెప్పుడు తెలిసింది?

వెళ్లిపోవాలని ఏసీపీ చెప్పినా.. ఎందుకు వెళ్లలేదు?

దర్యాప్తు జరుగుతుండగా ప్రెస్‌మీట్ ఎలా పెట్టారు?

20 ప్రశ్నలు..! ఒకట్రెండు తప్ప అన్నింటికీ జవాబు

ఎప్పుడు పిలిచినా విచారణకు వస్తానని స్పష్టీకరణ

మూడుసార్లు విరామం.. బన్నీకి టీ ఇచ్చిన పోలీసులు

ఠాణా వద్దకు భారీగా అభిమానులు.. స్వల్ప ఉద్రిక్తత

తొక్కిసలాట కేసు..18కి చేరిన నిందితులు

ఏ18గా మైత్రీమూవీస్ నిర్మాతలు.. పరారీలో ఏడుగురు

కోర్టుకు సీల్డ్ కవర్‌లో అల్లు అర్జున్ విచారణ నివేదిక

ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి మాట్లాడా

శ్రీతేజ్ కుటుంబ బాధ్యతను తీసుకోవడంపై చర్చించా

సినిమా వాళ్లందరం సీఎంను కలుస్తాం: దిల్ రాజు

పరిశ్రమకు, సర్కారుకు వారధిలా ఉంటానని వెల్లడి

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని స్పష్టీకరణ


పోలీసు విచారణ అనంతరం ఇంటికి తిరిగి వెళుతున్న అల్లు అర్జున్


మంగళవారం అల్లు అర్జున్ ఇంటి చుట్టూ కప్పిన పరదాలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి/రాంనగర్, కవాడిగూడ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'తగ్గేదే లే' అని సినిమాలో డైలాగులు చెప్పిన నటుడు అల్లు అర్జున్.. నిజ జీవితంలో పోలీసుల విచారణలో కాస్తంత వెనక్కి తగ్గారా? తప్పు ఒప్పుకొని కంటతడి కూడా పెట్టారా? అంటే.. పోలీసు వర్గాలు ఇందుకు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. ఆ వర్గాలు చెబుతున్నదాని ప్రకారం.. సంధ్య థియేటర్ వద్ద జరిగిన దుర్ఘటనకు తాను కారణం కాదని ఇన్ని రోజులుగా చెబుతున్న బన్నీ.. తనవల్ల పెద్ద తప్పు జరిగిపోయిందంటూ మంగళవారం పోలీసుల వద్ద విచారం వ్యక్తం చేశారు! తోపులాటలో కిందపడి అపస్మారకస్థితిలోకి వెళ్లిన రేవతి, శ్రీతేజ్‌ను బతికించడం కోసం పోలీసులు సీపీఆర్ చేసిన వీడియోని

మిగతా 13వ పేజీలో...

అదానీని ఆపలేం

ఏరోస్పేస్‌లో డ్రోన్ల తయారీపై ఒప్పందాలను రద్దు చేయలేం

కేంద్రం అనుమతితోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పందాలు

మా వంతు చేయాల్సింది చేస్తాం

మణిపూర్ మారణకాండలో కార్పొరేట్ రంగం పాత్ర

2

ఐప్సో సమావేశంలో సీఎం రేవంత్

రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

నేడు ప్రఖ్యాత మెదక్ చర్చికి సీఎం

ఏడుపాయల వనదుర్గ దర్శనానికి..

ఫ్యూచర్ సిటీ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు
రూ.2వేల కోట్లు

ఆర్థిక శాఖ ఆమోదం.. త్వరలో పనులు ప్రారంభం

విమానాశ్రయం నుంచి నాలుగో నగరానికి రహదారి

330 అడుగుల వెడల్పు.. 9 రేడియల్ రోడ్లలో ఇదే పెద్దది

ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఆర్‌ఆర్‌ఆర్‌కు అనుసంధానం

ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నంబరు13 దగ్గర రావిర్యాల్ నుంచి ప్రారంభం

రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ మండలం ఆకుతోటపల్లి వరకు నిర్మాణం

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురపాలక శాఖ పర్యవేక్షణలో చేపడుతున్న గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుకు ఆర్థిక శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుల్లో భాగంగా నిర్మిస్తున్న 9 రేడియల్ రహదారుల్లో అతి పెద్దదైన ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ వరకు నిర్మించనున్న తొలి దశలో భాగంగా రావిర్యాల్ నుంచి అమనగల్ వరకు నిర్మించనున్న 41.5 కి.మీ రహదారికి

మిగతా 12వ పేజీలో...



త్వరలో బిల్లులు

రూ.10 లక్షల లోపు ఉన్న వాటికి ఆమోదం

పనులు చేసిన మాజీ ప్రజాప్రతినిధులకు చెల్లింపు

వారి ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సర్కారు యోచన

వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నిరుడు డిసెంబరుకు రూ.1,300 కోట్లు పెండింగ్

రూ.400 కోట్లు విడుదలయ్యే అవకాశం 13



సైబర్ నేరాలు పైపైకి!



ట్రై కమిషనరేట్లలో 20,414 కేసులు

డ్రగ్స్ కేసుల్లో సైతం పెరుగుదల

మొత్తం 1,980 మంది పెడ్లర్ల అరెస్టు

అత్యాచారాలు, వేధింపులు కూడా పైపైకి

రోడ్డు ప్రమాదాల్లో తగ్గిన మరణాలు

7,861 ఘటనల్లో 1798 మంది మృతి

ఆర్థిక నేరాల్లో రూ.4వేల కోట్లు హాంఫట్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు హైదరాబాద్‌ను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. సైబర్ నేరాల్లో దేశంలోనే తెలంగాణ టాప్-5లో ఉండగా.. రాష్ట్రంలో సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ ట్రైకమిషనరేట్లు మొదటి మూడు స్థానాలను ఆక్రమించాయి. ఈ ప్రాంతాల్లో ఇంగ్లిష్, హిందీని అర్థం చేసుకుని, మాట్లాడగలిగేవారు ఎక్కువగా ఉండడం సైబర్ కేటుగాళ్లకు అనుకూలంగా మారింది. దీంతో.. సైబర్ నేరాలు ఏటా పైపైకి ఎగబాకుతున్నాయి. బాధితులు

మిగతా 3వ పేజీలో...


వాజ్‌పేయి జీవితంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

వాజ్‌పేయి అజాత శత్రువు

నైతిక విలువలకు కట్టుబడిన నాయకుడు

ప్రధాని పదవినీ వదులుకున్న గొప్ప నేత

ఆయన జీవితం భావితరాలకు నిఘంటువు

వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో కిషన్‌రెడ్డి 12

మరపురాని రాజనీతిజ్ఞుడు

అటల్ జీవిత చెరిగిపోని ముద్ర

జీవితంలో స్ఫూర్తినిచ్చే కీలక ఘట్టాలెన్నో

● ఫార్ములా-ఈ కేసు..

అప్రూవర్‌గా అర్వింద్‌కుమార్?



రాజీ ప్రయత్నాలు ప్రారంభం!!

అధికారవర్గాల్లో జోరుగా చర్చ


తొలుత అర్వింద్‌ను విచారించే చాన్స్

ఇప్పటికే ఏసీబీ చేతికి ఒప్పంద పత్రాలు

ఫ్రేమ్‌వర్క్ కాగానే కేటీఆర్‌కు నోటీసులు!

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ రేసింగ్‌కు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కంపెనీలకు నిధుల విడుదల, అవినీతి కోణాలపై నమోదు చేసిన కేసులో ఏసీబీ దూకుడు పెంచుతోంది. సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ఈ కేసులో అప్రూవర్‌గా మారేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికారవర్గాల్లో

మిగతా 3వ పేజీలో...

 3

కేసీఆర్, హరీశ్‌కు హైకోర్టులో ఊరట

భూపాలపల్లి కోర్టు నోటీసుల సస్పెన్షన్

జిల్లా కోర్టు పరిధి మీరిందన్న హైకోర్టు

మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారం

కెనడాలో శాశ్వత నివాసం కష్టమే!

జాబ్ ఆఫర్ పాయింట్లు ఎత్తివేసిన సర్కార్

ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానంలో మార్పులు

ప్రస్తుత, తాత్కాలిక ఉద్యోగులకూ వర్తింపు

భారతీయులపై భారీ ప్రభావం 14

బియ్యం సేకరణ బంద్!

రాష్ట్రంలో సేకరణను నిలిపివేసిన ఎఫ్‌సీఐ

2 సీజన్ల బకాయిలు 17 లక్షల టన్నులు

ఎఫ్‌సీఐ తీసుకోకపోతే 6వేల కోట్ల భారం

15 నుంచి ఆగిన డెలివరీ, మిల్లింగ్

కేంద్రం ఉత్తర్వులు రాకుంటే నష్టమే 2

 13

ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు

మిజోరాంకు జనరల్ వీకే సింగ్

5 రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణకు..

ఎన్ఆర్ఎస్సీ చిత్రాల డేటా వినియోగం

- 1973 నుంచి 2024 వరకు వర్షపాతం, చెరువుల్లో నీటిని పరిగణనలోకి తీసుకుంటాం
- ముంపు పరిష్కారానికి చర్యలు: ఏవీ రంగనాథ్
- ఎన్ఆర్ఎస్సీ అధికారులతో భేటీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించేందుకు 1973 నుంచి 2024 వరకు నమోదైన వర్షపాతం, చెరువుల్లో నిలిచిన నీటికి సంబంధించిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) శాటిలైట్ చిత్రాల డేటాను వినియోగించుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అధిక సాంద్రత (హై రెజల్యూషన్)తో ఉండే ఎన్ఆర్ఎస్సీ చిత్రాలు.. పార్కులు, ప్రభుత్వ స్థలాలు, వరద ముంపు ఉన్న ప్రాంతాల గుర్తింపునకూ ఉపకరిస్తాయన్నారు. మంగళవారం ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో బాలానగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో రంగనాథ్ సమావేశమయ్యారు. వరదలు వచ్చినప్పుడు ఏ ప్రాంతాలు నీట మునిగాయి? వరద కాలువల ఉధృతి ఎలా ఉంది? చెరువుల ఎఫ్‌టీఎల్ వంటి విషయాలను అన్ని కోణాల్లో పరిశీలించి భవిష్యత్తులో ముంపు ముప్పు లేకుండా అవసరమైన చర్యలు చేపడతామని అన్నారు. సర్వే ఆఫ్ ఇండియా, సర్వే ఆఫ్ తెలంగాణ, గ్రామీణ మ్యాపుల నుంచి సమాచారం సేకరిస్తున్నామని, ఎన్ఆర్ఎస్సీని భాగస్వామ్యం చేయడం ద్వారా మరింత స్పష్టమైన సమాచారం తెలుస్తుందని చెప్పారు. ఇక ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణలో నిర్దిష్ట విధానాలు పాటించాలని, ఎవరూ తప్పుబట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ సూచించారు. చెరువుల పరిరక్షణతో సంబంధమున్న అన్ని విభాగాల మధ్య సమన్వయం ముఖ్యమన్నారు. చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువల పరిరక్షణపైనా లేక్ ప్రొటెక్షన్ కో ఆర్డినేషన్ కమిటీ దృష్టి సారించాలన్నారు. మంగళవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్ జిల్లాలకు చెందిన ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులతో రంగనాథ్ సమీక్ష సమావేశం నిర్వహించారు.


ఎన్ఆర్ఎస్సీ అధికారులతో సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

లోకం తీరు




అంబేడ్కర్ చిత్రపటంతో ర్యాలీ చేస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ నేతలు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- పలువురు కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- అంబేడ్కర్ విగ్రహానికి నివాళి, బైఠాయింపు

హైదరాబాద్ సిటీ/ కవాడిగూడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమాన పరిచేవిధంగా అమిత్‌షా మాట్లాడడంపై ఏఐసీసీ దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునివ్వగా.. మంగళవారం టీపీసీసీ ఆధ్వర్యాన హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి హైదరాబాద్ కలెక్టరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడే బైఠాయించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అమిత్‌షాకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా ఏఐసీసీ జాతీయ కో-ఆర్డినేటర్ కొప్పుల రాజు, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితర నేతలు, కార్యకర్తలతో బయలుదేరారు. హైదరాబాద్ కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కొప్పుల రాజు మాట్లాడుతూ.. అమిత్‌షాతో పాటు ఆర్ఎస్ఎస్, బీజేపీలకు అంబేడ్కర్‌పై అపారమైన ద్వేషముందని అన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అమిత్‌షా వ్యాఖ్యలతో బీజేపీ ముసుగు తొలగిపోయిందని, మనుస్మృతి అమలు చేసేందుకు బీజేపీ, సంఘ్ పరివార్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. వీ.హనుమంతరావు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అమిత్ షా అహంకార పూరితంగా మాట్లాడటం దారుణమని పేర్కొన్నారు.

పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతి ఆత్మహత్య

చిక్కడపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఓ యువతి హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకుంది. కామారెడ్డి జిల్లా సోమారం గ్రామానికి చెందిన సురేఖ (24) హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని సాయిప్రభ లగ్జరీ హాస్టల్‌లో ఉంటూ సుమారు ఏడాదిగా గ్రూప్ పరీక్షలకు శిక్షణ తీసుకుంటోంది. సోమవారం రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో సురేఖ హాస్టల్‌లోని తన రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆమెను పక్కరూమ్‌లో ఉంటున్న ఆమె స్నేహితులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సురేఖకు ఇటీవలే పెళ్లి నిశ్చితార్థం కూడా జరిగిందని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరుగనున్నట్లు చెప్పారు.

మరో 29 న్యాయ ఈ-సేవా కేంద్రాలు ప్రారంభం

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ రూపంలో కేసుల ఫైలింగ్, డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించేందుకు జిల్లా న్యాయవ్యవస్థలో మరో 29 ఈ-సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త కేంద్రాలను హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే, ఇతర న్యాయమూర్తులు మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ 29 కేంద్రాలతో కలిపి జిల్లా న్యాయవ్యవస్థలో మొత్తం 97 కేంద్రాలు పనిచేస్తున్నాట్లు హైకోర్టు రిజిస్ట్రీ అధికారులు తెలిపారు. ఇందుకోసం ఉపయోగిస్తున్న సీఐఎస్ 4.0 సాఫ్ట్‌వేర్‌పై న్యాయవాదులకు అవగాహన కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామని, లాయర్లు, కక్షిదారుల సందేహాలను వీరు నివృత్తి చేస్తారని చెప్పారు. 2022లో పైలెట్ ప్రాజెక్టు కింద హైకోర్టులో ఒకటి, హనుమకొండ జిల్లా కోర్టులో ఒకటి చొప్పున ఈ-సేవా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ఆ సంఖ్య 97కు చేరింది.

సాగర్‌ను మాకే అప్పగించాలని తెలంగాణ పట్టు

- జనవరి 21న జరిగే భేటీ ఎజెండాను పంపిన కేఆర్ఎంబీ

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను పూర్తిగా తమకే అప్పగించాలనే తెలంగాణ చేస్తున్న డిమాండ్‌తో పాటు నీటి పంపిణీపై చర్చించడానికి వీలుగా కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 19వ సమావేశం జనవరి 21వ తేదీన ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. ఏపీ విజ్ఞప్తితో ఎజెండాలో పలు అంశాలను చేర్చారు. ఈ అంశాలతో మంగళవారం రాష్ట్రాలకు ఎజెండాను పంపించారు.



అంతర్జాతీయ ఒలింపియాడ్స్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ(2024) ఒలింపియాడ్స్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణలు తెలిపారు. రొమేనియాలోని బుకారెస్ట్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌లో తమ సంస్థ విద్యార్థులు శ్వేతాంక్ అగర్వాల్, భవ్య గున్వాల్‌లు అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని వారు వెల్లడించారు. దాంతో పాటు ప్రపంచ చాంపియన్ టైటిల్‌ను ఖాయం చేసుకున్నట్టు చెప్పారు. ప్రతి సంవత్సరం 50 వేల మంది తెలివైన యువకులు భారత ప్రతినిధి బృందంలో స్థానం కోసం పోటీ పడుతుండగా, వారిలో కేవలం ఆరుగురు మాత్రమే భారత్ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని పొందారన్నారు. ఆ ఆరుగురిలో ఇద్దరు నారాయణ విద్యార్థులు బంగారు పతకాలను గెలుచుకోవడం విశేషమని పేర్కొన్నారు.

అదానీని ఆపలేం

- ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం
- అదానీ ఏరోస్పేస్‌లో డ్రోన్ల తయారీపై కేంద్రం అనుమతితోనే గత ప్రభుత్వం ఒప్పందాలు
- అయినా మా తరపున చేయాల్సింది చేస్తాం
- ఐప్సో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర ప్రజలకు సీఎం క్రిస్మస్ శుభాకాంక్షలు
- నేడు మెదక్ చర్చికి ముఖ్యమంత్రి.. ఏడుపాయల వనదుర్గ ఆలయం సందర్శన

హైదరాబాద్/రవీంద్రభారతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అదానీ సంస్థలతో ఒప్పందాల అంశం తమ చేతుల్లో లేని విషయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతితోనే గత బీఆర్ఎస్ సర్కారు.. అదానీ సంస్థలతో అనేక ఒప్పందాలు చేసుకుందని, అందులో భాగంగానే రక్షణ రంగంలో డ్రోన్లు, ఇతర వ్యాపారాలు నెలకొల్పారని తెలిపారు. సరళీకృత విధానాలు ఉన్న ప్రస్తుత కార్పొరేట్ యుగంలో గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయడం కష్టమని చెప్పారు. మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేత, అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం (ఐప్సో) జాతీయ సలహా కమిటీ చైర్మన్ కొంపల్లి యాదవరెడ్డి రచించిన 'నట్స్, బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్' పుస్తకావిష్కరణ సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అదానీ ఏరోస్పేస్‌లో హమాస్-900 పేరుతో డ్రోన్లు తయారవుతున్నాయని, వీటిని గాజాపై దాడి చేసేందుకు ఇజ్రాయెల్‌కు పంపిస్తున్నారని ఐప్సో ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ యుద్ధంతో మన చుట్టూ ఉన్న దేశాలతో శత్రుత్వం పెరిగిందని, అదానీ ఏరోస్పేస్‌లో డ్రోన్ల తయారీని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం రేవంత్ స్పందిస్తూ.. రక్షణ రంగంలో వందశాతం ప్రైవేటు వారిని అనుమతించాలని రాజ్యాంగాన్నే మార్చి కొత్త విధానాలు అమలుచేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ అదానీతోపాటు రక్షణ రంగంలోని ఇతర ప్రైవేటు సంస్థలపైనా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీనికోసం ప్రభుత్వం తరఫున చేయాల్సింది తప్పకుండా చేస్తామన్నారు. నేడు ప్రపంచం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం గురించే మాట్లాడుకుంటోందని, కానీ.. దేశంలోనూ 2014 నుంచి అలాంటి పరిస్థితులే నెలకొన్నాయని అన్నారు. 2014 తర్వాత దాదాపు 4వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని ఆరోపించారు. దీనిపై చర్చించేందుకు, వాస్తవాలు బయటపెట్టేందుకు పాలకులకు ధైర్యం లేదని విమర్శించారు.


హైదరాబాద్ రవీంద్రభారతిలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

మణిపూర్ అల్లర్లలో కార్పొరేట్ల పాత్ర..

మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండలో అక్కడి కార్పొరేట్ రంగం పాత్ర ఉందని సీఎం రేవంత్ అన్నారు. అక్కడి సహజ వనరులను దోచుకునేందుకు రెండు గిరిజన జాతుల మధ్య అంతర్యుద్ధాన్ని ఏకే-47 లాంటి మారణాయుధాలు అందించి ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. భారత బలగాలు మణిపూర్ హింసను నియంత్రించలేవా? అక్కడి మారణాయుధాలను సీజ్ చేయలేవా? అని ప్రశ్నించారు. అక్కడి అల్లర్ల వెనక కుట్ర, కుతంత్రం ఉందన్నారు. ఇలాంటి వాటిపై పార్లమెంటులో చర్చ జరగకుండా ఇతర అంశాలపై మాట్లాడుతున్నారని సీఎం ధ్వజమెత్తారు. ఇక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అనేక మంది తెరవెనక కీలకపాత్ర పోషించారన్నారు. ఐప్సో ప్రధాన కార్యదర్శి ఒబేదుల్లా కొత్వాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రపంచ శాంతి మండలి అధ్యక్షుడు పల్లబ్‌సేన్ గుప్తా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీలు బి.వినోద్‌కుమార్, వి.హనుమంతరావు, సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, పాశం యాదగిరి, దిడ్డి సుధాకర్, కేవీఎల్ తదితరులు హాజరయ్యారు.

అన్ని మతాల సారాంశం మానవత్వమే

హైదరాబాద్/మెదక్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలు ఇప్పటికీ ఎప్పటికీ ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శకమన్నారు. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని, ఆయన ఎంచుకున్న మార్గం అందరికీ దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏసు ప్రభువు బోధనలను అనుసరించి అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రజా ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఖండాంతర ఖ్యాతి గాంచిన మెదక్ క్యాథడ్రల్ చర్చి వందేళ్ల వేడుకల్లో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. దీంతోపాటు పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత ఆలయాన్ని సందర్శించనున్నారు.

బకాయిలున్న మిల్లర్లకూ ధాన్యం!

- నిబంధనలు సడలించిన సర్కారు

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిల్లర్లకు ధాన్యం కేటాయింపు విషయంలో ప్రభుత్వం కాస్త మెత్తపడింది. ఖరీఫ్ ధాన్యం కేటాయింపు నిబంధనలను సడలించింది. ధాన్యం సేకరణ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినప్పుడు డిఫాల్టర్లకు ధాన్యం కేటాయించబోమని చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా బకాయిలున్న మిల్లర్లకు కూడా ధాన్యం కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ మంగళవారం జీవో నంబరు 57 జారీ చేశారు. నిర్ణీత సీఎంఆర్ లక్ష్యంలో 100శాతం పూర్తిచేసిన రైస్‌మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు చేయాలని, 25 శాతం జరిమానాను రెండు వాయిదాల్లో చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బియ్యం బకాయిలున్న మిల్లర్లకు గతంలో 25 శాతం జరిమానా విధించారు. అంటే.. 1000టన్నుల బియ్యం బకాయిలున్న రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి 1,250 టన్నుల బియ్యాన్ని ఇవ్వాలి. ఆ మేరకు బకాయిలు చెల్లించని వారిని డిఫాల్టర్ల జాబితాలో చేర్చారు. వారికి ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం కేటాయింపులు చేయలేదు. మూడు నెలలు తిరిగేసరికి మిల్లర్ల నుంచి ఒత్తిడి పెరిగింది. మిల్లర్లు కొందరు ఎమ్మెల్యేలను, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకొని పెద్దఎత్తున లాబీయింగ్ చేసినట్లు చర్చ జరుగుతోంది. అయితే కలెక్టర్ల ప్రతిపాదనల మేరకే ధాన్యం కేటాయింపుల నిబంధనలు సడలించినట్లు డీఎస్ చౌహాన్ జీవోలో పేర్కొన్నారు. 25 శాతంలో సగం జరిమానాను వెంటనే చెల్లించాలని, మిగిలిన సగాన్ని 31 నాటికి చెల్లించాలని మిల్లర్లకు ఆదేశాలు జారీచేశారు. కొత్త ధాన్యం సేకరణ విధానం ప్రకారం 25శాతం బ్యాంకు గ్యారెంటీ గానీ, సెక్యూరిటీ డిపాజిట్ గానీ సమర్పించి మిల్లర్లు ధాన్యం తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, నిబంధనల సడలింపుపై డిఫాల్ట్ మిల్లర్లు సంబరపడుతున్నారు. సీఎంఆర్ లక్ష్యం పూర్తిచేసిన మిల్లర్లు మాత్రం ఈ సడలింపులపై పెదవి విరుస్తున్నారు.

ఆస్పత్రి నుంచి జూ.ఎన్టీఆర్ అభిమాని డిశ్చార్జ్

- చెన్నైకు అభిమాన సంఘం నేతలను పంపిన జూ.ఎన్టీఆర్
- అపోలో నుంచి కౌశిక్ డిశ్చార్జ్‌కు ఏర్పాట్లు

తిరుపతి, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతూ చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాని, తిరుపతికి చెందిన కౌశిక్ మంగళవారం డిశ్చార్జ్ అయ్యారు. ఎన్టీఆర్ సూచనల మేరకు ఆయన అభిమాన సంఘం నాయకుడు కృష్ణ యాదవ్ అపోలో ఆస్పత్రికి వెళ్లి కౌశిక్ డిశ్చార్జ్ ఏర్పాట్లు చూశారు. తన కుమారుడికి అవసరమైన ఖర్చు భరిస్తానంటూ హామీ ఇచ్చిన జూనియర్ ఎన్టీఆర్ ముందుకురావాలంటూ కౌశిక్ తల్లి సోమవారం డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎన్టీఆర్ తన అభిమాన సంఘం నాయకులను చెన్నైకు పంపి డిశ్చార్జ్‌కు ఏర్పాట్లు చేశారు. అయితే మీడియా సమావేశంలో కౌశిక్ తల్లి ఎన్టీఆర్‌పై ఆరోపణలు చేయడాన్ని ఆయన అభిమానులు ఖండించారు. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. కౌశిక్ వైద్యం కోసం టీటీడీ రూ. 40 లక్షలు, ప్రభుత్వం రూ. 11 లక్షలు ఇచ్చిందని, ఎన్టీఆర్ అభిమానులు కూడా సుమారు రూ. 10 లక్షల వరకు విరాళంగా అందించారన్నారు. ఏదైనా అవసరముంటే తమను నేరుగా అడిగి ఉంటే సహాయం చేసేవారమని, అనవసరంగా తమ హీరోపై నిందలు వేయడం సరికాదని చెప్పారు.

1.80 లక్షల టన్నుల సన్న ధాన్యం బదిలీ!

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న సన్న ధాన్యాన్ని ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎక్కువ ధాన్యం సేకరించిన జిల్లాల నుంచి.. తక్కువ సేకరించిన జిల్లాలకు సన్నాలను సర్దుబాటు చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ములుగు జిల్లా నుంచి 20 వేల టన్నులను సిద్దిపేటకు, ఖమ్మం నుంచి 40 వేల టన్నులు నల్లగొండకు, వనపర్తి నుంచి 50 వేల టన్నులను రంగారెడ్డికి; మహబూబాబాద్ నుంచి 30 వేల టన్నులు భువనగిరికి, వరంగల్ జిల్లా నుంచి 40 వేల టన్నులు భువనగిరి జిల్లాకు బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. నిబంధనలకు అనుగుణంగా మిల్లులకు కేటాయింపులు చేయాలని సూచించారు.

ట్రాన్స్‌ట్రాయ్ కేసులో 48.71 కోట్ల ఆస్తుల అటాచ్

మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావుకు చెందిన ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీపై నమోదైన కేసులో రూ.48.71 కోట్ల ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. అప్పులిచ్చిన బ్యాంకులను రూ.5115 కోట్ల మేరకు ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ మోసం చేసిందంటూ బెంగళూరు సీబీఐ అధికారులు 2019లో కేసు నమోదు చేశారు. ఆ కేసు ఆధారంగా ఈడీ అధికారులు మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం రాయపాటి సాంబశివరావు, చెరుకూరి శ్రీధర్, సూర్యదేవర శ్రీనివాస బాబ్జీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

బియ్యం సేకరణ బంద్!

రాష్ట్రంలో సేకరణను నిలిపివేసిన ఎఫ్‌సీఐ.. 2023-24 రెండు సీజన్ల బకాయిలు 17 లక్షల టన్నులు

- ఎఫ్‌సీఐ బియ్యం తీసుకోకపోతే రూ.6 వేల కోట్ల భారం
- ఈ నెల 15 నుంచి నిలిచిన బియ్యం డెలివరీ, మిల్లింగ్

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) రాష్ట్రంలో బియ్యం సేకరణను నిలిపివేసింది. గత ఏడాదికి సంబంధించిన ఈ సేకరణను ఆపేసింది. 2023-24 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అప్పగించడానికి కేంద్రం ఇచ్చిన గడువు ఈ నెల 15తోనే ముగిసిపోయింది. దీంతో రాష్ట్రం నుంచి బియ్యం సరఫరా నిలిచిపోయింది. రెండు సీజన్లలో కలిపి 17 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల వద్ద బకాయి ఉంది. మిల్లర్లు సకాలంలో మర ఆడించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇప్పుడు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థపై రూ.6 వేల కోట్ల భారం పడే పరిస్థితి దాపురించింది. సాధారణంగా ఎఫ్‌సీఐ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మధ్య ఒప్పందం ప్రకారం.. ధాన్యం అప్పగించిన 15 రోజుల్లోనే రైస్‌మిల్లర్లు మర ఆడించి, బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలి. కానీ, జీవోలో మాత్రం మూడు నెలల్లో బియ్యం అప్పగించాలనే నిబంధన పెట్టారు. మిల్లర్లు మాత్రం ఏడాదైనా బియ్యం అప్పగించడం లేదు. రోజూ మిల్లర్లు 25-30 వేల టన్నుల బియ్యం డెలివరీ ఇస్తే.. ఎఫ్‌సీఐ నుంచి రూ.90-100 కోట్ల బిల్లు వచ్చేది. ఇప్పుడు అది నిలిచిపోయింది. 2023-24 వానాకాలం సీజన్లో 47.34 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి, మిల్లర్లకు అప్పగించింది. ఈ ధాన్యాన్ని మరాడించి 32 లక్షల టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాలి. ఏడాదిలో 29 లక్షల టన్నుల బియ్యం అప్పగించారు. ఇంకా 3 లక్షల టన్నుల బియ్యం మిల్లర్ల వద్దే మిగిలిపోయాయి. యాసంగికి సంబంధించి 48 లక్షల టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించారు. 33 లక్షల టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంది. కానీ, 19లక్షల టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఇంకా 14లక్షల టన్నుల బియ్యం మిల్లర్ల వద్దే ఉండిపోయింది. మొత్తం కలిపి 17 లక్షల టన్నుల బియ్యం మిల్లర్ల వద్దే ఉంది. వీటి విలువ అక్షరాలా రూ.6వేల కోట్లు కావడం గమనార్హం.

రాష్ట్రంపై రూ.6 వేల కోట్ల భారం

కేంద్ర ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చి.. మిగిలిన బియ్యం తీసుకోకపోతే రాష్ట్రంపై రూ.6వేల కోట్ల ఆర్థిక భారం పడుతుంది. ఇప్పటికే రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ రూ.45వేల కోట్ల అప్పుల్లో ఉంది. ఇప్పుడీ రూ.6 వేల కోట్లు తోడైతే మళ్లీ రూ.50వేల కోట్లు దాటనుంది. వాస్తవానికి సీఎంఆర్ పురోగతిపై గతంలో (ఉమ్మడి రాష్ట్రంలో) జిల్లా స్థాయిలో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు సమీక్షలు నిర్వహించేవారు. అయితే గత పదేళ్లలో ఈ వ్యవస్థ కుంటుపడింది. మిల్లర్ల ఇష్టారాజ్యానికి వదిలేసి చోద్యం చూస్తుండడంతో ఎక్కడికక్కడ బకాయిలు పేరుకుపోయాయి. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి 35 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం వేలం ద్వారా విక్రయించిన విషయం తెలిసిందే. మిల్లర్ల నుంచి ఆ బకాయిలు వసూలు చేయించి, టెండరు ఏజెన్సీలకు ముట్టజెప్పడానికి అధికారులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. టెండరు ధాన్యం అప్పగించని రైస్‌మిల్లర్లపై ఆర్ఆర్ యాక్టులు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. ఇదే తరహాలో సీఎంఆర్‌పై ఎందుక దృష్టి పెట్టడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తప్పు జరిగితే.. వేటు తప్పదు!

- ఇందిరమ్మ ఇళ్ల పథకంలో.. అవినీతి, అక్రమాలకు ఆస్కారమివ్వొద్దు
- పేదవారికి ఇల్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం
- ఇందిరమ్మ కమిటీలతో లబ్ధిదారుల ఎంపిక
- సంక్రాంతి నాటికి ఇళ్ల నిర్మాణం ప్రారంభం
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అవినీతి, అక్రమాలకు ఆస్కారం ఇవ్వొద్దని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. ఎక్కడైనా చిన్న తప్పు జరిగినట్లు తేలినా వేటు తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో అర్హులైన పేదవారికి ఇల్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఏ అధికారిపైనా తనకు ఎలాంటి అభిప్రాయమూ, కోపతాపాలు లేవని, కేవలం పేదవారికి ఇళ్లు ఇవ్వాలనే తపన మాత్రమే ఉందని తెలిపారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం, దరఖాస్తుల పరిశీలన సంబంధిత అంశాలపై ఆ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాశ్, మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్‌లతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణ పనులు చేసేవారికి గ్రీన్‌చానల్ ద్వారా నిధులు విడుదల చేద్దామని, కాంట్రాక్టర్లు ముందుకొస్తే పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం 33 జిల్లాలకు కొత్తగా నియమితులైన ప్రాజెక్టు డైరెక్టర్లకు, పదోన్నతులు పొందినవారికి సంబంధిత పత్రాలను మంత్రి అందజేశారు. ఈ నెల 27న అన్ని కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానన్నారు.



గృహనిర్మాణ సంస్థకు పూర్వ వైభవం..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడంతో గృహనిర్మాణ సంస్థ కార్యాలయానికి పూర్వ వైభవం వచ్చిందని మంత్రి పొంగులేటి అన్నారు. సమీక్ష అనంతరం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి సోమవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల దరఖాస్తుల పరిశీలన జరిగిందని తెలిపారు. జనవరి మొదటి వారంలో 80 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తవుతుందని, ఆ తర్వాత లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి సంక్రాంతి నాటికి ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కేంద్రం అమలు చేసే పీఎంఏవై కింద ఏవైనా దరఖాస్తులు తిరస్కరణకు గురైతే.. వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.

నాలుగు దశల్లో ఆర్థిక సాయం..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయంలో వెనక్కి వెళ్లేదిలేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇళ్లు మంజూరైన వారికి నాలుగు దశల్లో ఆర్థిక సాయం అందిస్తామన్నారు. పథకం అమలు పర్యవేక్షణకు విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కాగా, హైదరాబాద్‌కు నాలుగువైపులా వంద ఎకరాల్లో ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టులను చేపట్టనున్నట్టు మంత్రి తెలిపారు. రాజీవ్ స్వగృహ పరిధిలోని వివిధ టవర్లను త్వరలో వేలం వేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని లేవనెత్తగా.. రాజీవ్ స్వగృహ పరిధిలో వేలం వేసే టవర్లను తీసుకోవడానికి జర్నలిస్టులు సిద్ధంగా ఉంటే నిబంధనల ప్రకారం అందించేందుకు తమకెలాంటి ఇబ్బంది లేదన్నారు. ఈ విషయంపై మీడియా అకాడమీ చైర్మన్‌తో చర్చించాలని శాఖ ఎండీ గౌతమ్‌కు మంత్రి సూచించారు.

క్యాబినెట్ నిర్ణయం ఎక్కడ ఉంది?: హైకోర్టు

» అఫిడవిట్‌పై అభ్యంతరాలతో తెలంగాణ తల్లి విగ్రహాలను మార్చొద్దన్న పిటిషన్ ఉపసంహరణ

హైదరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి రూపం మార్చరాదని, ఇప్పటికే ఉన్న విగ్రహాల స్థానంలో కొత్తగా రూపొందించిన వాటిని ఏర్పాటు చేయకుండా ఆదేశాలివ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను జూలూరు గౌరీశంకర్ ఉపసంహరించుకున్నారు. ఈ పిటిషన్ మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదిస్తూ విగ్రహాలను మార్చడం వల్ల దాదాపు రూ.150 కోట్లు ప్రజాధనం వృథా అవుతుందని పేర్కొన్నారు. అయితే అఫిడవిట్ సరిగా లేదని, ఏ నిర్ణయాన్ని సవాల్ చేస్తున్నారు... పిటిషనర్ వివరాలు ప్రొసీజర్ ప్రకారం లేవని హైకోర్టు పేర్కొంది. విగ్రహాలు మార్చాలన్న క్యాబినెట్ నిర్ణయం ఎక్కడ ఉందనే ప్రస్తావన లేదని వ్యాఖ్యానించింది. సరైన అఫిడవిట్‌తో పిటిషన్ మళ్లీ దాఖలు చేస్తామని, ప్రస్తుత పిటిషన్ ఉపసంహరించుకుంటామని పిటిషనర్ పేర్కొనడంతో హైకోర్టు అనుమతించింది.

నేడు, రేపు మోస్తరు వర్షాలు



హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధ, గురువారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కొనసాగుతోందని పేర్కొంది. రాగల 24 గంటల్లో బలహీనపడే అవకాశం ఉందని తెలిపింది. కాగా, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో మంగళవారం తెల్లవారుజామున 12.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా అన్ని జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 13 నుంచి 22 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

ఫార్ములా-ఈ కేసు..

అప్రూవర్‌గా అర్వింద్‌కుమార్?

(మొదటి పేజీ తరువాయి)

జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఈ కేసులో తనను అరెస్టు చేయకుండా చూడాలంటూ ఆయన ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్టు చెబుతున్నారు. తనకు కావాల్సిన వారి ద్వారా ఆయన ప్రభుత్వంలోని పెద్దలతో రాజీ ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.

అర్వింద్‌కుమార్ పాత్ర ఏమిటి?

ఈ కేసులో అర్వింద్‌కుమార్ పాత్ర ఎక్కువగా ఉన్నట్టు ఇప్పటికే ఏసీబీ గుర్తించింది. క్యాబినెట్ అనుమతి లేకున్నా.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు నిధులను బదిలీ చేశారనే ఆరోపణలున్నాయి. అంతేకాదు.. విదేశీ కంపెనీలకు నిధులను బదిలీ చేయాలంటే.. రాష్ట్ర ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి. ఫారెక్స్ (విదేశీ మారక ద్రవ్యం/బ్రిటన్ పౌండ్ల)కు ఆర్‌బీఐ అనుమతి కూడా అవసరం. అయితే.. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి హోదాలో అర్వింద్‌కుమార్ తొలుత నిధులను బదిలీ చేసి.. ఆ తర్వాత ఒప్పందాలు చేసుకున్నట్టు ఏసీబీ గుర్తించింది. దీంతో ఏసీబీ తొలుత అర్వింద్‌కుమార్‌ను విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన పాత్రపై బలమైన ఆధారాలను సేకరించిన ఏసీబీ.. ఇప్పటికే ముఖ్యమంత్రికి ఓ నివేదికను అందజేసింది. ఆ తర్వాతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయనకు నోటీసు జారీ చేసి, వివరణ తీసుకున్నారు. ఆ క్రమంలో ఆయన "అప్పటి మంత్రి కేటీఆర్ చెబితేనే రూ.55 కోట్లను బదిలీ చేశా" అని వివరణ ఇచ్చుకున్నట్టు సమాచారం.



న్యాయ నిపుణులు కూడా ఏ2గా ఉన్న అర్వింద్ అరెస్టు తప్పదని వివరిస్తున్నారు.

హైకమాండ్ స్థాయిలో..

ఏసీబీ అరెస్టు నుంచి తప్పించుకోవడానికి అర్వింద్ కుమార్ తెరవెనక ప్రయత్నాలు ప్రారంభించినట్టు సమాచారం. ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలను కలిసి.. తనను కాపాడాలని అభ్యర్థించినట్టు అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఆయన అప్రూవర్‌గా మారడం ఒక్కటే మార్గంగా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే.. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిగా, హెచ్ఎండీఏ కమిషనర్‌గా పనిచేసిన అర్వింద్‌కుమార్ అప్పట్లో ఔటర్ రింగ్ రోడ్డు టెండర్ల వ్యవహారంలో అప్పటి పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డికి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే! ఈ నేపథ్యంలో అర్వింద్‌కు కాంగ్రెస్ హైకమాండ్ అండదండ ఉంటాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏమిటీ కేసు..?

ఫార్ములా-ఈ రేస్‌తో హైదరాబాద్‌కు అంతర్జాతీయ బ్రాండింగ్ వస్తుందని గత ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసింది. 2023లో తొలిసారి రేస్ నిర్వహించిన ప్రభుత్వం.. 2024లో మరోసారి నిర్వహణకు విదేశీ సంస్థతో రూ.100 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో ముందస్తుగా రూ.55 కోట్లను రేస్ నిర్వాహణలో నేడల్ ఏజెన్సీగా వ్యవహరించిన మునిసిపల్ శాఖ ద్వారా చెల్లించింది. గత ఏడాది డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తొలినాళ్లలోనే ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగినట్టు గుర్తించింది. దాంతో.. పార్ములా-ఈ రేసింగ్‌కు సంబంధించి విదేశీ కంపెనీతో ఉన్న ఒప్పందాలను రద్దుచేసుకుంది. ఆ తర్వాత ప్రభుత్వ ఆదేశాలతో మునిసిపల్ శాఖ ఈ వ్యవహారంపై ఏసీబీకి ఫిర్యాదు చేయడం.. కేసు నమోదవ్వడం తెలిసిందే! ఈ కేసులో కేటీఆర్‌ను ఏ1గా చేర్చిన ఏసీబీ.. అంతకు ముందే గవర్నర్ అనుమతి తీసుకుంది. కేటీఆర్ కంటే ముందే.. అర్వింద్‌కుమార్ మెడకు ఉచ్చు బిగుసుకుంటుండడంతో.. అత్యధికంలో ఇప్పుడు ఆయన.. అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే.. అర్వింద్‌ను విచారించి, ఆయన ఇచ్చే వాంగ్మూలం మేరకు కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసేదిశలో ఏసీబీ వేగంగా ముందుకు సాగుతున్నట్టు సమాచారం.

హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌కు ఊరట

» భూపాలపల్లి జిల్లా కోర్టు నోటీసుల సస్పెన్షన్

» జిల్లా కోర్టు అధికార పరిధి మీరిందని హైకోర్టు వ్యాఖ్య



హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు జారీ చేసిన నోటీసులను హైకోర్టు సస్పెండ్ చేసింది. జిల్లా కోర్టు తన అధికార పరిధిని మీరి వ్యవహరించిందని పేర్కొంది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కేసీఆర్ తదితరుల అవినీతే కారణమని పేర్కొంటూ నాగవెల్లి రాజలింగమూర్తి అనే వ్యక్తి మొదట భూపాలపల్లి మెజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారు. దాన్ని విచారించే పరిధి తమకు లేదంటూ ఆ కోర్టు తోసిపుచ్చింది. అవినీతి నిరోధక చట్టం కింద కేసులను విచారించే ప్రత్యేక కోర్టుకు మాత్రమే పరిధి ఉంటుందని పేర్కొంది. దీంతో ఫిర్యాదుదారు భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రివిజన్ పిటిషన్‌ను విచారించే అధికార పరిధి జిల్లా కం సెషన్స్ కోర్టుకు లేదని కోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపింది. అయితే ఈ అభ్యంతరాలను పరిశీలించిన జిల్లా కోర్టు.. పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ, విచారణ జాబితాలో కేసీఆర్, హరీశ్‌రావు, అప్పటి నీటిపారుదల శాఖ కార్యదర్శి రజత్‌కుమార్, అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు హరిరామ్, శ్రీధర్, మేఘా నిర్మాణ సంస్థ అధినేత కృష్ణారెడ్డి, ఎల్ అండ్ టీ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది టీవీ రమణారావు వాదిస్తూ, సీఆర్పీసీ నిబంధనల ప్రకారం రివిజన్ పిటిషన్‌ను జిల్లా కోర్టు స్వీకరించడానికి వీల్లేదని తెలిపారు. జిల్లా కోర్టు జూలై 10న ఇచ్చిన ఆదేశాలను, నోటీసులను కొట్టేయాలని కోరారు. రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ రివిజన్ పిటిషన్‌ను ఎందుకు స్వీకరించాల్సి వచ్చిందో జిల్లా కోర్టు స్పష్టంగా వివరించిందని, కాబట్టి అందులో జోక్యం చేసుకోకూడదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ దశలో దీనిని ప్రైవేటు ఫిర్యాదుదారుడు మధ్య వ్యవహారమని, ఇందులో ప్రభుత్వ పాత్ర లేదని వ్యాఖ్యానించింది. రాజలింగమూర్తికి నోటీసులు జారీ చేస్తూ విచారణను జనవరి 7కు వాయిదా వేసింది.

హెచ్‌పీఎస్ మాకెన్నో జ్ఞాపకాలను ఇచ్చింది!

» మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, అడోబ్ సీఈవో శంతను నారాయణ్

» శతాబ్ది ఉత్సవాల్లో ఫ్లైట్ ఆఫ్ ది ఈగల్ పుస్తకావిష్కరణ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): "హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో చేరిన రోజును ఇప్పటికీ మరిచిపోలేదు. బస్కెట్స్ స్కూల్‌కు రావడం, స్నేహాలను కలవడం నుంచి ఎన్నో తీపిగుర్తులు ఇక్కడ ఉన్నాయని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అన్నారు. తన మీద తనకు విశ్వాసం కలిగించింది ఈ పాఠశాలేనని చెప్పారు. తాను ఏడో తరగతిలో హెచ్‌పీఎస్‌లో చేరానని, తన తండ్రికి తరచు బదిలీలతో వేర్వేరు నగరాలకు తిరిగినా, హైదరాబాద్‌లోనే కొన్ని స్థిరంగా ఉన్నామని గుర్తుచేసుకున్నారు. తన ఏడో తరగతి తరువాత తన తండ్రికి మళ్లీ బదిలీ అవ్వడంతో, తమతో పాటు రావాల్సిందేనని ఆయన అన్నా తాను మాత్రం పట్టుబట్టి ఇక్కడే హాస్టల్‌లో ఉండి చదివానని చెప్పారు. బేగంపేటలోని హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఫ్లైట్ ఆఫ్ ద ఈగల్ పుస్తకాన్ని మంగళవారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు సత్య నాదెళ్ల, అడోబ్ సీఈవో శంతను నారాయణ్



ఉత్సవాల్లో ఫ్లైట్ ఆఫ్ ది ఈగల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, అడోబ్ సీఈవో శంతను నారాయణ్

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్య నాదెళ్ల మాట్లాడుతూ ఓ విద్యా సంస్థ 101 సంవత్సరాలుగా నిలిచి ఉండటమే కాకుండా కాలానికి అనుగుణంగా మారుతూ ఎంతోమందిని తీర్చిదిద్దుతున్న తీరు స్ఫూర్తిదాయకమని చెప్పారు. చదువంటే గణితం లేదా కొన్ని నైపుణ్యాలు నేర్వడం మాత్రమే కాదని, విద్యార్థుల ఉన్నతాశయాలు ఏర్పరుచుకునేలా శక్తి సామర్థ్యాలు ఇవ్వడం, వారి కలలకు రెక్కలు తొడిగే సాకారమయ్యేలా తీర్చిదిద్దడమని పేర్కొన్నారు. శంతను నారాయణ్ మాట్లాడుతూ తాను ఈ స్కూల్‌లో చాలా సంవత్సరాలు క్రీడా వార్తలు చదివానని, టెన్నిస్ ఆడేవాడినని, డిబేట్, లీడర్‌షిప్ జట్టులో ఉండేవాడినని, గుర్తుచేసుకున్నారు. ఈ స్కూల్‌కు సత్య నాదెళ్ల చేసిన సేవ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పుస్తకంలో వందేళ్ల హెచ్‌పీఎస్ చరిత్ర, విజయాలు మాత్రమే కాకుండా తీర్చిదిద్దుకున్న వ్యక్తుల, స్ఫూర్తి ప్రదాతలను పరిచయం చేసిందని పుస్తక ఎడిటర్ కిశోర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీఎస్ ప్రిన్సిపాల్ స్కందన్ బాలి, వైస్ ప్రిన్సిపాల్ అమృత చంద్ర రాజు, హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీ జెనోరియా, ఉపాధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్, కందూర్ చంద్రశేఖర్ రెడ్డి, సంజీవ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు పైపైకి..!

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోతున్న మొత్తం కూడా పెరుగుతోంది. అరెస్టులు, రికవరీలు మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండడం లేదనే విమర్శలున్నాయి. సైబర్ నేరాల్లో సైబరాబాద్ టాప్‌లో ఉండగా.. ఆ తర్వాతి స్థానాలను రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లు ఆక్రమించాయి.

సైబర్ నేరాల తీరు ఇలా..

కేసులు	అరెస్టులు		కొల్లగొట్టిన మొత్తం
సైబరాబాద్	11,914	53	రూ.793 కోట్లు
రాచకొండ	4,458	53	(డేటా అందుబాటులో లేదు)
హైదరాబాద్	4,042	280	రూ.301 కోట్లు

డ్రగ్స్	కేసులు	అరెస్టులు	సీజ్ చేసిన డ్రగ్స్ (కిలోలు)
హైదరాబాద్	322	505	13.50
సైబరాబాద్	421	954	24.92
రాచకొండ	253	521	88

ప్రమాదాలు	కేసుల సంఖ్య	క్షతగాత్రులు	మరణాలు
హైదరాబాద్	2,322	3,065	303
సైబరాబాద్	2,332	805	842
రాచకొండ	3,207	2,583	653

డ్రగ్స్ కేసుల్లో పెరిగిన అరెస్టులు

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలని ప్రభుత్వం కంకణం కట్టుకున్న నేపథ్యంలో.. ప్రత్యేక విభాగాలు మరింత పనిచేస్తున్నాయి. ఫలితంగా అరెస్టుల సంఖ్య పెరుగుతోంది. గంజాయి, డ్రగ్స్ పెడ్లర్లు హైదరాబాద్ రావాలంటేనే జంకుతున్నారని పోలీసులు చెబుతున్నారు. పెడ్లర్లనే కాకుండా.. మూలాలను వెతుక్కుని పోలీసులు.. గోవా, బెంగళూరు, ముంబై, రాజస్థాన్, గుజరాత్‌లో ఉంటున్న కింగ్‌పిన్‌ల పీచమణుస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో తగ్గిన మరణాలు

కూడళ్ల మూసివేత, యూటర్న్‌ల పెంపు.. ట్రిపుల్-రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్.. డ్రంకెన్ డ్రైవ్‌లతో ట్రాఫిక్ పోలీసులు రోయంబవల్ల విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తుండడంతో.. ట్రైకమిషనరేట్లలో రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గుతోంది. నిబంధనలను పదేపదే ఉల్లంఘించినవారి లైసెన్సులను మోటారు వాహన సవరణ చట్టం కింద సస్పెండ్ చేస్తుండడం, జైలు శిక్షలు విధిస్తుండడంతో ప్రజల్లో నిబంధనలపై అవగాహన పెరుగుతోందని పోలీసులు చెబుతున్నారు. ఫలితంగా ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య స్వల్పంగా పెరిగినా.. మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టాయని వివరిస్తున్నారు.

మహిళలపై పెరుగుతున్న నేరాలు

షీటీమ్స్ వంటి విధానాలు అమల్లో ఉన్నా.. నిర్భయ వంటి కఠిన చట్టాలు అమలవుతున్నా.. ట్రై కమిషనరేట్లలో మహిళలపై నేరాలకు అడ్డుకట్ట పడడం లేదు. చిన్నారులపై నేరాలు కూడా పెరిగాయి. మహిళలపై వేధింపుల కేసులు

	అత్యాచారాలు	కిడ్నాప్	వేధింపులు	పోక్సో కేసులు
హైదరాబాద్	584	162	1,690	–
రాచకొండ	384	233	1,222	392



హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2.3%, సైబరాబాద్‌లో 8%, రాచకొండలో 9% మేర పెరగడం గమనార్హం..!

చుక్కలు చూపిస్తున్న ఆర్థిక నేరగాళ్లు

హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధుల్లో ఆర్థిక నేరగాళ్లు పేట్రేగిపోతున్నారు. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు, స్కీములు, భారీ లాభాలు పేర్లతో అరచేతిలో వైకుంఠం చూపుతూ.. అందినకాడికి దండుకుంటున్నారు. ఆర్థిక నేరాల్లు ఈ ఏడాది సైబరాబాద్‌లో రూ.3 వేల కోట్లు, హైదరాబాద్‌లో రూ.వెయ్యి కోట్ల మేర కొల్లగొట్టారు. ఫ్రీలాంచ్ పేర్లతో మల్టీలెవల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం-గొలుసుకట్టు వ్యాపారం)లను పరిచయం చేస్తున్నారు. ఆర్థిక నేరగాళ్లు తాము దోచుకున్న మొత్తాన్ని ఎప్పటికప్పుడు విలాసాలకు వినియోగిస్తుండడంతో.. అరెస్టులు మినహా.. రికవరీలు, ఆస్తుల ఫ్రీజింగ్ జరగడం లేదు. పైగా.. పోలీసులు బలమైన కౌంటర్లను దాఖలు చేయకపోవడం వల్ల.. నిందితులు యథేచ్ఛగా బెయిల్‌పై బయటకు వస్తున్నారు. కొత్త నేరాలు చేస్తున్నట్టు నేర గణాంకాలు చెబుతున్నాయి.

కేజీబీవీ టీచర్ల సమ్మెతో.. ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యూటేషన్!

హైదరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ, మోడల్ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమ్మె నేపథ్యంలో ఆ పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం ఉన్నతాధికారులు ఆదేశాలను జారీ చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, జీతాలను పెంచాలని రాష్ట్రంలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది 15 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దాంతో ఈ పాఠశాలల్లో విద్యాబోధన సరిగ్గా జరగడం లేదు. మరోవైపు.. పదవ తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఈ క్రమంలో ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను డిప్యూటేషన్‌పై కేజీబీవీ, మోడల్ పాఠశాలలకు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమీపంలోని పాఠశాలల నుంచి తాత్కాలిక పద్ధతిలో డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించడానికి వీలుగా ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో 479 కేజీబీవీ పాఠశాలల్లో సుమారు 1.25 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో కొన్ని ఇంటర్ కాలేజీలు కూడా ఉన్నాయి.

రెవెన్యూ సర్వీస్ నిబంధనల సవరణ

» గ్రూప్-1 అధికారుల అభ్యంతరం.. సీఎం ముఖ్యకార్యదర్శికి లేఖ

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులకు సంబంధించి నిబంధనలను పక్కన పెట్టి కొంత మంది అధికారులకు లబ్ధి చేకూర్చేలా నిబంధనలను సవరించడం రెవెన్యూ అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు పొందిన తహసీల్దార్ క్యాడర్ అధికారులను ఏకంగా ఐఏఎస్ హోదా కల్పించేలా అందుకు ఎక్కడలేని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం నుంచి ఆమోదం తీసుకురావడంపై గ్రూప్-1 ద్వారా నియామకమైన డిప్యూటీ కలెక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ సీఎంవో ముఖ్యకార్యదర్శికి లేఖ రాయడం చర్చనీయాంశమైంది. తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు పొందిన తహసీల్దార్ క్యాడర్‌కు చెందిన వారికి పదోన్నతి కల్పించి.. మరో డిప్యూటీ కలెక్టర్లు అయిన వారికి ఐఏఎస్ పదోన్నతి కల్పించేలా తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీస్ రూల్స్-1992ను, తెలంగాణ సబార్డినేట్ సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించడంపై పునరాలోచన చేయాలని కోరుతూ లేఖ రాసినట్టు తెలిసింది. ఈ సవరణల వల్ల 2026లో ఐఏఎస్ పదోన్నతి పొందాల్సిన 2017 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అధికారుల పదోన్నతులు వెనక్కు వెళ్లే ప్రమాదం ఉందని వాపోతున్నట్టు తెలిసింది. నిబంధనల సవరణలో ఓ మంత్రి దగ్గర పీఎస్‌గా చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ అధికారి ఒకరు, సీఎంవో ముఖ్యకార్యదర్శి పట్టుబడి తమకు అనుకూలంగా నిబంధనలు సవరించుకున్నట్టు రెవెన్యూ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. డిప్యూటీ కలెక్టర్ రెగ్యులర్ ప్యానెల్‌ను 1994-95 నుంచి 2013-14 వరకు (ఉంటే1-6-2014 వరకు) ఉమ్మడి ఏపీలో ఖరారు చేశారు. అనంతరం సీసీ యాక్టిక్ చేయాలని తెలంగాణలో 151మంది తహసీల్దార్లకు తాత్కాలిక ప్రాతిపదికన అడ్‌హాక్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు పొందారు. ఇప్పుడు నిబంధనలు సవరించడంతో ఆధ్వర్యంలో వీరిలో 70శాతం మంది ఐఏఎస్ పదోన్నతి రేసులోకి వస్తారు. దీని వల్ల గ్రూప్-1 ద్వారా నేరుగా నియామకమయ్యే అధికారులు సకాలంలో పదోన్నతులు అందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదముందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని గ్రూప్-1ద్వారా నియామకమైన అధికారులు ప్రభుత్వాన్ని కోరినట్టు సమాచారం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బతుకు చిత్రాల స్రష్ట

'భారతీయ వెండితెరపై గ్రామీణ భారతదేశానికి సరైన ప్రాతినిధ్యం లభించలేదని నేను ఎప్పుడూ భావిస్తుంటాను' అని శ్యామ్ బెనగల్ ఒకసారి అన్నారు. సమాంతర చిత్రాలుగా సుప్రసిద్ధమైన కళాత్మక చిత్రాల సృష్టిని 1970, 80లలో సమున్నత స్థాయికి తీసుకువెళ్లిన ఆ అద్వితీయ సృజనశీలి అభిప్రాయం ఆయన తొలిచిత్రాల నవ్య పథాన్ని చెప్పకనే చెప్తుంది. అంకుర్ (1974), నిషాంత్ (1975) మంథన్ (1976)తో భారతీయ సినీ ప్రేక్షకులకు అవి ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాయి. భారతీయ సమాంతర సినిమాల చరిత్రలో అంకుర్ ఒక మైలురాయి. గ్రామాలలో కుల, జెండర్ అసమానతలను చూపిన చిత్రమది. భూస్వామ్య అణచివేతలపై తిరుగుబాటు అనివార్యమనే సత్యాన్ని నిషాంత్ స్పష్టం చేసింది. గుజరాత్‌లో వెల్లువెత్తిన శ్వేత విప్లవానికి కళాత్మక నివాళి మంథన్. ఐదు లక్షల మంది రైతులు తలా రెండు రూపాయలతో ఈ చిత్ర నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చారు. ఈ మూడు సినిమాలు స్వాతంత్ర్య తొలి దశాబ్దాలలో గ్రామీణ భారతంలోని పరిస్థితులకు అద్దం పట్టాయి. బెనగల్ సినిమాలు ఆనాటి పల్లెల్లో భూస్వామ్య అభిజాత్యాలు, అణగారిన బతుకులకు నిలువెత్తు దర్పణాలు. ఈ సినిమాలు, ఆ మాటకు వస్తే బెనగల్ చిత్రాలు ఏవైనా సరే చూసిన తరువాత భారత్ ఒకప్పుడు ఎలా ఉన్నది, ఇప్పుడు ఎలా ఉన్నది, ఎలా ఉండాలనే విషయమై మీ ఆలోచనల్లో మార్పు చోటుచేసుకోవచ్చు.

శ్యామ్ బెనగల్ తన సినిమాలలో మొదటి నుంచీ మహిళా పాత్రలను ప్రధానస్రవంతి సినిమాలకు విభిన్నంగా, నవ్య రీతులలో చూపించేందుకు నిబద్ధమయ్యారు. మహిళల స్వతస్సిద్ధ ఔన్నత్యాన్ని, పరిస్థితులకు తల వంచని చైతన్యాన్ని ఆ స్త్రీ పాత్రలు మూర్తీభవించి ఉంటాయి. 'బెనగల్ స్త్రీ వాది అయివుంటారని' ప్రగతిశీల విదుషీమణులు అభిప్రాయపడ్డారంటే ఆయన సినిమాలలోని స్త్రీ పాత్రలు ఎంత విలక్షణమైనవో అర్థం చేసుకోవచ్చు. కులం, వర్గం, మతం, జెండర్ అసమానతలు, అణచివేతలకు బలవుతున్న అభాగ్య జీవితాలను చిత్రించినప్పటికీ ప్రధానస్రవంతి సమాజంపై ఆయన ఆగ్రహావేశాలు వ్యక్తం చేయలేదు. ఆయన సినిమాలు ప్రశ్నలు లేవనెత్తుతాయికాని ఏ పక్షమూ వహించవు. 1974–2023 మధ్య 24 కళాత్మక సినిమాలతో పాటు ఎన్నో టెలివిజన్ సీరియల్స్, బయోపిక్‌లు, డాక్యుమెంటరీలు శ్యామ్ బెనగల్ నిర్మించారు. 'సినిమా స్రష్ట కావడం ఒక రచయిత లేదా చిత్రకారుడుగా ఉండడం లాంటిదే. సినిమా నిర్మాణ వ్యాసంగం మీకు స్పష్టతనే కాదు, ప్రపంచ దృక్పథాన్ని కూడా ఇస్తుంది. అది ఎంత స్థానికమో అంత విశ్వజనీనమైనది. మరే వృత్తి మీకు ఇలాంటి దృక్పథాన్ని భావ వైచిత్రిని ఇవ్వగలుగుతుంది? మీరు సినిమా సృజనలో ఉండడమంటే ఒక ప్రయోగశాలలో సూక్ష్మదర్శినితో పాటు దూరదర్శిని ద్వారా జగత్తును వీక్షిస్తున్న వైజ్ఞానికునిలా ఉండడమే' అని బెనగల్ అంటారు. భారతదేశ ఉత్కృష్ట నటీనటులు పలువురు బెనగల్ సినిమాలలో నటించడమో లేదా వాటి ద్వారా పరిచయమవ్వడమో జరిగింది. స్మితా పాటిల్, షబనా అజ్మీ, నసీరుద్దీన్ షా, ఓంపురి, అమ్రిష్‌పురి, అనంతనాగ్, నీనా గుప్త, మోహన్ అగాసె తదితరులు వారిలో కొందరు మాత్రమే. తెలుగు నటి వాణిశ్రీ ఆయన దర్శకత్వం వహించిన ఏకైక తెలుగు సినిమా 'అనుగ్రహం'లో నాయికగా జీవించారు.

శ్యామ్ బెనగల్ పూర్వీకులు కొంకణ్ ప్రాంతానికి చెందినవారు. ఆయన హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగారు, విద్యాభ్యాసమంతా ఈ నగరంలోనే జరిగింది. తెలంగాణతో ఆయనకు అనుబంధం ఉన్నది. తన సినిమాలలో దక్కనీ కవిత్వాన్ని ఆయన ఉపయోగించుకున్నారు. తొలి సినిమాలో సంభాషణలు దక్కనీ ఉర్దూలో ఉంటాయి. అంకుర్, నిషాంత్, మరికొన్ని సినిమాలను తెలంగాణ గడ్డపైనే ఆయన చిత్రీకరించారు. ఇక్కడి గంగా–యమున తెహజీబ్ సంస్కృతికి ఆయన వారసుడు. నెహ్రూ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'ను భారత్ ఏక్ ఖోజ్ పేరిట 53 భాగాల టెలివిజన్ సిరీస్‌ను బెనగల్ నిర్మించారు. శ్యామ్ బెనగల్ కళా స్రష్టగానే కాదు, భారత పౌరుడుగా కూడా తన బాధ్యతలను భారత రాజ్యాంగ నైతికతా నిష్ఠతో నిర్వహించిన ఉదాత్తుడు. భారత రాజ్యాంగ నిర్మాణ ఇతిహాసంపై 'సంవిధాన్' పేరిట ఆయన ఒక టీవీ డాక్యుమెంటరీని నిర్మించారు. ఆ ఆధునిక భారతీయ ధర్మ గ్రంథం అమృతోత్సవం జరుపుకుంటున్న ప్రస్తుత సందర్భంలో బెనగల్ 'సంవిధాన్'ను పాఠశాల బాలలు, కళాశాల యువతకు ప్రత్యేకంగా ప్రదర్శించడమూ ఆయనకు సముచిత నివాళి అవుతుంది.

అటల్‌జీ శత జయంతి వేళ ఆయన ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేందుకు మనల్ని మనం పునరంకితం చేసుకోవాలి. ఆయన అనుసరించిన సుపరిపాలన, ఐక్యత, ప్రగతి అనే నియమాలను ప్రతిబింబించే భారత్‌ను నిర్మించడానికి మనం కృషి చేద్దాం. మన దేశ సామర్థ్యంపై అటల్‌జీకి ఉన్న అచంచలమైన విశ్వాసం ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, కష్టపడి పనిచేసేలా మనల్ని ప్రేరేపిస్తుంది.




ఆయన రాజనీతిజ్ఞత జాతికి ప్రగతి బాట

ఈ రోజు, డిసెంబర్ 25–మనందరికీ ప్రత్యేకమైన రోజు. దేశ ప్రజలు ప్రియతమ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయీ జీ శతజయంతిని జరుపుకొంటున్న వేళ ఇది. ఆయన ఎంతో మందికి ప్రేరణను ఇస్తూ ఒక రాజనీతికోవిదుడుగా సమున్నత స్థానంలో నిలిచారు.

దేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపిన మహనీయునిగా అటల్ జీకి మన దేశ ప్రజలు ఎన్నటికీ రుణపడి ఉంటారు. ఆయన 1998లో ప్రధానిగా పదవీప్రమాణం స్వీకరించిన తరుణంలో... మన దేశం రాజకీయ అస్థిరత్వంతో కొట్టుమిట్టాడుతోంది. దాదాపు తొమ్మిదేళ్లలో నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికలు జరగడాన్ని మనం చూశాం. దేశ ప్రజానీకం సహనాన్ని కోల్పోతూ, ఈ ప్రభుత్వాలు వాటి బాధ్యతను సమర్థంగా నిర్వర్తించగలుగుతాయా? అనే అనుమానంలో పడిపోయారు. ఈ స్థితిని అటల్ జీ మార్చివేసి స్థిరమైన, ప్రభావవంతమైన పాలనను అందించారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన అటల్‌జీ సామాన్య పౌరుల కష్టాలు అర్థం చేసుకున్నారు. ప్రభుత్వానికి దక్షత ఉంటే ఎంతటి పరివర్తనను తీసుకురావచ్చో ఆయన చేతల్లో చూపించారు.

అటల్ జీ నాయకత్వం ఎన్నో రంగాల్లో చాలాకాలం పాటు గణనీయ ప్రభావాన్ని చూపించింది. ఆయన పదవీ కాలంలో సమాచార సాంకేతిక విజ్ఞానం (ఐటీ), టెలికం, కమ్యూనికేషన్స్ రంగాల్లో గొప్ప పురోగతి చోటుచేసుకొంది. యువశక్తి అత్యంత చైతన్యవంతంగా ఉన్న భారత్ వంటి ఒక దేశానికి ఇది చాలా ముఖ్యం. అటల్ జీ నాయకత్వంలో ఏర్పాటైన ఎన్‌డీఏ ప్రభుత్వం టెక్నాలజీని సామాన్య పౌరులకు అందుబాటులోకి తేవడానికి చాలా శ్రద్ధ తీసుకుంది. అదే సమయంలో భారత్‌లో సంధాన సదుపాయాల కల్పన విషయంలోనూ ముందుచూపు కనిపించింది. స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టును ఈనాటికీ చాలా మంది గుర్తు పెట్టుకుంటున్నారు. సామాజిక రంగం విషయానికి వస్తే, సర్వ శిక్షా అభియాన్ వంటి కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రజలకు, ముఖ్యంగా పేదలకూ, సమాజంలో ఆదరణకు నోచుకోకుండా ఉండిపోయిన వర్గాలవారికీ ఆధునిక విద్యను అందుబాటులోకి తేగలిగే ఒక భారత దేశాన్ని ఆవిష్కరించాలని అటల్ జీ కన్న కలను గురించి ప్రధానంగా చెబుతుంది. అలాగే, ఆశ్రిత పక్షపాతం, దశాబ్దాల పాటు ఎదుగూబొదుగూ లేని ఆర్థిక ఆలోచనా విధానాలతో సాగిన దేశంలో... ఆర్థిక పురోగతికి బాటవేసి, అనేక ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టేందుకు ఆయన ఆధ్వర్యంలోని ప్రభుత్వం చొరవ తీసుకుంది.

వాజపేయీ అద్భుత నాయకత్వానికో చక్కటి ఉదాహరణ 1998 వేసవిలో జరిగిన ఒక సంఘటనే అందుకు తార్కాణం. ఆయన ప్రభుత్వం మే 11న పదవీ బాధ్యతలు చేపట్టింది. వెనువెంటనే పోఖ్రాన్‌లో అణు పరీక్షలను నిర్వహించింది, 'ఆపరేషన్ శక్తి' పేరిట ఈ పరీక్షలు ప్రసిద్ధమయ్యాయి. ఈ పరీక్షలు భారత్ శాస్త్రవేత్తల శక్తిని నిరూపించాయి. భారత్ ఈ రకమైన పరీక్షలను నిర్వహించడమా? అని ప్రపంచం విస్తుపోయింది. ప్రపంచ దేశాలు వాటి ఆగ్రహాన్ని చాలా స్పష్టంగా వ్యక్తం చేశాయి. ఆ సమయంలో ఏ సామాన్య నేత అయినా ఒత్తిడికి తలొగ్గేవారు. కానీ, అటల్ జీ భిన్నమైన వ్యక్తి. అప్పుడు జరిగిందేమిటి? భారత్ దృఢంగా నిలబడటమే కాక, మరో రెండు రోజుల తరువాత అంటే మే 13న రెండో దఫా పరీక్షలు నిర్వహించింది. 11వ తేదీ నాటి పరీక్షలు విజ్ఞానశాస్త్ర నైపుణ్యాన్ని చాటితే, 13వ తేదీన నిర్వహించిన పరీక్షలు సిసలైన నాయకత్వం అంటే ఏమిటో రుజువుచేశాయి. బెదిరింపులకో, ఒత్తిడికో లొంగిపోయే రోజులు గతించిపోయాయని ప్రపంచానికి ఆయన ఒక సందేశాన్ని పంపారు.



భారత ప్రజాస్వామ్య వ్యవస్థను, దాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని అటల్‌జీ అర్థం చేసుకున్నారు. దేశ రాజకీయాల్లో సంకీర్ణాలను పునర్నిర్వచించిన ఎన్‌డీయేకు అటల్‌జీ నాయకత్వం వహించారు. అందరినీ ఒక్కచోట చేర్చి అభివృద్ధి, జాతీయ ప్రగతి, ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చే శక్తిగా ఎన్డీయేను తయారుచేశారు. ఆయన రాజకీయ ప్రయాణంలో అడుగడుగునా రాజనీతిజ్ఞత కనిపిస్తుంది. గుప్పెడు మంది ఎంపీలున్న పార్టీకి చెందిన నాయకుడు అయినప్పటికీ ఆయన మాటలు ఆ సమయంలో శక్తిమంతమైన కాంగ్రెస్ పార్టీని గడగడలాడించేవి. ప్రధానమంత్రిగా తనదైన శైలిలో విపక్షాల విమర్శలను తిప్పికొట్టేవారు.

అధికారం కోసం ఏనాడూ ఆయన అవకాశవాద రాజకీయాలకు పాల్పడలేదు. 1996లో ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఆయన రాజీనామా చేయడానికి మొగ్గు చూపారే తప్ప, ఎలాంటి నీచ రాజకీయాలకు, బేరసారాలకు పాల్పడలేదు.. 1999లో కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో ఆయన ప్రభుత్వం కూలిపోయింది. ఆ సమయంలో జరిగిన అనైతిక రాజకీయాలను సవాలు చేయమని చాలా మంది చెప్పినప్పటికీ ఆయన మాత్రం న్యాయబద్ధంగానే ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. చివరకు అద్భుతమైన ప్రజాతీర్పుతో తిరిగి అధికారాన్ని చేపట్టారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే విషయంలో అటల్‌జీ ఉన్నత స్థానంలోనే ఉంటారు. డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదానం ఆయనను తీవ్రంగా ప్రభావితం చేసింది. కొన్నేళ్ల తర్వాత జరిగిన ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో ఆయన ప్రధాన భూమిక పోషించారు. అత్యయిక పరిస్థితి తర్వాత, 1977 ఎన్నికలకు ముందు తాను స్థాపించిన (జన్ సంఘ్) పార్టీని జనతా పార్టీలో విలీనం చేసేందుకు ఆయన అంగీకరించారు. ఇది ఆయనతో పాటు ఇతరులను సైతం బాధించిన నిర్ణయమని నేను భావిస్తున్నాను. కానీ రాజ్యాంగాన్ని పరిరక్షించడమే ఆయనకు ప్రధానం.

భారతీయ సంస్కృతితో అటల్‌జీ ఎంతగా మమేకమయ్యారో కూడా గమనించాల్సిందే. వాజపేయీజీ ఐక్యరాజ్యసమితిలో హిందీలో ప్రసంగించిన తొలి భారతీయ నేతగా నిలిచారు. భారతీయ వారసత్వం, గుర్తింపు పట్ల ఆయన ఎంత గర్వంగా ఉండేవారో అంతర్జాతీయ వేదికపై చెరగని ముద్ర వేసిన ఈ ఒక్క ఉదాహరణ చాలు. అటల్‌జీ వ్యక్తిత్వం అయస్కాంతం లాంటిది. ఆయన జీవితం సాహిత్యం, అభివ్యక్తి పట్ల ప్రేమతో నిండిపోయింది. ఆయన ఓ గొప్ప రచయిత, కవి. స్ఫూర్తి నింపేందుకు, ఆలోచనలను రేకెత్తించేందుకు, ఓదార్పును అందించేందుకు తన మాటలను ఉపయోగించేవారు. ఆయన అంతర్మథనానికి, దేశం పట్ల ఉన్న ఆకాంక్షలకు ఆయన కవిత్వం అద్దం పడుతుంది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రజలందరినీ ఉత్తేజపరుస్తూనే ఉంటుంది.

అటల్‌జీ నుంచి నేర్చుకొనే, సంభాషించే అవకాశం దక్కడం నాలాంటి ఎంతో మంది భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఓ గొప్ప వరం. బీజేపీకి ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివి. ఆ రోజుల్లో కాంగ్రెస్ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా నిలిచిన ఒక దీటైన నేత వాజపేయీజీ. పార్టీ తొలినాళ్ళ నుంచి ఎటువంటి సవాళ్లు ఎదురైనప్పటికీ ఎల్‌కే అద్వాణీ, డా. మురళీ మనోహర్ జోషి లాంటి దిగ్గజాలతో కలసి వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ పార్టీని విజయపథంలో నడిపించారు. సిద్ధాంతం, అధికారం మధ్య ఒకదాన్ని ఎంచుకోవాల్సిన సందర్భాలు ఎదురైతే ఆయన మొదటిదానినే ఎంచుకొనేవారు. కాంగ్రెస్ చూపిస్తున్న ప్రపంచాన్ని కాకుండా, మరో దృక్కోణంలో ప్రపంచాన్ని చూడటం సాధ్యమేనని ఆయన దేశాన్ని ఒప్పించగలిగారు.

అటల్‌జీ శత జయంతి వేళ ఆయన ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేందుకు మనల్ని మనం పునరంకితం చేసుకోవాలి. ఆయన అనుసరించిన సుపరిపాలన, ఐక్యత, ప్రగతి అనే నియమాలను ప్రతిబింబించే భారత్‌ను నిర్మించడానికి మనం కృషి చేద్దాం. మన దేశ సామర్థ్యంపై అటల్‌జీకి ఉన్న అచంచలమైన విశ్వాసం ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, కష్టపడి పనిచేసేలా మనల్ని ప్రేరేపిస్తుంది.


• **నరేంద్ర మోదీ**
భారత ప్రధానమంత్రి

చరిత్రపై గెలిచిన అంబేడ్కర్

'నన్ను రాహుల్ గాంధీ తోసేశారు' అని బీజేపీ ఎంపీ ముఖేశ్ రాజపుత్ ఆరోపించారు. 'ముఖేశ్ రాజపుత్ నాపై పడితే నేను క్రింద పడ్డాను. నా తలకు గాయం తగిలింది' అని మరో బీజేపీ ఎంపీ ప్రతాప్ సారంగి చెప్పారు. 'నన్ను క్రింద పడేశారు. నేను లేచి కుంటుకుంటూ సభలోకి వెళ్లాను' అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. 'రాహుల్ నాకు చాలా సమీపంగా వచ్చాడు. దానితో నాకెంతో భయం వేసింది.' అని మరో మహిళా ఎంపీ అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఇంత ఘోరమైన ఆరోపణల మధ్య ముగుస్తాయని ఏనాడు ఎవరూ ఊహించలేదు. ఒకప్పుడు అసెంబ్లీల పనితీరును విమర్శించేవారు. కాని ఇప్పుడు పార్లమెంట్ సమావేశాలు అసెంబ్లీ సమావేశాల కన్నా దారుణంగా తయారయ్యాయి. పార్లమెంట్ ఆవరణలో ఎంపీలు ఒకర్నొకరు తోసేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో ఉభయ సభల్లో కూడా జరిగే అవకాశాలు లేకపోలేదు.

బాబా సాహెబ్ అంబేడ్కర్ సారథ్యంలో రూపొందించిన రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇలాంటి ఘటనలు దేశంలోని జాతీయ చట్టసభల్లో సంభవించడం దేశ రాజకీయాలలో విలువలు, ప్రమాణాలు ఎంత దిగజారాయో స్పష్టం చేస్తున్నాయి. పట్టుమని 10–12 రోజులు కూడా జరగని ఈ శీతాకాల సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య బాహాబాహీ జరగడం తప్ప సాధించింది ఏమున్నది? కొన్ని ఆర్థిక బిల్లులతో పాటు ప్రధానంగా జమిలి ఎన్నికలపై బిల్లును ప్రవేశపెట్టి సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపడం తప్ప ఈ సమావేశాల గురించి చెప్పుకోవడానికి పెద్దగా ఏమీ లేదు. 2014లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఈ జమిలి ఎన్నికల గురించి ఉధృత ప్రచారం జరుగుతూనే ఉన్నది. తీరా ఈ బిల్లు ప్రవేశపెట్టిన తర్వాత చూస్తే అందులో అత్యంత కీలకమైన స్థానిక ఎన్నికలను పక్కన పెట్టారు. దేశంలో క్రింది స్థాయిలో అధికార వికేంద్రీకరణకు ఎంతో అవసరమైన పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలు జరగడం. అయితే గుజరాత్‌తో సహా చాలా రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికలు జరగడం లేదు సరికదా అధికారాలు, నిధుల పంపిణీ కూడా చట్ట ప్రకారం జరగడం లేదు! అంతేకాదు, లోక్‌సభ, అసెంబ్లీలకు సంబంధించి కూడా ఈ జమిలి ఎన్నికలు వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత జరుగుతాయని బిల్లులో పేర్కొన్నారు. అంటే ఇప్పట్లో జమిలి ఎన్నికలు జరిగే అవకాశాలు కనపడడం లేదు.

లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిషా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు గత జూన్‌లో జరిగాయి. జమిలి ఎన్నికలు జరపడం ద్వారా ఖర్చు తగ్గుతుందని నిజంగా ఆలోచించినట్లయితే 2018లోనూ, 2019 చివరిలో జరిగిన అనేక అసెంబ్లీల ఎన్నికలను వీటితో పాటు కలిపి జరిపించే అవకాశం ఉండేది. ఇంతెందుకు? ఇటీవల జమ్ముకశ్మీర్, హరియాణా ఎన్నికలను, మహారాష్ట్ర జార్ఖండ్ ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించలేదు. ఉప ఎన్నికలను కూడా వాటితో పాటు కలపలేదు. తమ రాజకీయ సౌలభ్యం కోసం వేరువేరుగా జరిపారన్నది జగమెరిగిన సత్యం. అలాంటప్పుడు జమిలి ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము సిద్ధంగా ఉన్నామని ఎన్నికల కమిషన్ ప్రగల్భాలు పలకడం దేనికి?



> **అంబేడ్కర్‌ను అమిత్ షా అవమానించారని నిరసన ప్రదర్శనలు చేయడం వల్ల తమను అణగారిన వర్గాలు అక్కున చేర్చుకుంటాయని కాంగ్రెస్ భావిస్తే అమాయకత్వమే అవుతుంది. అసలు ఈ వర్గాలు తమ నుంచి ఎందుకు చేజారిపోయాయి, బీజేపీ వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నాయి వారిలో మళ్లీ విశ్వాసం ఎలా కల్పించగలం అన్న ప్రశ్నలపై ఆత్మవిమర్శ చేసుకున్నప్పుడే భారతదేశ పురాతన రాజకీయపక్షం నిలదొక్కుకోగలుగుతుంది.**

1990లో గోస్వామి కమిషన్ నుంచి 2008లో పరిపాలనా సంస్కరణల కమిషన్ వరకు పలు ఎన్నికల సంస్కరణలను సూచించాయి. ఎన్నికల ఖర్చును ప్రభుత్వమే భరించడం నుంచి అయిదేళ్లకు మించి శిక్షపడే అభ్యర్థులను ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించడం వరకు అనేక సిఫారసులు ప్రభుత్వం పరిశీలనలో ఉన్నాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు వేల కోట్లు ఖర్చుపెడుతున్నట్లు తెలిసినా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదు. గత ఎన్నికల్లో లక్షా 35వేల కోట్లు ఖర్చయ్యాయని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ తెలిపింది. ఇక ఒకే నాయకుడు రెండు స్థానాల్లో పోటీ చేయడం వల్ల భారీ ఎత్తున డబ్బు వృథా అవుతుందని తెలిసినా ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో సహా అనేకమంది రెండు స్థానాల్లో పోటీ చేసేందుకు అనుమతిస్తున్నారు. ఎమ్మెల్యేలు ఎంపీలుగా మారేందుకు, ఎంపీలు ఎమ్మెల్యేలుగా మారేందుకు అనుమతించడం వల్ల కూడా ఉప ఎన్నికలు జరిగి అత్యధిక మొత్తం వృథా అవుతోంది. ఒక పార్టీలో ఉండి మరో పార్టీ తరఫున పోటీ చేయడం, చివరి నిమిషంలో ఫిరాయింపులు జరగడం, అభ్యర్థులను, ఏజెంట్లను కొనుగోలు చేయడం కూడా ఎవరూ నివారించలేకపోతున్నారు. బ్యాంకులకు వేల కోట్లు ఎగ్గొట్టినవారు, నేరచరితులు, కళంకితులు కూడా పోటీ చేసేందుకు మన ఎన్నికల వ్యవస్థ అనుమతిస్తోంది. వీటన్నింటినీ సంస్కరించి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించడంపై దృష్టి కేంద్రీకరించకుండా జమిలి ఎన్నికల గురించి ఆలోచించడంలో అర్థం ఏమైనా ఉన్నదా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

అదానీ గ్రూప్ కొన్ని రాష్ట్రాలకు ముడుపులు ఇచ్చి సోలార్ కాంట్రాక్టులను పొందిందని అమెరికాలో కేసు దాఖలు కావడం శీతాకాల సమావేశాలకు ముందు ప్రతిపక్షాలకు కొత్త ఉత్సాహాన్ని అందించినప్పటికీ ఈ అంశంపై సభలో మాట్లాడేందుకు ప్రభుత్వం ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. ఎంతో ప్రామాణికంగా జరగాల్సిన రాజ్యాంగ చర్చ కూడా చివరగా హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలతో వివాదాస్పదం కావడం, ప్రతిపక్షాలు ఆయన క్షమాపణ కోరుతూ తీవ్ర నిరసన తెలుపడంతో ఉభయ సభలు రసాభాసగా ముగిసాయి. అయినప్పటికీ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను ఇరుపక్షాలు తలుచుకోవడం, ప్రతిపక్షాలు 'జై భీమ్' అని నినాదాలు చేయడం ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగమైనప్పటికీ దేశంలో అంబేడ్కర్ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతున్నదే కాని తగ్గడం లేదని స్పష్టం అవుతోంది.

అస్పృశ్యులుగా సమాజం పరిగణించిన దళితులకు విద్యా, ఉపాధి రంగాల్లో అవకాశాలతో పాటు అందరితో పాటు సమానంగా, గౌరవంగా జీవించే హక్కుకోసం తన జీవితాంతం పోరాడిన అంబేడ్కర్ ప్రాసంగికతను ఎవరూ విస్మరించలేరు. అగ్రవర్ణ సంస్కర్తల దయాదాక్షిణ్యాలపై కాకుండా అణగారిన వర్గాలు తమ స్వంత నాయకుల ఆధ్వర్యంలో తమ హక్కులను స్వయంగా పొందాలని ఆయన ఆశించారు. వారిని హిందువులకు భిన్నంగా ప్రత్యేక మైనారిటీ వర్గంగా పరిగణించాలని వాదించారు. వారికి చట్టసభల్లో అత్యధిక ప్రాతినిధ్యాన్ని సాధించారు. అస్పృశ్యత అనే దుర్మార్గాన్ని ప్రపంచం దృష్టికి తీసుకువచ్చి దళితుల పౌర, సామాజిక, రాజకీయ హక్కుల్ని, స్వేచ్ఛను కాపాడేందుకు అంబేడ్కర్ ఏ విధంగా అడుగడుగునా పోరాడారో ధనుంజయ్ కీర్ రాసిన అంబేడ్కర్ జీవిత చరిత్ర చదివితే అర్థమవుతుంది.

'రాజ్యాంగ నైతికత అనేదాన్ని మనం పెంపొందించాలే కాని అది సహజంగా జరగదు. మనం దాన్ని ఇంకా నేర్చుకోవాల్సి ఉన్నది. భారతదేశంలో ప్రజాస్వామ్యం అనేది ఒక అప్రజాస్వామిక సమాజంపై అద్దిన పై మెరుగు మాత్రమే..' అని అంబేడ్కర్ ముసాయిదా రాజ్యాంగంపై రాజ్యాంగ అసెంబ్లీలో మాట్లాడుతూ అన్నారు. ప్రతి వ్యక్తికీ ఓటు హక్కు కన్నా, ప్రతి వ్యక్తికీ ఒకే రకమైన విలువ లభించడమే రాజ్యాంగ నైతికత. సమానత్వం లేని స్వేచ్ఛ కొద్ది మందికే ఉపయోగపడుతుందని చెప్పారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 75 సంవత్సరాల తర్వాత కూడా స్వేచ్ఛ, సమానత్వం, హుందాగా జీవించే పరిస్థితుల్లో భారతీయులు ఉన్నారా? కులమత లింగ వివక్షలకు తావు లేదని, అంటరాని తనం అమలు కాకూడదని, భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాలని, జీవించేందుకు ప్రతి ఒక్కరికీ హక్కు ఉన్నదని చెప్పే 15, 17, 19, 21 అధికరణలు అమలు అవుతున్నాయా? రాజ్యాంగం ప్రకారమే రాజ్యాంగం అమలు అవుతున్నదా? అన్న ప్రశ్నలకు జవాబులు లేవు.

అంబేడ్కర్ గురించి చర్చ జరిగినప్పుడల్లా కొందరికి తమ ఎజెండా అమలు కావడం లేదనే ఆగ్రహం కలుగుతుంది. అదే సమయంలో అంబేడ్కర్ వారసులం తామేనని చెప్పుకునేందుకు ప్రయత్నించేవారు, అంబేడ్కర్‌ను అవమానించారని ప్రత్యర్థులను వేలెత్తి చూపేవారు ఎల్లెడలా కనిపిస్తారు. అక్కడే అంబేడ్కర్ విజయం మనకు అర్థమవుతుంది. జైళ్లలో 51 శాతం పైగా దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు ఉన్నారని తెలిసినప్పుడు, గర్బా డాన్స్‌లో పాల్గొన్నందుకు తనను కొట్టారని ఒక దళిత మహిళ ఆక్రోశించినప్పుడు, దళితులు ఇంకా అవమానాలకు గురి అవుతున్నారని తేలినప్పుడు అంబేడ్కర్ చారిత్రక ఆవశ్యకత సమసిపోలేదని అర్థమవుతుంది.

అయినప్పటికీ భారత రాజకీయాల అంతర్గత స్వభావం మారుతోంది. సంప్రదాయంగా బలంగా ఉన్న కులాల ఆధిపత్యం సమసిపోతూ అణగారిన వర్గాల కేంద్రంగా రాజకీయాలు మారడం క్రమంగా కనపడుతోంది. తమంతట తాము విజయం సాధించలేమని, ఇతర వర్గాలను మెప్పించడం అవసరమని రాజకీయ పార్టీలు గుర్తిస్తున్నాయి. బలహీన కులాలు బలమైన కులాల చుట్టూ చేరడం క్రమంగా మారిపోతూ, బలమైన కులాలను తామే ప్రభావితం చేసేందుకు సమీకృతం కాగల పరిస్థితి ఏర్పడుతోంది. సంప్రదాయిక రాజకీయ నిర్మాణం విచ్ఛిన్నమయ్యే పరిణామం తీవ్రతరమైంది. ఏ ఎన్నికలు జరిగినా, దళితులు, వెనుకబడిన వర్గాలవారు ఎవరికి ఓటు వేస్తారన్న విషయం చర్చ జరుగుతోంది. హరియాణాలో జాట్ రాజకీయాలను వెనుకబడిన, దళిత వర్గాలు విఫలం చేశాయి. మహారాష్ట్రలో మరాఠా రాజకీయాలను వెనుకబడిన వర్గాలు చిత్తు చేశాయి. బిహార్‌లో భూమిహార్, రాజపుత్, బ్రాహ్మణ వర్గాలు తమంతట తామే అధికారం చేజిక్కించుకునే పరిస్థితి ఏనాడో కోల్పోయాయి. ఉత్తర ప్రదేశ్‌లో బీఎస్‌పీని బలహీనం చేయడం ద్వారా బీజేపీ బలపడితే, కేవలం యాదవులు, ముస్లింల ఓట్లతో విజయం సాధించలేమని సమాజ్‌వాది పార్టీ గ్రహించి, యాదవేతరులకు ఎక్కువ సీట్లు ఇచ్చినందుకే గత లోక్‌సభ ఎన్నికల్లో అధిక సీట్లు సాధించగలిగింది. అంబేడ్కర్‌ను అమిత్ షా అవమానించారని నిరసన ప్రదర్శనలు చేయడం వల్ల తమను అణగారిన వర్గాలు అక్కున చేర్చుకుంటాయని కాంగ్రెస్ భావిస్తే అమాయకత్వమే అవుతుంది. అసలు ఈ వర్గాలు తమ నుంచి ఎందుకు చేజారిపోయాయి, బీజేపీ వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నాయి వారిలో మళ్లీ విశ్వాసం ఎలా కల్పించగలం అన్న ప్రశ్నలపై ఆత్మవిమర్శ చేసుకున్నప్పుడే ఆ పార్టీ నిలదొక్కుకోగలుగుతుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కువైత్‌కు తెలుగు రాష్ట్రాల సేద్య ఉత్పత్తులు

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పనితీరు వివిధ రంగాలలో ఏ విధంగా ఉన్నప్పటికీ జాతి ప్రయోజనాల దృష్ట్యా కీలకమైన గల్ఫ్ అరబ్బు దేశాలతో మైత్రీ పటిష్ఠత విషయంలో మాత్రం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. మోదీ ఇటీవల జరిపిన కువైత్ పర్యటనతో, గల్ఫ్ కూటమిలోని ఆరు దేశాలనూ పర్యటించిన భారతీయ నేతగా నిలిచారు.

విశిష్ట స్వభావం కల్గిన ఎడారి అరబ్బులతో మైత్రి లేదా శత్రుత్వం రెండు కూడ అంత సులువు కాదు. పైగా కఠోర వహాబీ ఇస్లామిక్ ధార్మిక విధానాన్ని అనుసరించే ఎడారి అరబ్బు దేశాలలో సనాతన హిందూ ధర్మాన్ని ప్రోత్సహిస్తున్న మోదీ సర్కారు బలీయమైన మైత్రీ విధానాన్ని అనుసరిస్తూ ముందుకు సాగుతోంది. గల్ఫ్‌లోని అన్ని దేశాలతోనూ ఈ రోజు భారతదేశ సంబంధాలు సంప్రదాయక ద్వైపాక్షిక స్థాయిని దాటి వ్యూహాత్మక ఆర్థిక, భద్రత అంశాల వైపు విజయవంతంగా పురోగమిస్తున్నాయి. ఈ పరిణామాన్ని గతంలో అయితే ఊహించడం కూడా కష్టతరంగా ఉండేది. ఇది కేవలం నరేంద్ర మోదీ వ్యక్తిగత శ్రద్ధతో మాత్రమే సాధ్యమయింది అంటే అతియోశక్తి కాదు. కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ సుదీర్ఘ కాలంలో అరబ్బు దేశాలలో సాధించని దౌత్య విజయాన్ని మోదీ తన దశాబ్ద కాలంలో సాధించారు.

గల్ఫ్ లేఖ

భారతీయ విదేశాంగ విధాన రూపకల్పనలో సంబంధిత మంత్రి కంటే ప్రధానమంత్రి, జాతీయ భద్రత సలహాదారు అయిన అజిత్ దోవల్ కీలక పాత్ర వహిస్తారు. ప్రస్తుతం కువైత్ పర్యటనలో గానీ అంతకు ముందు గానీ గల్ఫ్‌లోని ఏ రాజుతోనైనా మోదీ సమావేశమైతే మోదీ ప్రక్కన ఉండేది అజిత్ దోవల్ మాత్రమే.

గల్ఫ్ ప్రాంతంలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో పని చేస్తూ ప్రజాగళం వినిపించే పార్లమెంటు ఉన్న దేశం కువైత్. ఈ కారణాన కువైత్ ప్రజాప్రతినిధులు భారతదేశంలోని మోదీ సర్కారు తీసుకున్న కొన్ని నిర్ణయాలు, చేసిన వ్యాఖ్యలను గతంలో తీవ్రంగా విమర్శించారు. కువైత్ పార్లమెంటేరియన్ల కారణాన కొన్నిసార్లు భారత విదేశాంగ శాఖ సంకట పరిస్థితిని ఎదుర్కొన్నది. ఈ నేపథ్యంలో కువైత్ అత్యున్నత పురస్కారమైన ముబారక్ అల్ కబీర్‌ను ప్రధాని మోదీకి ప్రదానం చేయడం మామూలు విషయం కాదు. ఇది నిస్సందేహంగా భారత్‌కు దౌత్యపరమైన విజయం.

కువైత్‌ను ఇరాక్ దురాక్రమణ చేయడాన్ని భారత్ ఖండించకపోవడంతో ఈ గల్ఫ్ దేశం భారత్‌పై అసంతృప్తి వ్యక్తం చేసింది. అంతటితో ఆగక కువైత్ సిటీలో అక్రమంగా నిర్మించిన గురుద్వారాను సిక్కు ధార్మిక వ్యక్తి భారతీయ రాయబారిగా ఉన్న హయాంలోనే కూల్చివేసింది. భారతీయ ఇంజినీర్ల విద్యార్హతల గుర్తింపును ప్రశ్నించింది. కువైత్‌లో నివసిస్తున్న విదేశీయుల సంఖ్యపై జాతుల వారిగా పరిమితి విధించే ప్రతిపాదన తదితర అంశాలకు తోడుగా హిజాబ్ వివాదం, ప్రవక్త మొహమ్మద్‌పై అనుచిత వ్యాఖ్యల విషయమై కువైత్ పార్లమెంటు సభ్యుల ఆక్షేపణ మొదలైన సున్నిత అంశాల కారణాన ఇరు దేశాల మధ్య కొంతవరకు అగాధం ఏర్పడింది.

సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, ఖతర్ దేశాలతో పోల్చితే కువైత్‌లో వాణిజ్య రంగ అభివృద్ధి అంతగా లేదు. కీలకమైన నిర్మాణ రంగంలో సైతం మిగిలిన మూడు దేశాల కంటే కూడా వెనుకబడి ఉంది. ప్రవాసుల సంఖ్య పరంగా పరిశీలిస్తే, కువైత్‌లో నివసిస్తున్న జనాభాలో కువైతీల తర్వాయి స్థానంలో భారతీయులు ఉన్నారు. కువైత్‌లో నివసిస్తున్న విదేశీయులు అందరిలోనూ భారతీయులు సంఖ్యాపరంగా అగ్రగాములు. పది లక్షల మంది భారతీయులు కువైత్‌లో నివసిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, కువైత్‌లోని భారతీయులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలకు చెందిన వారు ప్రభావదాయక సంఖ్యలో ఉన్నారు. కువైతీ దినారు ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల సామాజిక, ఆర్థిక జీవన స్రవంతిలో ముఖ్యపాత్ర వహిస్తోంది మరి.



> **ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన పథకం కింద ఫుడ్ పార్కులు ఉన్నాయి. వాటిలోని వ్యవసాయోత్పత్తులను కువైత్, తదితర దేశాలకు ఎగుమతి చేసే విధంగా ప్రయత్నిస్తే రైతులూ విశేషంగా లబ్ధి పొందుతారు.**

సాధారణంగా రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకై ఇరు దేశాల ఉన్నతాధికారులతో కూడిన సంయుక్త బృందాలు నిరంతరం పని చేస్తుంటాయి. ఆ విధంగా కువైత్ – భారత్ దేశాల మధ్య ఇప్పటి వరకు కార్మిక, ఉద్యోగ నియామకాలు, చమురు, ఆరోగ్య రంగాలకు సంబంధించి మూడు సంయుక్త కార్యాచరణ బృందాలు మాత్రమే ఉండగా, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య నైపుణ్యాభివృద్ధి, శాస్త్ర సాంకేతికాభివృద్ధి, వ్యవసాయం, సాంస్కృతిక రంగాలతో పాటు భద్రత, కౌంటర్ టెర్రరిజం మొదలైన కీలకంశాలపై కూడా ఉభయ దేశాల మధ్య సంయుక్త కార్యాచరణ బృందాలను నెలకొల్పడానికి తాజాగా మోదీ జరిపిన పర్యటనలో నిర్ణయించారు.

స్వీయ ఆహార భద్రతకై భారత్‌లో తాము సంకల్పించిన పెట్టుబడులకు అనుమతించాలని ప్రధాని మోదీని కువైత్ ప్రభుత్వం కోరింది. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన పథకం క్రింద ఫుడ్ పార్కులు ఉన్నాయి. వాటిలోని వ్యవసాయోత్పత్తులను కువైత్ తదితర దేశాలకు ఎగుమతి చేసే విధంగా ప్రయత్నిస్తే రైతులు కూడా విశేషంగా లబ్ధి పొందుతారు. అలాగే భారత్, కువైత్ దేశాల మధ్య పెండింగ్‌లో ఉన్న విమాన సీట్ల సంఖ్య పెంపుదల అంశాన్ని సాధ్యమైనంత వరకు పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. దీనికి పరిష్కారం లభిస్తే ప్రతిపాదిత తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం స్వప్నం ఫలిస్తుంది. అదే విధంగా విజయవాడ, విశాఖపట్టణం విమానాశ్రయాలకు అంతర్జాతీయ అనుసంధానం పెరుగుతుంది. ప్రధాని లేదా కేంద్రమంత్రులు అధికారికంగా విదేశీ పర్యటనలు చేసినప్పుడల్లా ఆ పర్యటనలలో తమ రాష్ట్రాలకు గరిష్ఠ ప్రయోజనం లభించే విధంగా తెలుగు రాష్ట్రాలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

'బాబాసాహెబ్'ను పార్టీలు గౌరవించడం ఎలా?

బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించింది మీరంటే మీరంటూ వైరిపక్షాలు జాతీయ స్థాయిలో తలపడుతున్నాయి. ఎన్నడూ లేనిది పార్లమెంటు ప్రాంగణంలో సభ్యుల మధ్య తోపులాట, ఇద్దరు గాయపడడం, పోలీసు కేసులు నమోదయ్యాయి. అన్ని రాజకీయ పార్టీలూ ఆ మహనీయుడిని తమ వాణ్ణి చేసుకుని, ఎదుటి వారి పట్ల అసహనం చూపించడం వారి అవ్యాజప్రేమకు చిహ్నం. అయితే ఆయన్ని ఇలా గౌరవించవచ్చని సూచన. పాలక పక్షమైతే అమలు చెయ్యడం ద్వారా, ప్రతిపక్షమైతే అమలు చేయమని పోరాడడం ద్వారా.. 1. అన్ని ఊళ్లలో గ్రంథాలయాలు నెలకొల్పాలి. అధ్యయనం ఎంత అవసరమో ఆయన చెప్పినందుకు. 2. ఉచిత, నాణ్యమైన విద్య అందరికీ అందించాలి. విద్య ఒక్కటే అసలైన ఆయుధమని అన్నందుకు. 3. బ్యాక్‌లాగ్ పోస్టులు అన్నీ భర్తీ చెయ్యాలి. కోట్లాది మంది అర్హులైన నిరుద్యోగులు ఉన్నప్పుడు, లక్షలాది ఉద్యోగాలు భర్తీ కాకపోవడం నేరం. 4. ఆహార భద్రత అందరికీ అందించాలి. దేశంలో సరిపడా ఆహారం ఉన్నా, కాలే కడుపులు గణనీయంగా ఉండడం సిగ్గుచేటు. పిల్లల ఎదుగుదల లోపాలు దేశంలో ఎక్కువే. 5. సంపద పంపిణీలో న్యాయం ఉండాలి. ఆదాయం, సంపద అతి తక్కువ మంది చేతిలో పడి, అత్యధిక శాతం జనాలు పేదరికంలో మగ్గుతున్నారు. ప్రజానీకం ఆత్మగౌరవంతో ఆర్థికంగా బలపడేలా విధానాలు ఉండాలి. 6. చట్టం ముందు అందరూ సమానులే అన్నది పాటించాలి. తప్పు చేసింది తమవాడైనా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాల హక్కులు కాపాడే విషయంలో. 7. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతోనే సామాజిక న్యాయం. కుల రహిత సమాజం కల సాకారమయ్యే రోజు కనుచూపు మేరలో లేదు. కులాలు, మతాల మధ్య దూరాలు పెరగకుండా, సాన్నిహిత్యం పెరిగేలా చూడాలి. 8. న్యాయ వ్యవస్థలో అందరికీ ప్రాతినిధ్యం ఉండేలా న్యాయ సంస్కరణలు, రాజకీయ స్వాతంత్ర్యం పట్టాలు తప్పకుండా చూసే ఎన్నికల సంస్కరణలు, అత్యధిక శాతం ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడేలాగా ఆర్థిక విధానాల కల్పన చేయాలి.

ప్రస్తుతానికి భిన్నాభిప్రాయాలు ఉండక్కర్లేని, ఈ ఎనిమిది విషయాలపై రాజకీయ పార్టీలు చిత్తశుద్ధి చూపిస్తే అది అంబేడ్కర్ మార్గం అవుతుంది. ఆయనపై గౌరవం చూపడమే కాకుండా సమాజానికి మేలు చేస్తుంది. 'అధ్యయనం, ఆత్మగౌరవం, శీలం... ఈ మూడు నాకు ముఖ్యం' అన్నారాయన. శీలం ఉంటేనే మిగతా రెండూ సాధ్యమయ్యేవి... వ్యక్తికైనా, వ్యవస్థకైనా.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ



హ్యాపీ క్రిస్మస్

సన్నద్ధమైన చర్చిలు, పాస్టర్లు, సంఘాలు

విద్యుత్ దీపాల వెలుగుల్లో చర్చిలు

శోభాయమానంగా అలంకరణ



విద్యుత్ వెలుగుల్లో హనుమకొండలోని సెంటినరీ బాపిస్టు చర్చి

క్రిస్మస్ పండుగకు మహానగరం సిద్ధమైంది. క్రైస్తవులకు అతి పెద్ద పండుగ క్రిస్మస్ నిర్వహణకు చర్చిలు, పాస్టర్లు, చర్చిల సంఘాలు సన్నద్ధమయ్యాయి. హ్యాపీ క్రిస్మస్.. అంటూ శుభాకాంక్షల వెల్లడితోపాటు సంబురాలు వి ఎన్నంటుతున్నాయి. యేసుక్రీస్తు జననాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు జరుపుకునే క్రిస్మస్ పండుగ నిర్వహణకు క్రైస్తవ సంఘాలతో పాటు క్రైస్తవేతరలు కూడా సిద్ధమయ్యారు.

- హనుమకొండ సిటీ

6



ఫాతిమా కేథడ్రల్ చర్చిలో బాలయేసు వద్ద పూజలు చేస్తున్న వరంగల్ బిషప్ ఉడుముల బాల

లోక రక్షణకే క్రీస్తు జననం

- వరంగల్ బిషప్ ఉడుముల బాల
- ఫాతిమా కేథడ్రల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు
- బాలయేసు వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): లోక రక్షణ కోసమే ఏసు క్రీస్తు జన్మించాడని, క్రిస్మస్ పండుగ చారిత్రాత్మకమైందని వరంగల్ బిషప్ ఉడుముల బాల ఉద్బోధించారు. క్రిస్మస్ సంద ర్భాన్ని పురస్కరించుకుని శనివారం అర్ధరాత్రి క్రిస్మస్ జాగరణ దివ్యబలి పూజ జరిగింది. చర్చి ఫాదర్ కాసు మర్రెడ్డి అధ్యక్షతన

మిగతా 6వ పేజీలో...



అంబేద్కర్ సెంటర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- కేంద్ర మంత్రితో ప్రధాని బహిరంగ క్షమాపణ చెప్పించాలి
- రాజ్యాంగంపై గౌరవం లేని కేంద్రం.. రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7



కొత్తకొండలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

కొత్తకొండ జాతరను విజయవంతం చేద్దాం..

- జనవరి 10 నుంచి 18 వరకు ఉత్సవాలు
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

7

సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండండి

బల్దియా అధికారులతో మేయర్ సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న వివిధ విభాగాల అధికారులు సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఈ నెల 30న బల్దియా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం మేయర్ చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో మంచి నీటి సరఫరా, లీకేజీలు అరికట్టుట, పారిశుధ్య నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు మహేందర్, శ్రీనివాస్, సంతోష్‌లు పాల్గొన్నారు.

బాక్స్‌డ్రెన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

గ్రేటర్ వరంగల్ పరిధిలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో బాక్స్ డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. మంగళవారం భద్రకాళి బండ్, జంతు ప్రదర్శనశాల ప్రాంతాల్లో కుడా, బల్దియా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. జూపార్క్, అడ్వకేట్స్ కాలనీ నుంచి వచ్చే వరద నీరు సాఫీగా వెళ్లేందుకు బాక్స్ డ్రైన్‌ల ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. భద్రకాళి చెరువు నుంచి నీటి తీసిన తర్వాత అందులో వెలువడిన గుర్రపు డెక్క అవశేషాలను సేకరించేందుకు ఎస్‌హెచ్‌జీ మహిళలను ఎంపిక చేసిన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజీత్‌రెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, కుడా, బల్దియా ఈఈలు భీంరావు, సంతోష్, ఏసీపీలు రజిత, ఇర్షాద్, ఏఈ మేనక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, స్మార్ట్‌సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ముఖ్యమంత్రి చాంపియన్‌షిప్ ట్రోఫీ ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 2 వరకు హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం క్రీడల నిర్వహణపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారుల కోసం వసతి, భోజనం, రవాణా తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. క్రీడలు జరిగే ప్రదేశంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్, రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసుశాఖను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అశోక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగేంద్రుడుడికి ధనుర్మాస పూజలు


ధనుర్మాస సేవలో అర్చకుడు సుదర్శనాచార్యులు

గీసుగొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా ఊకల్ నాగేంద్రుడిని కోటి జాజి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి చతుర్వేద పారాయణం సమర్పించారు. జిల్లా నలు మూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయ చైర్మన్ మాచినపల్లి బాబురావు, కొత్తగట్టు రాజేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఇండియన్ ఎకానమీ సదస్సుకి ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు


శ్రీధర్‌కుమార్ లోథ్

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హరియానాలోని కురుక్షేత్ర యూనివర్సిటీలో ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 107వ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్ పాల్గొననున్నారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి వెల్లడించారు. ఈ నెల 27 నుంచి 29 వరకు జరుగనున్న సదస్సులో డాక్టర్ శ్రీధర్‌కుమార్ సోషియో అండ్ డెమోగ్రాఫిక్ ఫీచర్స్ ఆఫ్ ద పాపులేషన్ - ఏ స్టడీ ఇన్ తెలంగాణ అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రి విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలతో మధ్యలోనే చదువు మానేసిన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9346020003/9396337572ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తాం..

సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దవే

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తామని సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దవే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ రీజియన్ పరిధిలోని 16 జిల్లాల్లో 54 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వివరాల కోసం కాట్-అలై మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పత్తి రైతుల నమోదు ప్రక్రియ ఆధార్ నంబర్ ఆధారంగా జరుగుతుందని, పత్తిలో తేమ 8శాతం మించకపోతే మద్దతు ధర లభిస్తుందని, 8 నుంచి 12 శాతం వరకు ఒక శాతం తగ్గుతుందని పేర్కొన్నారు. ఇతర సమస్యలు ఉంటే వరంగల్ బ్రాంచ్ కార్యాలయం ఫోన్ నంబర్ 0870-2565077ను సంప్రదించాలని అర్జున్ దవే ఆ ప్రకటనలో కోరారు.

వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేశాం..

హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ

రాంనగర్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికబద్ధంగా అన్నీ ఏర్పాట్లు చేసుకున్నామని హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. కొత్తగా 4 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్‌లోని 4 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. లోడ్ భారంపై టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకొని అందుకు అనుగుణంగా కొత్తగా 109 ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడంతోపాటు 127 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా విద్యుత్‌ను అందించడానికి ఇంటర్‌లింకింగ్ వ్యవస్థను పటిష్టపరిచామన్నారు.

విద్య, పరిపాలన పదవుల్లో బీసీ వర్గాలకు మొండిచెయ్యి

- జేఎన్‌టీయూ వీసీ పోస్టు బీసీలకు ఇవ్వాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కేయూ క్యాంపస్ డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్సిటీల్లో బీసీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు మొండిచెయ్యి చూపుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. మంగళవారం కేయూ అతిథి గృహంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. వర్సిటీల్లో వీసీలతోపాటు బీసీలకు మగ్గురికే అవకాశం కల్పించారని చెప్పా రు. రాష్ట్ర ఉన్నతవిద్య మండలిలో బీసీలకు ప్రాతినిత్యం కల్పించలేదన్నారు. ఓయూ, కేయూ లాంటి పెద్ద వర్సిటీల వీసీ పోస్టులను బీసీలకు ఇవ్వలేదన్నారు. హైదరాబాద్ జేఎన్‌టీయూ వీసీ పోస్టులను బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యాశాఖ పదవుల్లో బీసీలకు సామాజిక న్యాయం మేరకు పదవుల కేటాయింపులు లేవన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు చెందిన ప్రైవేట్ వర్సిటీలను లబ్ధిచేకూర్చేందుకు ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ కూడా బీసీలకు వీసీ, ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్ చైర్మన్ పోస్టుల్లో బీసీలకు న్యాయం చేయలేదని, అదే బాటలో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. ప్రజాప్రభుత్వంలో బీసీలకు మొండి చెయ్యి చూపడం మంచిది కాదన్నారు. ఓసీ, ఇతర వర్గాలు వీసీలుగా ఉన్న వర్సిటీల్లో రెక్టార్, ఓఎస్‌డీ, రిజిస్ట్రార్‌తో పాటు ఇతర ప్రధాన పరిపాలన పదవులను బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువత ప్రాణత్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, అదే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించడం లేదన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు 40శాతం మెస్ చార్జీలు పెంచిన ప్రభుత్వం వర్సిటీ విద్యార్థులకు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. వర్సిటీల్లో చదువుతున్న విద్యార్థుల మెస్ బిల్లులన్నీ ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జైలు ఖైదీలకిచ్చే మెస్ చార్జీలు వర్సిటీ విద్యార్థులకు ఇవ్వడం లేదన్నారు. నాణ్యమైన భోజనాన్ని వర్సిటీల్లో అందించాలని అన్నారు. ఓయూ, కేయూ వర్సిటీల భూములన్నీ అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని కాపాడాలని అన్నారు. హైడ్రాతో వర్సిటీల భూములను కాపాడేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఫెల్లోషిప్‌లకు నెట్ అర్హత విధింపు సరికాదన్నారు. ప్రాంతీయ భాషల విద్యార్థులకు జాతీయస్థాయిలోని నెట్ పరీక్ష ఉత్తీర్ణత తప్పనిసరి చేయడంవల్ల అనేక మంది విద్యార్థులు క్వాలిఫైడ్ కాలేకపోతున్నారని చెప్పారు. రూ.10వేల ఫెల్లోషిప్‌ను ప్రతీ నెల పరిశోధకులకు ప్రభుత్వ హామీ మేరకు చెల్లించాలని అన్నారు. పూలే దంపతుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని అన్నారు. బీసీ జనాభా లెక్కల ప్రకారం తమకు పదవుల కేటాయింపులు జరుగాలని డిమాండ్ చేశారు. వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, పార్టుటైమ్, గెస్ట్‌అధ్యాపకులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీవర్గాలకు జరుగుతున్న వివక్షపై త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, దాడి మల్లయ్య యాదవ్, అశోక్‌గౌడ్, బోనగాని యాదగిరిగౌడ్, తీగల ప్రదీప్‌గౌడ్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జి ఆరెగంటి నాగరాజుగౌడ్, రీసెర్చ్ స్కాలర్లు మహబూబ్ పాషా, అభిరామ్, బస్కే నాగరాజు, పృథ్వీ వేణు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'పొలిటికల్ రౌడీ'లపై పోలీస్‌బాస్ ఆరా

- కమిషనరేట్‌లో చర్చనీయాంశమైన ఆంధ్రజ్యోతి కథనం
- నిఘా వర్గాల ద్వారా సమాచార సేకరణ
- పలువురిపై చర్యలకు రంగం సిద్ధం


మిల్స్‌కాలనీ పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : రాజకీయం ముసుగులో రౌడీయిజానికి పాల్పడుతున్నారంటూ మంగళవారం ఆంధ్రజ్యోతిలో ఎపేట్రేగిపోతున్న పొలిటికల్ రౌడీల్' పేరిట ప్రచురించిన కథనంపై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆరా తీసినట్లుగా సమాచారం. ప్రజాప్రతినిధులకు ప్రధాన అనచరులుగా ఉన్న కొంతమంది పొలిటికల్ రౌడీలు పోలీస్‌శాఖ నిర్వహించే కౌన్సెలింగ్ గైర్హాజరవుతున్నారని, పోలీసులను తమ చెప్పుచేతుల్లో పెట్టుకొని సెటిల్‌మెంట్‌లకు పాల్పడుతున్నారని ప్రచురించిన ఆంధ్రజ్యోతి కథనం కమిషనరేట్ పరిధిలో చర్చనీయాంశమైంది. పొలిటికల్ రౌడీల ఆగడాలను సీరియస్‌గా తీసుకున్న సీపీ.. నిఘా వర్గాల ద్వారా రౌడీషీట్ నమోదై ప్రజాప్రతినిధులుగా పనిచేస్తున్న వారి కదలికల గురించి అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. వారికి సహకరిస్తున్న పోలీసు అధికారులపై నివేదిక ఇవ్వాలని నిఘా వర్గాలను ఆదేశించినట్లు తెలుస్తోంది. మంగళవారం వరంగల్ పోలీస్ డివిజన్‌లో అత్యధికంగా రౌడీషీటర్లు ఉండే మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ అంబర్ కిషోర్ ఝా.. పీఎస్ పరిధిలో ఎంతమంది రౌడీషీటర్లు ఉన్నారు..? అందులో ఎవరెవరు ఉన్నారు..? అనే దానిపై ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నంను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని సీఐతో పాటు ఏసీపీని ఆదేశించినట్లుగా సమాచారం.

రౌడీషీటర్ల పట్ల ఉదాసీనతగా వ్యవహరించే అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించినట్లుగా తెలిసింది. పెట్రోలింగ్‌ను పెంచి ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని సూచించారు. రాణా సందర్శనలో భాగంగా స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులను పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సాయికుమార్ తదితరులు

ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేసే వరకు పోరాటం

స్వేరోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్

28న కేయూలో ఓబీసీ రిజర్వేషన్లపై సదస్సు

కేయూ క్యాంపస్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఓబీసీ రిజర్వేషన్లను రద్దుచేసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం స్వేరోస్ నేతృత్వంలో 28న కేయూలో జరిగే ఓబీసీ రిజర్వేషన్ల రౌండ్ టేబుల్ సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వేరోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్‌లు మాట్లాడుతూ.. 28న కేయూ దూరవిద్యకేంద్రంలోని ప్రొఫెసర్ జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహిస్తామన్నారు. ఓబీసీ 10 శాతం రిజర్వేషన్లతో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. అగ్రవర్ణాలున్నది కేవలం రెండు శాతమేనని అన్నారు.

ఎక్కువ జనాభా కల్గిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినప్పటికీ ఉద్యోగాలు, సీట్లు పొందలేకపోతున్నారని ధ్వజమెత్తారు.28న జరిగే సదస్సుకు మేధావులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ప్రజా సంఘాల నేతలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్, ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, స్వేరోస్ నేతలు శివ, చరణ్, సురేవ్, మహేశ్, కృష్ణ, వంశీ, బాలకృష్ణ, నరేశ్, సుకేశ్, సంధ్య, స్పందన, రాకేశ్, హర్షవర్ధన్, రాజు, మల్లేశ్ పాల్గొన్నారు.

హ్యాపీ క్రిస్మస్..

నేడే క్రిస్మస్ పర్వదినం

సన్నద్ధమైన చర్చిలు, పాస్టర్లు, సంఘాలు

హనుమకొండ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగకు మహానగరం సిద్ధమైంది. మంగళవారం రాత్రి నుంచి క్రిస్మస్ పర్వదిన వేడుకలు అరంభమయ్యాయి. బుధవారం ఉదయం 9:30 గంటలకు చర్చిలలో క్రిస్మస్ ఆరాధనల్లో క్రైస్తవులు పాల్గొంటారు. మహానగరంలోని చర్చిలను ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు సందర్శించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేస్తారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తారు.

ఆరంభమైన వేడుకలు

క్రిస్మస్ వేడుకలు మంగళవారం రాత్రి నుంచే ఆరంభమయ్యాయి. కొన్ని చర్చిలలో రాత్రి 12 గంటల వరకు క్రిస్మస్ ఆరాధనలు జరిగాయి. పశువుల పాకలో క్రీస్తు జనన దృశ్యాలు, నక్షత్ర ప్రదర్శనలతో ప్రార్థనలు నిర్వహించారు. మహా నగరంలోని హోటళ్లు, బేకరీలు, వ్యాపార సంస్థల్లాలో కూడా సంబురాలు నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ ట్రీ, స్టార్‌లు, సాంటాక్లాజ్‌ల ప్రదర్శన, ప్రత్యేక అలంకరణల నడుమ క్రిస్మస్ వేడుకలు నిర్వాహించారు. హ్యాపీ క్రిస్మస్.. మేరీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలియ చేసుకుంటున్నారు.

శోభాయమానంగా అలంకరణలు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని నగరంలో ప్రత్యేక అలంకరణలు చోటు చేసుకున్నాయి. కూడళ్లలో విద్యుత్ అలంకరణలు, స్టార్‌లను ఏర్పాటు చేశారు. పలు చోట్ల సాంటాక్లాజ్‌ల బొమ్మలను ప్రదర్శించారు. నగర కూడళ్లలో స్టార్లు ఏర్పాటయ్యాయి.

ముస్తాబైన చర్చిలు

మహానగరంలోని చర్చలను ప్రత్యేకంగా అలం కరించారు. పదిహేను రోజుల ముందు నుంచే చర్చిల అలంకరణలను చేపట్టారు. చర్చిలు విద్యు త్ కాంతులతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. చర్చిలలో భారీ స్టార్‌లు, ట్రీలను ఏర్పాటు చేశారు. బుధవారం జరిగే క్రిస్మస్ ఆరాధనల కోసం సకల ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ పండుగ రోజున జరిగే ఆరాధనలకు క్రైస్తవులే కాక క్రైస్తవేతరులు కూడా భారీ సంఖ్యలో వస్తారు. ఈ మేరకు సంఘాలు ప్రత్యేక ఏర్పాట్లను చేశాయి. సంఘ కాపరులు క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యత, క్రీస్తు జననాన్ని తెలియచేస్తూ వ్యాఖ్యోపదేశం చేస్తారు.

సర్వశిక్ష కాంట్రాక్ట్ ఉగ్యోగులను రెగ్యులైజ్ చేయాలి

హనుమకొండ టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అన్ని రకాలుగా అర్హతలు ఉన్న సర్వశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా ఏకశిలాపార్కు వద్ద ఎస్ఎస్ ఉద్యోగులు చేస్తున్న దీక్షలను ఆయన మంగళవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంను, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ను కలిసి సర్వశిక్ష ఉద్యోగుల సమస్యల గురించి వివరిస్తానని చెప్పారు. సమస్యల పరిష్కారం అయ్యే వరకు ఎస్ఎస్ ఉద్యోగులకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఉన్నత విద్యను అభ్యసించి చాలీ చాలనీ వేతనాలతో విద్యావ్యవస్థ పటిష్టత కోసం సమగ్రశిక్షలోని 9 విభాగాలలో పనిచేస్తున్న వారి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి వీడాలన్నారు. సర్వశిక్షలో దళితులు, బీసీలే ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రభుత్వానికి ఎక్కడ వాత పెట్టి ఎలా పనిచేయించాలో బీసీ సంక్షేమ సంఘ నాయకుడిగా తనకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, సర్వశిక్షలో పనిచేస్తున్న పలు విభాగాల కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



వరంగల్ క్రైం, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): రంగంపేటకు చెందిన మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైనట్లు హనుమకొండ ఎస్సై కిషోర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రంగంపేటకు చెందిన చెరుకుపల్లి శోభన(35) ఈ నెల 22న బయటి వంటల కోసం కుటుంబసభ్యులతో పద్మాక్షి గుండం దగ్గరికి వచ్చి తప్పిపోయిందన్నారు. శోభన తమ్ముడు పృథ్వీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లోక రక్షణకే క్రీస్తు జననం

5వ పేజీ తరువాయి

క్రిస్మస్ వేడుకలు, ప్రత్యే పూజలు జరిగాయి. ఈ పూజలకు వరంగల్ బిషప్ హాజరై క్రీస్తు సందేశాన్ని అందించారు. క్రీస్తు జయంతి ఎంతో గొప్పగా జరుపుకోవడమే కాకుండా దాని ప్రసిద్ధిని ప్రతీ ఒక్కరు గ్రహించాలన్నారు. క్రిస్మస్ అనేది ప్రపంచంలో మెదటగా దేవుడి మదిలిలో మెదిలిందన్నారు. పాపులను రక్షించడానికే, వారిని కాపాడటానికే భూమి మీద పశువుల పాకలో క్రీస్తు జన్మించారన్నారు. పశువులపాకలో పుట్టడం అంటే.. అందరికీ అందుబాటులో వుండటానికే అని చెప్పారు. అనంతరం ఏసుక్రీస్తు పుట్టుక గురించి సందేశం అందించారు. క్రీస్తు పుట్టుక అంతరార్థం తెలుసుకోవాలన్నారు.

అ తర్వాత హోలీ స్పిరిట్ క్రైస్తవులపై చల్లి దివ్యస్య ప్రసాదం అందించారు. ఆ తర్వాత బిషప్‌తోపాటు ఫాదర్‌లు చర్చి ఆవరణలో వున్న పశువుల పాక వద్దకు వెళ్లి బాలయేసు వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. భక్తులకు ఆశీర్వదించి, ప్రార్థనలు చేశారు. అనంతరం ఈ వేడుకలు హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, బిషప్ ఉడుమల బాల, చర్చి ఫాదర్ కాసు మర్రెడ్డిలు కేక్ కట్‌చేసి క్రైస్తవులకు క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలు క్రైస్తవులు వేలాదిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


ఫాతిమా కేథడ్రల్ చర్చిలో వేడుకలకు హాజరైన జనం

సందేశం వినిపిస్తున్న బిషప్ ఉడుముల బాల


ఫాతిమా కేథడ్రల్ చర్చిలో అర్ధరాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకలకు హాజరైన క్రైస్తవులు


ఫాతిమా కేథడ్రల్ చర్చిలో బిషప్ ఉడుముల బాల

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6910	3000
పల్లికాయ (పచ్చిది)	5550	4500
కందులు	-	-
పెసళ్లు	7500	4000
పత్తి	7070	5800
పసుపు (కాడి)	11102	10235
పసుపు (గోల)	10050	9565
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16010	12000
తేజ ఏసీ	15400	14000
వండర్‌హాట్ ఏసీ	14500	13000
యూఎస్341ఏసీ	13400	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

సీబీసీ.. వేడుకలకు ముస్తాబు..



క్రిస్మస్ వేడుకల కోసం విద్యుత్‌దీపాలతో ముస్తాబైన సీబీసీ చర్చి

రాష్ట్రంలో రెండో అతిపెద్ద చర్చిగా గుర్తింపు

విశాలమైన ప్రార్థనామందిరం ఇక్కడి ప్రత్యేకత

ఖిలావరంగల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ క్రిస్టియన్‌కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. సెంటినరీ బాప్టిస్టు చర్చిల్లో రాష్ట్రంలోని రెండో అతిపెద్ద చర్చిగా గుర్తింపు ఉంది. ఇటీవలే దీన్ని ప్రభుత్వ నిధులతో పాటు, దాతల సహకారంతో సుమారు రూ.60కోట్లు ఖర్చుపెట్టి ఆధునికీకరించారు. ఇందులో విశాలమైన డూప్లెక్స్ (రెండు అంతస్థుల) భవనంతో పాటు, విశాలమైన ప్రార్థనామందిరం నిర్మించారు. సౌండ్ ప్రూఫ్ సిస్టంతో పాటు ఒకేసారి 10వేల మంది ప్రార్థన చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ క్రిస్మస్ వేడుకులకు దేశవిదేశాలకు చెందిన క్రిస్టియన్లు వస్తుంటారు.



పర్యాటక ప్రాంతంగా..

క్రిస్మస్ వేడుకల కోసం చర్చిని సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశాం. 131 సంవత్సరాల చరిత్ర కలిగిన సెంటినరీ బాప్టిస్టు చర్చి(సీబీసీ) నూతన భవనం రాష్ట్రంలోనే అతిపెద్ద చర్చిల్లో రెండో స్థానంలో ఉంది. ఇందులో ఒకేసారి 10వేల మంది ప్రార్థన చేయవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవిదేశాలనుంచి ఇక్కడికి క్రిస్టియన్లు వస్తుంటారు.

\- పుల్లా జగ్జీవన్ బాబ్జీ, పాస్టర్

1893లో నిర్మాణం..

వరంగల్ క్రిస్టియన్‌కాలనీలో 1893 సంవత్సరం, అక్టోబరు 1న, 20 మంది సంఘపెద్దలు కలిసి తొమ్మిదెకరాల స్థలంలో సీబీసీని నిర్మించారు. 1956లో సెంటినరీ బిల్డింగ్, పాస్టర్, పార్సనేర్ల కోసం నివాసాలను ఏర్పాటు చేశారు. నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వంతో పాటు, సంఘం సభ్యులు 5వేల మంది దాతల సహాయంతో సుమారు రూ.10 కోట్లు ఖర్చుపెట్టి పునఃనిర్మించా రు. ఇందులో ప్రతీ ఆదివారం ప్రార్థనలు, మంగళవారం స్త్రీలఆరాధన, బుధవారం సంఘం ఆరాధన, గురువారం కుటీరప్రార్థన, శుక్రవారం ఉపవాస ప్రార్థన, శనివారం యూత్ ఫెలోషిప్‌తో పాటు యేటా డిసెంబరు రెండో వారం స్త్రీల క్రిస్మస్‌ను జరుపుకుంటారు. ఈ నెల 22న, చిల్డ్రన్ ఫెస్టివల్, 23న యూత్ ఫెస్టివల్, 24న, వాచ్‌నైట్ సర్వీస్, 25న క్రిస్మస్, జనవరి 1న నూతనసంవత్సర వేడుకలు ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. సీబీసీ ఆధ్వర్యంలో బెతెస్థా బాప్టిస్టు చర్చి-లక్ష్మీపురం, బరకా బాప్టిస్టు చర్చి, గోవిందాపురం, కొండాపురం, మూడుచెక్కల పల్లి, నల్లబెల్లి, ఓటాయి, ఎల్లాయిగూడెం, బెత్లెహం బాప్టిస్టు చర్చిలున్నాయి. సీబీసీ సీనియర్ పాస్టర్‌గా జగ్జీవన్‌బాబ్జీ, అధ్యక్షుడిగా పీఆర్ సాల్మన్, ప్రధానకార్యదర్శిగా కొల్లూరి రాజ్‌కుమార్, కోశాధికారిగా కొల్లూరి కవిరాజ్(టోని), ఉపాధ్యక్షుడిగా మేకల భరత్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా పొలెపాక శ్రీకర్, సంయుక్త కొశాధి కారిగా కొల్లూరి విశాల్, కార్యవర్గ సభ్యులుగా బసికే నవీన్‌సన్, మేకల ప్రభాకర్, గుండేటి శ్యామ్‌కుమార్,పల్లె ఉదయ్, పిలెపాక ఉదయ్ కుమార్, వస్కుల యోహాన్ కొనసాగుతున్నారు.



క్రిస్టియన్‌కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లోని సీఎస్ఐ చర్చి

మత సామరస్యానికి ప్రతీక సీఎస్ఐ చర్చి

- సర్వ మతాల నిర్మాణశైలి ఇక్కడి ప్రత్యేకత
- నాడు బ్రిటీష్ పాలకుల సహాయాన్ని తిరస్కరించిన అజరయ్య

డోర్నకల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మతాలైన హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రార్థన మందిరాల నిర్మాణ శైలితో పాటు ఆయా మతాల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని నిర్మించిన డోర్నకల్‌లోని చరిత్రాత్మక సీఎస్ఐ చర్చి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. 1915 సంవత్సరంలో జనవరి 14న అప్పటి మద్రాసు బిషప్ హెన్రీ వైట్ హెడ్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగ్గా.. సుమారు 24 ఏళ్ల పాటు పనులు కొనసాగాయి. 1939 జనవరి 6వ తేదీ ఎపిఫనీ దినోత్సవం రోజున అప్పటి భారత క్రైస్తవ సభ అధ్యక్షుడు బిషప్ ఫాస్ వెస్ట్‌కాట్ ఈ చర్చిని ప్రారంభించారు. ఈ క్రమంలో ఈ చర్చిని ఎపిఫనీ కెథిడ్రల్ చర్చి అంటారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను మిళితం చేస్తూ.. ప్రధాన మతాల మనోభావాలకు అనుగుణంగా తమిళనాడుకు చెందిన బిషప్ అజరయ్య ఈ చర్చిని నిర్మించారు. ముఖ్యంగా ద్రావిడ (దక్షిణ) భారతదేశ ప్రార్థన మందిర నిర్మాణాలను పోలి ఉండేలా ఆకృతులను రూపొందించారు. చర్చి నిర్మాణం కోసం ఆస్ట్రేలియా, బర్మ (ప్రస్తుత మయన్మార్) సిలోన్ (శ్రీలంక), అమెరికా దేశాలకు చెందిన అజరయ్య మిత్రులు, దేశంలోని క్రైస్తవ విశ్వాసులు చర్చి నిర్మాణం కోసం ఆర్థికసాయం అందించారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో డోర్నకల్ సీఎస్ఐ చర్చి

స్వాతంత్ర్య కాంక్షకు అనుగుణంగా..

నాడు ప్రజల్లో బలంగా నాటుకుపోయి ఉన్న స్వాతంత్ర్య కాంక్షను నిర్దాక్షిణంగా అణిచివేత సాగిస్తున్న బ్రిటన్ ప్రభుత్వం, దేశస్తులు చర్చి నిర్మాణం కోసం ఇస్తామన్న నిధులను.. అజరయ్య సున్నితంగా తిరస్కరించారు. చర్చి నిర్మాణానికి నిధుల కంటే స్వాతంత్ర్యం ఇవ్వాలంటూ వారి ముందే కుండబద్ధలు కొట్టినట్టుగా చెప్పారు. చర్చి నిర్మాణంలో భాగంగా ప్రధాన ప్రార్థన మందిరాన్ని ఏసుక్రీస్తు ప్రియశిష్యులైన 12 మంది విశ్వాసులను స్ఫురించే విధంగా 12 పిల్లర్లతో చర్చిని నిర్మించారు. పిల్లర్ల నిర్మాణ ఆకృతి.. మధురైలోని మీనాక్షి దేవాలయ పిల్లర్ల నమూనాలో ఉంటాయి. అలాగే చర్చిపై ఉన్న రెండు ప్రధాన గోపురాలు హిందూ ముస్లిం ప్రార్థనమందిరాల నిర్మాణశైలీలో మిళితమై ఉంటాయి. చర్చి ప్రధాన ద్వారం హిందూ దేవాలయాల సింహద్వారాన్ని కలిగి ఉంటుంది. చర్చి రక్షణ కొరకు చివరన సూదుల్లా మొనదేలి ఉన్న ఇత్తడి లోహంతో తయారు చేసిన గోళాకారం ఆకృతులను ప్రధాన ద్వారానికి బిగించారు. చర్చి సర్వమతాల సమ్మేళనంగా ఉండాలని భావించిన అజరయ్య ఆ విధంగానే చర్చిని నిర్మించారు. కాగా, బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలంకరించారు. తెల్లవారుజామున చర్చిలో డోర్నకల్ సీఎస్ఐ బిషప్ రైట్.రెవ. కోడిరెక్క పద్మారావు దైవసందేశం అందిస్తారు.

గురుకుల ఉపాధ్యాయుడి సృజనాత్మకత



చాక్‌పీస్‌లపై శాంతాక్లాజ్, నక్షత్రాల బొమ్మలు

నిత్యం పాఠాలు బోధిస్తూ బిజీగా ఉండే ఓ ఉపాధ్యాయుడు తనలోని సృజనాత్మతకు పదును పెడుతున్నారు. చాక్‌పీస్‌లతో బొమ్మలను చెక్కి ఔరా అనిపిస్తున్నారు.. భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులానికి చెందిన ఆర్ట్ టీచర్ రజనీకాంత్. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆయన చాక్‌పీస్‌లతో శిలువపై ఏసుక్రీస్తు, శాంతాక్లాజ్, స్టార్ బొమ్మలతో పాటు హ్యాపీ క్రిస్మస్ అనే అక్షరాలను చెక్కి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

\- కాటారం, ఆంధ్రజ్యోతి

క్రిస్మస్ కాంతులు

విద్యుత్ కాంతులతో వెలిగిన చర్చిలు



పశువుల పాకలో బాల యేసు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చర్చీలను అందంగా ముస్తాబుచేశారు. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రంగురంగుల కాంతులతో ప్రార్థనాలయాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు. కేకులు కట్ చేసి పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కాజీపేట పాతిమా చర్చి



విద్యుత్ వెలుగులలో వరంగల్ లేబర్‌కాలనీలోని సీబీసీ చర్చి



హనుమకొండలోని సీబీసీ చర్చి



మేడారం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- రహదారుల నిర్మాణం, అంతర్గత గుడుల పునరుద్ధరణకు శ్రీకారం
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- రూ. 22.75 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మేడారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మేడారం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రూ. 22.75 కోట్లతో మేడారంలో చేపట్టనున్న శాశ్వత పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపనలు చేశారు. రూ.2.75 కోట్లతో వీఐపీ పార్కింగ్ రోడ్డు, రూ.2 కోట్లతో ఊరట్టం, రూ.2 కోట్లతో సారలమ్మ స్వాగత తోరణం నుంచి కన్నెపల్లి సారలమ్మ గుడి వరకు, రూ. 2.50కోట్లతో కాల్వపల్లి క్రాస్ నుంచి గ్రామం వరకు, రూ.1.30కోట్లతో ముయ్యాజియం నుంచి నారింజ బందం వరకు రోడ్లు, రూ.1.92కోట్లతో అంతర్గత గుడుల పునరుద్ధరణ, రూ.3.08 కోట్లతో క్యూలైన్లపై షెడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో కార్య నిర్వాహణ అధికారి రాజేంద్రం అధ్యక్షతన పూజారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లులను దర్శించుకునేందుకు మేడారం వచ్చే భక్తులకు రహదారుల నిర్మాణం, ఇతర మౌలిక సౌకర్యాల కోసం అభివృద్ధి పనరులకు శ్రీకారం చుట్టామని అన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ. 22.75కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రోడ్ల మరమ్మతులు, అంతర్గత గుడుల పునరుద్ధరణ, క్యూలైన్లపై షెడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

వీటిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. జంపన్నవాగు పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ నిర్మాణానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. అటవీ శాఖ అభ్యంతరాలతో కొండాయి - మేడారం రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందని, సంబంధిత శాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడి అనుమతులు తెప్పించి పూర్తి చేయిస్తానని తెలిపారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- కేంద్ర మంత్రితో ప్రధాని బహిరంగ క్షమాపణ చెప్పించాలి
- రాజ్యాంగంపై గౌరవం లేని కేంద్రం.. రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కేంద్ర మంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖలను కలెక్టర్ ప్రావీణ్యకు అందజేస్తున్న ఎమ్మెల్యేలు కడియం, నాగరాజు, నాయిని

వడ్డెపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమాన పరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్‌లతో కలిసి కాంగ్రెస్ శ్రేణుల పెద్దఎత్తున మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి అమిత్‌షాతో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ క్షమాపణ చెప్పించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. భారత రాజ్యాంగంపై కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం గౌరవం లేదని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ లెజెండ్ అని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లేకపోతే ఈ దేశంలోని అట్టడుగు వర్గాల పరిస్థితి ఏ విధంగా ఉండేదోనని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను అవమానించడమంటే భారత జాతిని అవమానించడమేనని, అన్ని మతాలను కించపర్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. అంబేద్కర్ దైవంతో సమానమని, తమ దేవుడిని కించపరిస్తే తగిన బుద్ధి చెబుతామని అన్నారు. అధికార మదంతో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి మతతత్వాన్ని ప్రేరేపిస్తూ కాంగ్రెస్ పార్టీపై విషం చిమ్ముతోందని అన్నారు. అంబేద్కర్‌ను అవమానపర్చిన అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. జై భీమ్ అంటే బీజేపీ నేతలకు గుండెదడ వస్తోందని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మతతత్వ భావజాలాన్ని మార్చుకోవాలని అన్నారు. అమిత్‌షాపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, లేదంటే బీజేపీ నేతలను గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. రాముడు మాకూ దేవుడేనని నాగరాజు స్పష్టం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీని వాసరావు, రాష్ట్ర , జిల్లా నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూచన రవళి, బంక సరళ సంపత్ యాదవ్, పెరుమాండ్ల రామకృష్ణ, మీర్జా అజీజ్ ఉల్లా బేగ్, ఎనుకొంటి నాగరాజు, మండల సమ్మయ్య, బిన్ని లక్ష్మణ్, మహ్మద్ అంకూస్, నాయిని లక్ష్మారెడ్డి, పింగిళి వెంకటనర్సింహారెడ్డి, ఎంపీ ఆనంద్, పులి అనిల్‌కుమార్, కొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు అందించారు.

కొత్తకొండ జాతరను విజయవంతం చేద్దాం..

- జనవరి 10 నుంచి 18 వరకు జాతర
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



కొత్తకొండ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

భీమదేవరపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్రస్వామి జాతరను విజయవంతం చేద్దామని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం ఆలయ ఈవో కిషన్‌రావు అధ్యక్షతన ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ప్రావీణ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. కొత్తకొండలోని వీరభద్రస్వామి ఆలయంలో జనవరి 10 నుంచి జాతర బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు జిల్లాలోని పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు, భవనాలు, విద్యుత్, దేవాదాయ, పర్యాటక, రవాణా, ఎక్సైజ్, పశుసంవర్ధక శాఖ తదితర శాఖల అధికారులు బాధ్యతగా సమన్వయంతో భక్తితో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కొత్తకొండ దేవాలయం ఎంతో చారిత్రాత్మకమైందని, దేవాలయ ప్రతిష్ఠతను గ్రామానికి, మండలానికి, జల్లాకు పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా తెలియజేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు సమస్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. జాతర ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్య పెంచాలన్నారు. జాతరలో నిరంతరం వైద్య సేవలు, పశువైద్య సేవలు అందించే విధంగా వైద్య, ఆరోగ్య శాఖ, పశువైద్య అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్డు మరమ్మతులను ఆర్అండ్‌బీ శాఖ అధికారులు చేపట్టాలన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. కాగా, కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ ప్రావీణ్యకు ఆలయ అర్చకులు, ఈవో కిషన్‌రావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం వీరభద్రస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను ఆలయ ఈవో కిషన్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, కాజీపేట ఏసీపీ తిరుమల్, ఆలయ ఈవో కిషన్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్య, డీపీవో లక్ష్మీరమాకాంత్, ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్, చైల్డ్ వెల్ఫేర్ అధికారి జయంతి, ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, డీపీఆర్వో జీవీ భానుప్రసాద్, సీఐ పులి రమేష్, ఎస్ఐ సాయిబాబు, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్, పశువైద్యాధికారి డాక్టర్ మాలతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో బీఆర్ఎస్ కమీషన్లు

హనుమకొండ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో కమీషన్లు తీసుకున్నది బీఆర్ఎస్ నాయకులేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. సోమవారం హనుమకొండ జిల్లాకు వచ్చిన మాజీ మంత్రి హరీ‌ష్‌రావు సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన దీక్షలకు సంఘీభావం తెలిపారని, అయితే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎందుకు రెగ్యులర్ చేయలేదని నాయిని ప్రశ్నించారు. వరంగల్‌లో జైలును కూలగొట్టి ఆస్పత్రి పేరుతో భూమి పత్రాలు మహారాష్ట్ర బ్యాంకులో లోను తీసుకుని, కమీషన్లు తీసుకున్నది మీరే కదా అని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే హరీ‌ష్‌రావు విమర్శలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఆటోడ్రైవర్లను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రుణమాఫీ చేస్తే రైతుబంధు అని రైతులను రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రకటనలో మండిపడ్డారు.

సైన్స్ సెమినార్‌కు ఉపాధ్యాయులు పత్రాలు సమర్పించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ నిర్వహిస్తున్న సైన్స్ సెమినార్‌లో పాల్గొనాలనే ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు పరిశోధనపత్రాలను సమర్పించాలని డీఈవో దౌలాగర్ వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు డైట్, బీఈడీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు పత్రాలు సమర్పించవచ్చునని తెలిపారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు, అధ్యాపకులు జనవరి 20 లోపు పత్రాలను సమర్పించాలని ఆమె కోరారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి


ఆర్ట్స్ కళాశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ డిమాండ్ చేశారు. టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ... మూడేళ్లుగా రూ.6,500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరేళ్లుగా రూ.8వేల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. విద్యాశాఖకు ఇప్పటి వరకు మంత్రి లేకపోవడాన్ని బట్టి చూస్తే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నట్లు అర్థం అవుతోందన్నారు. ఇప్పటికైనా పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు మణితేజ, సాంబరాజు, రోహిత్, మనోజ్, వంశీ, సందీప్, భరత్, సన్ని, అనిల్, రాకేష్, శ్రీకాంత్, దినేష్, అభినేష్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఇయర్‌వైజ్ బ్యాక్‌లాగ్ ఫీజులను తగ్గించాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి): కేయూ డిగ్రీ ఇయర్ వైజ్ బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్షల ఫీజులను తగ్గించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) కేయూ ఇన్‌చార్జి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి ఫీజులను తగ్గించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఇయర్‌వైజ్ ప్రాసెసింగ్, పరీక్షల ఫీజులు ఒక్కో సబ్జెక్టుకు రూ.7వేలుగా నిర్ణయించారని చెప్పారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు అధిక మొత్తంలో ఫీజులు చెల్లించలేదని పరిస్థితి ఉందన్నారు. వెంటనే ఫీజులను సగం వరకు తగ్గించాలని డిమాండ్ చేశారు. బీఎస్ఎఫ్ కేయూనాయకులు దాసరి అఖిల్, సయ్యద్ అలీ, శివకుమార్ పాల్గొన్నారు.

అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలి

వడ్డెపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను అవమాన పరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి శనిగరపు రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు బస్కె నాగరాజు డిమాండ్ చేశారు.బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఆదేశం మేరకు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్దగల భారత రాజ్యాంగ స్తూపం ముందు అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి నక్కల గుట్టలోని వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ ప్రదర్శనలో బీఎస్పీ రాష్ట్ర, జిల్లా నాయకులు బొల్లంపల్లి సారయ్య, పసుల వినయ్ అంబేద్కర్, చింత సామ్యూల్, జన్ను అనిల్, బుర్రి సాగర్, పసుల భిక్షపతి, వస్కుల ప్రవీణ్, శ్రీకాంత్, శ్యామ్, కోకిల కిరణ్, రజినీకుమార్ పాల్గొన్నారు.

ఆశా బస్ జాతా పోస్టర్ ఆవిష్కరణ

రాంనగర్, డిసెంబర్ (ఆంధ్రజ్యోతి) : ఆశాల వేతనాలు పెంచాలని ఈ నెల 15 నుంచి ప్రారంభమైన ఆశా బస్ జాతా పోస్టర్‌ను మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, ఆశాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి ఆవిష్కరించారు. ఈ నెల 29న జిల్లాకు వస్తున్న బస్సు జాతాలో పెద్ద సంఖ్యలో ఆశాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కెపాసిటర్లపై రైతులకు అవగాహన

రాంనగర్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : పొలం బాటలో భాగంగా మంగళవారం న్యూశాయంపేటలో మోటర్లకు కెపాసిటర్లు అమర్చుకోవడం వల్ల కలిగే లాభాలపై రైతులకు విద్యుత్ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈలు సాంబరెడ్డి, విజేందర్‌రెడ్డి, సుబేదారి ఏఈ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి): కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా నియమితులైన కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌ను మంగళవారం ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (ఎంఈపీఏ) తెలంగాణ రాష్ట్ర కమిటీ నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. కేయూ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయంలో కలిసి శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, పొన్నం రాజు, కొమ్ము ప్రభాకర్, అల్లాడి యాదగిరి, కల్లెబోయిన కుమార్, మోరె రాజు, ఈర్ల రాకేశ్, రమేశ్, అమ్మగాని శ్యామ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

హనుమకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో ఏ వస్తువునైనా కొనుగోలు చేసేప్పుడు వాటి నాణ్యత, ధర, తదితర అంశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల మండలి సభ్యుడు రావుల రంజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని వినియోగదారులమండలి కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో వ్యాపారుల మోసాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, అధిక లాభార్జన కోసం వ్యాపారులు వినియోగదారులను రకరకాలుగా మోసం చేస్తున్నారని అన్నారు. కనుక ప్రతీ వినియోగదారుడు వస్తు కొనుగోలుపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులు, బాధ్యత లపై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. రావుల రంజిత్ కుమార్‌తో పాటు వినియోగదారుల మండలి సభ్యులు కళ్యాణపు శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య


కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం శాంతాక్లాజ్ వేషాధారణలో ఉన్న ఆకారపు ఈషాకు కలెక్టర్ ప్రావీణ్య కేక్ తినిపించారు. ఈ వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ వైవి గణేష్, డీఆర్‌డీఏ పీడీ మేన శ్రీనివాస్, డీఎంహెచ్ఓ అప్పయ్య టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నేతలు శ్యాంసుందర్, రమేష్, జిల్లా నేతలు రాజేష్ ఖన్నా, భగవాన్‌రెడ్డి, పావని, మాధవి, సింధు రాణి పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

వరంగల్ మెడికల్: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. బేతేలు బాప్టిస్ట్ చర్చి లష్కర్‌సింగారం ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు జన్మదిన వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రోగులకు చలికాలం నేపథ్యంలో బ్లాంకెట్స్ బహూకరించారు. ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ దీపక్, డాక్టర్ చాడ రమేశ్, డాక్టర్ కుమారస్వామి, కె.నవీన్, ఎస్.సుమంత్, పాస్టర్ రెవ ఎం.ఉదయ సామేల్, ఎర్ర అబ్రహం, ఎర్ర వెంకటేశ్, కందుకూరి ఇమ్మానియేల్, దామర యోహాను, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: గ్రేటర్ 55వ డివిజన్ కేంద్రం భీమారం సెంటర్‌లో ఆదరణ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ ఈవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం లార్డ్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ కన కం కిరణ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పుట్ట రవి, సంగాల విక్టర్ బాబు, లార్డ్ ఆశ్రమం నిర్వాహకుడు నాగమూరి నరేష్, పాస్టర్లు కిశోర్‌కుమార్, ప్రవీణ్, కిరణ్‌నాథన్, రత్నం, బ్రద ర్ ప్రకాష్, కృపాల్, రాజేష్, కాంగ్రెస్ నాయకులు మట్టెడ అనిల్‌కుమార్, పుట్ట రాజు, పెండ్యాల వీనస్, గోల్కొండ రజనీకాంత్, కొండేటి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఘనంగా క్రిస్మస్ సంబురాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనంలో మంగళవారం ఘనంగా క్రిస్మస్ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భగా కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫె సర్ కట్ల రాజేందర్, దూరవిద్య డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌ల నేతృత్వంలో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగులు ఎస్.గిడియన్, మహమ్మద్ అమీర్, ఎ.నరసింహమూర్తి, ఏఆర్ ప్రణయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. క్రిస్మస్ కేకు పంచారు. కేయూ వివేకనంద స్కాలర్ హాస్టల్‌లో స్కాలర్ కలకోట సుమన్ నేతృత్వంలో సెమీ క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేసి సంబురాలు చేశారు.

గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి


ఎమ్మెల్యే నాయినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గెజిటెట్ అధికారుల సంఘం నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఇటీవల నియామకమైన కిరణ్‌కుమార్‌గౌడ్, కోల రాజేష్‌కుమార్, ఈవీ కిరణ్మయి, ఆస్నాల శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఎమ్మెల్యే నాయినిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న వారిని అభినందించారు.

రౌడీ షీటర్లు హద్దు మీరితే చర్యలు తప్పవు

హనుమకొండ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రౌడీ షీటర్లు హద్దు మీరితే చర్యలు తప్పవని సుబేదారీ సీఐ సత్యనారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం హనుమకొండలోని సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సీఐ పి.సత్యనారాయణరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, భూకబ్జాలు, సెటిల్మెంట్లకు పాల్పడవద్దని అన్నారు. హద్దుమీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని సీఐ సత్యనారాయణరెడ్డి హెచ్చరించారు.


సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

కాంగ్రెస్ నాయకుల నిరసన


హసన్‌పర్తిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

హసన్‌పర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్, మాజీ దేవస్థానం డైరెక్టర్ ఆరెల్లి వెంకటస్వామి, నాయకులు రవీందర్, రమేష్, ఆనంద్, సురేష్, గంగాధర్, మొగిళి, సాంబయ్య, రామరాజు పాల్గొన్నారు.

కళాకారులకు ఫించన్లు మంజూరు చేయించాలి


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న గజవెల్లి సారయ్య

వడ్డెపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా కళనే నమ్ముకొని జీవిస్తున్న చిందు యక్షగాన కళాకారులకు కేంద్రం ఫించన్లను 100 మంది కళాకారులకు మంజూరు చేయిం చాలని, సంక్రాంతి సంబరాలు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా 500 మంది కళాకారులకు కళను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించాలని చిందు యక్షగాన వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి సారయ్య(ఏసోబు) కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ.. చిందు యక్షగాన కళాకారులకు నివేశన స్థలాలు, గృహాలను మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. బండి సంజయ్‌కుమార్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేతాల సురేందర్, హుజురాబాద్ సమ్మయ్య తదితరులు ఉన్నారు.

ఎల్లాపూర్ ఎస్‌పీఆర్‌లో ఘనంగా జ్ఞానసంహిత

హాజరైన సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ


జేడీ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న గౌరిశెట్టి జగన్మోహన్

హసన్‌పర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎల్లాపూర్ ఎస్‌పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స లెన్స్ పాఠశాలలో ఎథికల్ గైడెన్స్‌లో భాగంగా నిర్వహించిన జ్ఞానసంహిత కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులు మండల కాళిదాస్ రాసిన ఎమిణుగురు దీపాల్ అనే కవితా సంపుటి పుస్తకాన్ని ముఖ్య అతిథిగా హాజరైన సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అంటే కేవలం విద్యను బోధించేది మాత్రమే కాదని సమాజ శ్రేయస్సు కోరే మానవీయ విలువలతో కూడిన విద్యను అందించే కర్మాగారమన్నారు. ప్రతీ పాఠశాల సమాజ శ్రేయస్సు కోరే క్రమశిక్షణ కలిగిన పౌరులను తయారు చేయగలిగినప్పుడే ఆ విద్యాసంస్థకు సమాజంలో పేరొస్తుందన్నారు. ఎక్కడ నెగ్గాలో కాదు. ఎక్కడ తగ్గాలో తెలుసుకొని నడుచుకోవాలని, బురదలో పుట్టిన తామర భగవంతుడిని చేరినట్లు బీద, ధనిక అనే తేడా లేకుండా మనకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని లక్ష్యం వైపుగా నిరంతరం కృషి చేస్తేనే తప్పక విజయం సాధిస్తామని తెలిపారు. వేదాలు, పురాణాలు పుట్టిన భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పేలా విద్యార్థులు తయారు కావాలన్నారు. ఎస్‌పీఆర్ పాఠశాల ప్రాంగణంతో పాటు ఇక్కడి విద్యా విధానం తనను ఎంతగానో ఆకర్షించిందన్నారు. ఎస్‌పీఆర్ డైరెక్టర్ గౌరిశెట్టి జగన్మోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలను బోధిస్తూ వారి అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. నీట్‌లో ఆలిండియా 2వ ర్యాంకు సాధించిన పాఠశాల విద్యార్థి శ్రీరాం నా యక్‌ను ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా భీమారం శివాని హైస్కూల్ విశ్వత్ ఫెస్ట్



ఫెస్ట్‌లో పాల్గొన్న సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ

హసన్‌పర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగట్టు ఎంటీఆర్ గార్డెన్స్‌లో భీమారం శివాని హైస్కూల్ 10 ఏళ్ల విశ్వత్ ఫెస్ట్ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సంక్రమంగా ఆలోచించినట్లైతే ఈ ప్రపంచంలో సాధ్యం కానీ విషయం అంటూ ఏదీ లేదన్నారు. ప్రతీ ఒక్కరు పాజిటీవ్‌గా ఆలోచించి ముందుకు సాగాలన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామికుమార్ మాట్లాడుతూ.. జీవితంలో సరైన పనులను చేస్తే అది అందరి మదిలో నిలిచిపోతుందన్నారు. ఈ సందర్భంగా 10 ఏళ్లలో విద్యనభ్యసించిన వారు పాల్గొని తమ అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, టి.రాజుకుమార్, ఎస్.రమేష్, ఎ.మురళీధర్, ఎస్.సంతోష్‌రెడ్డి, వి.సురేష్, అధ్యాపక సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలో విస్తృత ఉపన్యాసం

కేయూ క్యాంపస్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలో మంగళవారం విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన భారత రాజ్యాంగం -సమకాలీన పరిస్థితులు అనే అంశంపై విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. ఈ ససందర్భంగా మహబూబ్‌నగర్‌లోని పాలమూరు వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంగరి భూమయ్య హాజరై మాట్లాడారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగంపై చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైందన్నారు. దేశానికి దిక్సూచి రాజ్యాంగమన్నారు. రాజ్యాంగ విఫలం చెందితే అది రాజ్యాంగం తప్పుకాదని పాలకుల తప్పిదమేనని అంబేద్కర్ చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్‌వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వోడపల్లి నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజుకు ఏఎన్ఎంల వినతి

వరంగల్ మెడికల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న జరగనున్న ఎంపీహెచ్ఏ (ఎఫ్) రాత పరీక్షను నిలిపి వేయాలని కోరుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు మంగళవారం ఏఎన్ఎంలు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి రాత పరీక్ష లేకుండా సర్వీసును క్రమబద్ధీకరించేందుకు పోరాటాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాత పరీక్ష నిర్వహిస్తుండటంతో ఏఎన్ఎంలు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మహిళకు అవగాహన కల్పిస్తే కుటుంబాన్ని చైతన్యపరిచినట్లే...

బాలసముద్రం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల హక్కుల చట్టంపై ఒక మహిళకు అవగాహన కల్పిస్తే కుటుంబం మొత్తాన్ని చైతన్య పరిచినట్లేనని, తద్వారా సమాజాన్ని మోసాల భారీ నుంచి కాపాడినట్టవుతుందని కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ ఛైర్మన్ డాక్టర్ కరకాల అనితారెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అనితారెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలోని స్వధార్ ఆశ్రమంలో మహిళలకు వినియోగదారుల హక్కుల చట్టం 2019 రక్షణ బాధ్యతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనితా రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ వస్తువును కొనుగోలు చేసినప్పుడు బిల్లును, గ్యారంటీ కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని ఏదైనా ఇబ్బంది ఎదురైనప్పుడు కేసు వేయడానికి అవి ఉపయోగపడుతాయని అన్నారు. చట్టంపై వినియోగదారులకు తగు అవగాహన కల్పించి ఎవరైనా మోసపోతే వినియోగదారుల కోర్టును వినియోగించుకొని ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేస్తామని అన్నారు. మోసాలను అరికట్టే ప్రతీ పని నాణ్యతను పెంపొందించడమే అవుతుందని ఆమె అన్నారు. అనంతరం సేవా కార్యక్రమంలో భాగంగా స్వధార్ ఆశ్రమానికి బియ్యం బస్తాలను ఆమె అందజేశారు. కార్యక్ర మంలో శైలజ, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగ ఉపాధ్యాయ, ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ.. పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కొల్లు నర్సమ్మ, బోనగిరి రాములు, జిల్లా నాయకులు వాసుదేవరెడ్డి, నారాయణరెడ్డి, సోమన్న, ప్రభాకర్, ఉమారాణి, రాజమౌళి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి


డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

న్యూశాయంపేట, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివం పవర్ అన్నారు. న్యూశాయంపేటలోని కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం న్యూశాయంపేటలోని టీవీఆర్ గార్డెన్‌లో సీనియర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ ప్రోగ్రామ్ ఇన్ఫినిటీ ఆర్‌ఆర్ -25పేరుతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డాన్స్‌లు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివం పవర్ మాట్లాడుతూ.. కెరీర్ పాయింట్‌లో విద్యార్థులకు మంచి విద్య అందిస్తున్నారని, కెరీర్ పాయింట్ నిర్వాహకులు ముందు ముందు కూడా ఇలాంటి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా గత సంవత్సరం జాతీయ స్థాయి సంస్థలలో, మెడికల్ కళాశాలలలో సీట్లు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా సన్మానించారు. కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ ఛైర్మన్ జూలపల్లి కరుణాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రతిమ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గుజ్జుల సౌమ్య, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ వెంకటరమణ, కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ కె.మధుపాల్‌రావు, డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్, ప్రిన్సిపల్ దేవేందర్, అకాడమిక్ ప్రిన్సిపల్ తివారి, కోట అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని భారతరత్న అటల్ బీహారీ వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా నేడు హనుమకొడ సుబేదారిలోని రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపా రు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ధర్మారావు ఆ ప్రకటనలో తెలిపారు.

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం
25 డిసెంబరు 2024



కలర్‌ఫుల్ కో ఆర్డ్ సెట్స్

సౌకర్యం ప్రధానంగా దుస్తులను ఎంచుకునేవాళ్లకు అత్యంత అనుకూలమైన దుస్తులు...'కో ఆర్డ్ సెట్స్'. కాలానికి తగ్గట్టు రకరకాల మెటీరియల్స్‌తో తయారయ్యే కో ఆర్డ్ సెట్స్, పిల్లలు, పెద్దలు... ఇద్దరికీ అనువైనవే! తాజాగా ట్రెండ్ అవుతున్న కొన్ని సెట్స్ మీద ఓ లుక్కేద్దాం!





కోఆర్డినేట్ అనే పదాన్నే కురచగా కో ఆర్డ్ అని పలుకుతూ ఉంటాం. సమన్వయాన్ని దుస్తులకూ వర్తింపచేసే యొచ్చనే ఆలోచనతో రూపొందిన ఫ్యాషన్ ఇది. టాప్, బాటమ్ రెండిటినీ జోడిస్తూ, సరికొత్త స్టైల్‌తో రూపొందిన కొ ఆర్డ్ సెట్ అనే పోకడ ఇటీవల విపరీతంగా ఊపందుకుంది. ఈ సెట్స్ క్యాజువల్ వేర్‌గా అన్ని వయసుల వారినీ ఆకట్టుకుంటూ ఉండడం విశేషం.

కాటన్, క్రేప్, రెయాన్.. ఇలా రకరకాల మెటీరియల్స్‌లో రూపొందుతున్న కొ ఆర్డ్ సెట్స్ అన్ని కాలాలకూ అనుకూలంగా ఉంటాయి. సౌకర్యం కోసం నైట్ డ్రస్‌లకు బదులుగా ప్రత్యామ్నాయాల కోసం వెతికే వాళ్లకు కూడా ఈ సెట్స్ ఎంతో అనువుగా ఉంటాయి.



నచ్చిన మోడల్‌లో...

ప్రింటెడ్ కొ ఆర్డ్ సెట్స్, డెనిమ్ కొ ఆర్డ్ సెట్స్, స్లీవ్‌లెస్, లాంగ్ స్లీవ్స్... ఇలా కొ ఆర్డ్ సెట్స్ ఎన్నో రకాల మోడల్స్‌లో రూపొందుతున్నాయి. వాటికి తగిన సింపుల్ జ్యువెలరీ, సాదాసీదా ఫుట్‌వేర్‌తో మ్యాచ్ చేస్తే ఆకర్షణీయమైన కొ ఆర్డ్ సెట్ లుక్‌ను సొంతం చేసుకోవచ్చు.


మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

ముత్యాల ముగ్గు

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com



పబ్‌కు వెళతాం... క్లబ్‌కు వెళతాం... అక్కడ హోరెత్తే సంగీతానికి అలసిపోయేంతగా ఆడేస్తాం. ఆడేది మనమే అయినా ఆడించేది వేరే. అదే డీజే... డిస్క్ జాకీ. మరి డీజే అనగానే కళ్లలో మెదిలేది..! మగవారే... కదా..! కానీ ఒక అమ్మాయి... ఏరికోరి... అదీ ఎయిర్‌హోస్టెస్ ఉద్యోగం వదిలి... డిస్క్ జాకీగా దుమ్ము రేపుతోంది. రీమిక్స్‌లు... వీడియో ఆల్బమ్‌లు... దేశమంతటా ప్రదర్శనలు... ఒకటేమిటి... అన్నింట్లో అదరగొట్టేస్తోంది. డీజే పరోమా... ఉరఫ్ పరోమా చటర్జీతో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ.





డీజే పరోమా... దుమ్ము రేపుతోంది

"సరిగ్గా పద్నాలుగేళ్ల కిందట... కోరి సంపాదించుకున్న ఎయిర్‌హోస్టెస్ ఉద్యోగం వదిలేశాను. చదువుకొనే రోజుల్లో దాని కోసం ఎన్నో కలలు కన్నాను. పన్నెండో తరగతి తరువాత శిక్షణ తీసుకున్నాను. 2005లో జెట్ ఎయిర్‌వేస్‌లో ఎయిర్‌హోస్టెస్‌గా గగనతలంలో నా ప్రయాణం ప్రారంభమైంది. అయితే ఆ ఉద్యోగం చేస్తున్నన్ని రోజులూ ఏదో వెలితి. అందుకు కారణం... కొత్తగా ఏదో చేయాలనే తపన. అది నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. నేను కాస్త భిన్నం. సంపాదనే ధ్యేయంగా కెరీర్‌ను వెతుక్కొంటూ పరుగెత్తలేదు. నాకు సంతృప్తిగా అనిపిస్తేనే ఎందులోనైనా కాలు పెడతాను. కొనసాగుతాను. ఎయిర్‌హోస్టెస్‌గా వద్దనుకున్నాక.. రెండు మూడు ఉద్యోగాలు ప్రయత్నించాను. అవీ నచ్చలేదు. చిన్నప్పటి నుంచి నాకు పాటలంటే చాలా ఇష్టం. శ్రావ్యమైన సంగీతమే కాదు... రీమిక్స్‌లవంటివి కూడా బాగా ఆస్వాదించేదాన్ని. ఆ అభిరుచినే వృత్తిగా స్వీకరిస్తే..? ఆలోచన వచ్చిన మరుక్షణం ఆచరణలో పెట్టేయాలని నిర్ణయించుకున్నాను. డిస్క్ జాకీగా అవతారం ఎత్తాను.

దేనికీ అడ్డుచెప్పలేదు...

నా అదృష్టం ఏంటంటే... నా నిర్ణయాలకు విలువనిచ్చి, ఎప్పుడూ ప్రోత్సహించే అమ్మానాన్నలు ఉండడం. వారికి నా మీద ఎంతో నమ్మకం. దేనికీ అడ్డుచెప్పరు. మాది ముంబయిలో స్థిరపడిన బెంగాలీ కుటుంబం. నేను పుట్టింది, పెరిగిందీ ముంబయిలోనే. నా అసలు పేరు పరోమా చటర్జీ. డీజేయింగ్ మొదలెట్టాక... డీజే పరోమాగా ఈ ప్రపంచానికి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. దానికి ముందు నాలుగు నెలలు డీజేయింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఆ తరువాత ఏడాదిపాటు ఎన్నో కష్టాలు... సవాళ్లు. నా గురించి ఎవరికీ తెలియదు. అలాంటప్పుడు అవకాశాలు ఎలా వస్తాయి? ఎంతో ప్రయత్నిస్తే ఒకటి రెండు ఈవెంట్లు దొరికేవి. అయినా నిరాశపడలేదు. ఎందుకంటే నా సామర్థ్యంపై నాకు నమ్మకం. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేశాను.

ఐపీఎల్‌తో మొదలు...

నాకు బాగా పేరు తెచ్చింది 2014 ఐపీఎల్. దానికి అధికారిక డీజేగా వ్యవహరించాను. అతిథులతో కలిసి నెలన్నర పాటు కెమెరా ముందు కనిపించాను. దాని ద్వారా టెలివిజన్‌లో క్రికెట్ చూసే కోట్ల మందికి నా పేరు తెలిసింది. ఇది నా కెరీర్‌ను అనూహ్య మలుపు తిప్పింది. దీనికి ముందు 'సారేగమా' రెండు సీజన్లకు జ్యూరీగా వ్యవహరించాను. ఒక రకంగా ఈ షోలు నన్ను స్టార్‌ను చేశాయి. విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ తెచ్చిపెట్టాయి. డీజేయింగ్ అంటే సీడీజే (కంపాక్ట్ డిస్క్ జాకీ) సాయంతో విభిన్న సంగీతాన్ని మిక్స్ చేసే కళ. తద్వారా ప్రేక్షకులకు సరికొత్త సంగీతానుభూతిని కల్పించడం, ఉత్తేజితులను చేయడం డీజేల పని. దీని కోసం వివిధ పద్ధతులు, సాధనాలు, సాంకేతికతను ఉపయోగిస్తుంటాం. అందులో నాకంటూ ఒక ప్రత్యేకత సంపాదించుకున్నాను. దీనికి శాస్త్రీయ సంగీతం రావాల్సిన అవసరం లేదు. కానీ నేర్చుకొంటే కెరీర్‌కు ఉపయోగపడుతుంది. ఆ ఉద్దేశంతోనే రెండేళ్లు పియానో నేర్చుకున్నా. మొదట్లో పాటలు కూడా పాడేదాన్ని. కొన్ని సింగిల్ వీడియోలు కూడా విడుదల చేశాను. వాటిని యూట్యూబ్‌లో పెడితే లక్షల్లో వ్యూస్ వచ్చాయి.

అడుగడుగునా సవాళ్లు...

డీజే అనగానే ఇప్పటికీ కళ్లల్లో మెదిలేది మగవారే. వారిని దాటి అవకాశం దక్కించుకోవడమే పెద్ద విషయం. ఆ తరువాత మన ప్రతిభతో ఆకట్టుకోవాలి. నేను ఈ ప్రయాణం ప్రారంభించినప్పుడు మహిళా డీజేలు ఒకరో ఇద్దరో.. అంతే! సాధారణంగా డీజే అంటే క్లబ్‌లోనో, పబ్‌ల్లోనో ఉంటాయి. అదీ రాత్రివేళల్లో. అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొత్త మనుషులు, కొత్త ప్రాంతం. అలాంటిచోట, అంతమంది ముందు ఒక యువతి ప్రదర్శన ఇవ్వడమంటే అడుగడుగునా ఎన్నో సవాళ్లు, సమస్యలు. ఇవన్నీ అధిగమించి, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అక్కడున్నవారిని మెప్పించాలి. మనకంటూ ఒక ప్రత్యేకత ఉండాలి. అప్పుడే ఇక్కడ నిలబడగలుగుతాం. ఇన్నేళ్లల్లో నేను సాధించిందేంటంటే.. నమ్మకం... నా మీద, నా సామర్థ్యం మీద. అందుకే ఒక్కసారి ఒక ఈవెంట్‌కు వెళితే... మళ్లీ మళ్లీ నన్ను కావాలని కోరుకొంటారు.

లక్ష్యాలంటూ లేవు...

భవిష్యత్ ప్రణాళికలు, లక్ష్యాలంటూ నాకు ఉండవు. ఇవాళ ఏముందో దాని గురించే ఆలోచిస్తాను. అవకాశం వచ్చినప్పుడు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. నన్ను చూసినవాళ్లు చాలామంది అడుగుతుంటారు... 'ఫ్యాషన్ ట్రెండ్స్‌ను అనుసరిస్తారా' అని! నేను కాస్త భిన్నం. పదిహేనేళ్ల కిందట కొన్న డ్రెస్‌లు ఇంకా నా అలమరాలో ఉన్నాయి. ఇప్పటికీ వాటిని వాడుతుంటాను. స్టయిల్ అనేది మన లోపలి నుంచి రావాలి. మనం వేసే డ్రెస్సులవల్ల కాదనేది నా అభిప్రాయం.



ఆరంభంలో ఎన్నో...

డీజేగా తొలి రోజుల్లో నాకు చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. నైట్ క్లబ్‌లోకో, పబ్‌లోకో వెళ్లినప్పుడు అక్కడి వాతావరణం ఎలా ఉంటుందనేది అస్సలు తెలియదు. ఈ ప్రాంతాల్లో మద్యం సేవించడం సాధారణం. మహిళ అనగానే కొందరు వింతగా ప్రవర్తించేవారు. పిచ్చి చూపులు చూసేవారు. ప్రతిచోటా ఇలాంటివి ఎదురవుతూనే ఉంటాయి. అయితే మనం మన పని మీద మాత్రమే శ్రద్ధ పెడితే చాలా సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. మన ప్రవర్తన ఎలావుందనేది కూడా ఎంతో ముఖ్యం. డీజేగా అనుభవం గడించేకొద్దీ ఒక్కొక్కటీ అర్థం చేసుకొంటూ ముందుకు సాగుతున్నాను. ఇప్పుడు ఎలాంటి పరిస్థితిల్లోనైనా నెట్టుకురాగలననే నమ్మకం నాకుంది. ఒకవేళ పరిస్థితి మరీ శ్రుతిమించితే... ఎలాగూ బౌన్సర్లు ఉంటారు. ఈ రంగంలో రాణించాలనేకొనే యువతులకు ప్రధానంగా కావల్సింది... కుటుంబ సహకారం, మద్దతు. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. డీజే అవుతానని చెప్పినప్పుడు మొదట్లో అమ్మానాన్న భయపడ్డారు. కానీ ఇప్పుడు వారు నన్ను చూసి గర్వపడుతున్నారు.

ఇక్కడ అదే ముఖ్యం...

ఇతర డీజేలతో పోల్చినప్పుడు నా ప్రత్యేకత ఏంటని అడుగుతుంటారు. నిజం చెప్పాలంటే అందరిలా నేనూ. వాళ్లు ప్లే చేసిన పాటలే నేనూ ప్లే చేస్తాను. అయితే అక్కడున్నవారితో మన సంగీతంతో మనం ఎంతలా మమేకం అయ్యామన్నది ఇక్కడ ముఖ్యం. అలాగే వేదిక మీద మనం కనిపించే తీరు కూడా.

దేశవిదేశాల్లో ప్రదర్శనలు...

ఈ పద్నాలుగేళ్ల కెరీర్‌లో దేశవిదేశాల్లో కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చివుంటాను. భారత్‌లోని మహానగరాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్, సింగపూర్, భూటాన్, నేపాల్ తదితర దేశాల్లో ఎన్నో షోలు ఇచ్చాను. డీజే అంటే క్లబ్‌లు, పబ్‌లకే పరిమితం కాదు. కాలేజీ వార్షికోత్సవాలు, పండుగలు, ఉత్సవాల వంటి ఇతర ఈవెంట్లకు కూడా పిలుస్తుంటారు. ఇవాళ ఢిల్లీలో ఉంటే... రేపు హైదరాబాద్‌లో... ఇలా ప్రస్తుతం వారానికి నాలుగైదు ఈవెంట్లు చేస్తున్నాను. రీమిక్స్‌లతో వీడియో ఆల్బమ్స్ కూడా చాలా ఉన్నాయి. ఒక మహిళగా ఒకరిపై ఆధారపడకుండా ఇంతవరకు రాగలిగినందుకు గర్వపడుతున్నాను. నన్ను చూసి చాలామంది అమ్మాయిలు డీజేయింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నారు. ఇది నేను సాధించిన పెద్ద విజయంగా భావిస్తున్నాను."

● హనుమా

ఊరించే ఉల్లికాడలు

మనం ఇష్టంగా తినే ఉల్లికాడల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఎ, బి, సి విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం, క్రోమియం, పాస్ఫరస్, మాంగనీస్, కాపర్ లాంటి మూలకాలు పుష్కలంగా ఉంటాయి. ఫ్రైడ్ రైస్, నూడుల్స్ వంటి ప్రత్యేక వంటకాలకు రుచిని అందించడంతోపాటు మన ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడడంలో ఉల్లికాడల పాత్ర కీలకమనే చెప్పాలి.

రక్తపోటుకి

ఉల్లికాడల్లో కేమోఫెరాల్ అనే ఫ్లేవనాయిడ్ ఉంటుంది. ఇది రక్తనాళాల్లో ఒత్తిడిని తగ్గిస్తుంది. కొవ్వు సంబంధిత అడ్డంకులను తొలగించి రక్త ప్రసరణ సాఫీగా జరిగేలా చూస్తుంది. ఉల్లికాడలను తరచూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తపోటుకి దూరంగా ఉండవచ్చు.

గుండెకి

ఉల్లికాడల్లో ప్రత్యేకమైన పీచు పదార్థాలు, ఫోలేట్స్ అధికంగా ఉంటాయి. ఇవి గుండె కొట్టుకునే వేగాన్ని నియంత్రిస్తాయి. గుండెకు నిత్యం రక్తం సరఫరా అయ్యేలా చూస్తాయి. గుండె పోటు, గుండెలో మంట తదితర సమస్యలను నివారిస్తాయి. వీటిలో కొవ్వులు, క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. తరచూ ఉల్లికాడలను చిన్న ముక్కలుగా కోసుకుని సలాడ్లలో కలుపుకుని తింటే శరీరానికి అవసరమైన సిలీనియాన్ని సమకూరుస్తాయి.

జీర్ణాశయానికి

ఉల్లికాడలు కడుపులోని ఆహారాన్ని వేగంగా జీర్ణం చేస్తాయి. ఉల్లికాడలను తరచూ తింటూ ఉంటే అజీర్తి,



మలబద్ధకం రావు. ఇవి కడుపులో ఆమ్ల తత్వాన్ని నివారిస్తాయి. ఉల్లికాడల్లోని పెక్టిన్ అనే పదార్థం పేగుల్లోని సున్నితమైన పొరలను రక్షిస్తుంది.

శరీర బరువుకి

ఉల్లికాడలను తిన్నపుడు వాటిలో ఉండే పీచుపదార్థం, ఇతర పోషకాలు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. ఇవి జీర్ణమవడానికి కూడా సమయం పడుతుంది. దీనితో ఎక్కువగా ఆహారాన్ని తినాలనిపించదు. వీటిలో అత్యల్ప కేలరీలు ఉన్న కారణంగా జీవక్రియల వేగం పెరిగి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

జలుబుకి

చలికాలంలో ఉల్లికాడలతో సూప్ తయారు చేసుకుని తాగితే జలుబు, దగ్గు, కఫ సమస్యలు తగ్గిపోతాయి. వీటిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు వాతావరణ మార్పుల కారణంగా వచ్చే అంటువ్యాధులను నిరోధిస్తాయి. ఉల్లికాడల్లో ఉండే హిస్టమైన్ కీళ్ల నొప్పులను నివారిస్తుంది.

ఎలా తినాలంటే

ఉల్లికాడలను చిన్న ముక్కలుగా కోసి ఇతర వంటకాలతో లేదా సూప్స్‌లో కలిపి తీసుకోవచ్చు. పెనం మీద ఆమ్లెట్ వేసిన వెంటనే దానిపై కొన్ని ఉల్లికాడల ముక్కలను పరిస్తే ఆమ్లెట్ రుచి పెరుగుతుంది. ఒక కప్పు పెరుగులో చిటికెడు ఉప్పు, చిటికెడు మిరియాలపొడి, కొన్ని ఉల్లికాడల ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపితే మంచి రైతా సిద్ధమవుతుంది.

చిత్రజ్యోతి

SINCE 1965


వాళ్లకు అనుకూలంగా మార్చుకునే ప్లాన్

\- విజయశాంతి



సినిమా పరిశ్రమను నాశనం చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారంటూ బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు ఆరోపణలు చేయడం గర్హనీయమని సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి అన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనతో తెలంగాణ ప్రభుత్వం, చిత్ర పరిశ్రమ మధ్య దూరం పెరుగుతుందనే వాదన వినిపిస్తున్న నేపథ్యంలో విజయశాంతి స్పందించారు. 'సినిమా విడుదల సందర్భంగా జరిగిన ఈ సంఘటన దురదృష్టకరం. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో విభజన రేఖలు తెచ్చే వరకూ వెళ్తున్నట్లు ఇటీవల పరిణామాలు, ప్రెస్ మీట్లను బట్టి తెలుస్తోంది. ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ పార్టీకి చెందిన తెలుగు రాష్ట్రాల నేతల ప్రకటనలు ఉన్నాయి. సినీ పరిశ్రమకు అన్ని ప్రాంతాల ప్రజల ఆదరణ అవసరం. ఇలాంటి ఘటనలు జరగకుండా సినిమా పరిశ్రమ కూడా పరిశీలన చేయాలి...పరిష్కరించుకునే ప్రయత్నం జరగాలి' అని ఆమె అన్నారు.

శక్తిమంతమైన పాత్రలో...



కన్నడ హీరో కిచ్చా సుదీప్ నటించిన చిత్రం 'మ్యాక్స్'. సునీల్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించారు. విజయ్ కార్తికేయ దర్శకత్వంలో కలైపులి ఎస్.థాను నిర్మించారు. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌లోని యాక్షన్, డైలాగులు, విజువల్స్ ఆకట్టుకున్నాయి. కిచ్చా సుదీప్ శక్తిమంతమైన పాత్రలో అదరగొట్టారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతోంది. ఈ చిత్రానికి ఎడిటింగ్: ఎస్.ఆర్.గణేశ్‌బాబు, సినిమాటోగ్రఫీ: శేఖర్‌చంద్ర, సంగీతం: అజనీశ్ లోక్‌నాథ్.

కేడీ శివతాండవం



ధృవ సర్జా హీరోగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం కేడీ ద డెవిల్. తాజాగా ఈ సినిమా నుంచి కన్నడ నేల ఆచార, సంస్కృతులు, భారతీయ జానపద గేయాల్లోని అందాన్ని చూపించేలా 'శివ శివ' అనే పాటను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటను హిందీలో అజయ్ దేవగణ్, తమిళంలో లోకేశ్ కనగరాజ్, తెలుగులో హరీష్ శంకర్ రిలీజ్ చేస్తూ చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. కన్నడలో ఈ పాటను ప్రేమ్, కైలాశ్ కేర్, తెలుగు, తమిళంలో విజయ్ ప్రకాశ్, మలయాళంలో ప్రణవం శశి, హిందీలో కైలాశ్ కేర్, సలీమా ఆలపించారు.

శివరాత్రికి ఎర్రచీర



ఆధ్యాత్మిక కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రం 'ఎర్రచీర- ది బిగినింగ్'. సుమన్ బాబు ప్రధాన పాత్ర పోషిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. ఎన్‌వీవీ సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మిస్తున్నారు. తొలుత ప్రకటించినట్లు ఈనెల 27న ఈ చిత్రం విడుదలవడం లేదు. మేకర్స్ మంగళవారం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. శివరాత్రి సందర్భంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 20న 'ఎర్రచీర' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. శ్రీరామ్, కమల్ కామరాజు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్.

యువతను మెప్పించే చిత్రం



అనిల్ అర్కా, విహారికా చౌదరి జంటగా తెరకెక్కిన చిత్రం 'వారధి'. శ్రీకృష్ణ దర్శకత్వంలో పెయ్యాల భారతి, ఎమ్.డి.యూనస్ నిర్మించారు. ఈనెల 27న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు శ్రీకృష్ణ మాట్లాడుతూ "ఇది భావోద్వేగాలతో నిండిన సినిమా. చాలా సహజంగా ఉంటుంది. యూత్‌ను ఆకర్షించే రొమాంటిక్ థ్రిల్లర్ ఇది" అని చెప్పారు. "భార్యభర్తల మధ్య ఉన్న బంధాన్ని అందంగా ఆవిష్కరించే చిత్రమిది" అని హీరో అర్కా అన్నారు.

కృష్ణ నటించిన చివరి సినిమా



'టాలీవుడ్ సూపర్ స్టార్ కృష్ణ మనమధ్య లేకపోయినా ప్రేక్షక హృదయాల్లో ఆయన స్థానం శాశ్వతం. ఆయన నటించిన ఒక సినిమా విడుదల కాని చిత్రాల జాబితాలో ఉండకూడదు అనే పట్టుదలతో 'ప్రేమచరిత్ర-కృష్ణ విజయం' సినిమాను విడుదల చేస్తున్నాం. ఈ చిత్రం కృష్ణ నటించిన చివరి సినిమాగా చరిత్రలో నిలిచిపోతుంది' అని దర్శక నిర్మాత మధుసూదన్ అన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రంలో నాగబాబు, అలీ ముఖ్యపాత్రలు పోషించారు. చిత్రబృందం మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విడుదల తేదీని ప్రకటించింది. జనవరి 3న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం శ్రీలేఖ.

కంటెంట్‌కే ప్రాధాన్యం

వీడ్కోలు 2024

ఈ ఏడాది టాలీవుడ్‌లో డజను చిత్రాలకు పైగా స్టార్ కాస్టింగ్ ఉన్న డబ్బింగ్ సినిమాలు విడుదలయ్యాయి. టాప్ హీరోలు నటించిన చిత్రాలు కమర్షియల్‌గా ఫెయిలయ్యాయి. కేవలం కంటెంట్ ఉన్న సినిమాలు మాత్రమే ప్రేక్షకాదరణ పొందాయి. రజనీకాంత్ 'లాల్ సలామ్' ఫ్లాప్ కాగా, వెట్టయాన్ యావరేజ్‌గా, విజయ్ 'ద గోట్ ఎబో యావరేజ్‌గా నిలిచాయి. సూర్య 'కంగువ', విక్రమ్ 'తంగలాన్' పరాజయం పాలయ్యాయి.




మహారాజ: విజయ్ సేతుపతి నటించిన 50వ సినిమా ఇది. బాక్సాఫీసు వద్ద ఘన విజయాన్ని దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా రన్ అవుతోంది. చైనాలో విడుదలై బాహుబలి-2 రికార్డులను బ్రేక్ చేస్తోంది. ఇదొక భిన్నమైన యాక్షన్ థ్రిల్లర్. కథ ఓ రొటీన్ రివేంజ్ యాక్షన్ డ్రామాగా కనిపిస్తుంది. కానీ, అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. విజయ్ సేతుపతి విలక్షణమైన నటన ఈ చిత్రానికి హైలెట్.

అమరన్: ఉగ్రవాదులతో పోరాడి వీరమరణం పొందిన ఇండియన్ ఆర్మీ ఆఫీసర్ ముకుంద్ వరదరాజన్ బయోపిక్ ఇది. లీడ్ రోల్‌లో శివకార్తికేయన్, కథానాయికగా సాయిపల్లవి నటించారు. ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా భారీ కలెక్షన్లతో కేవలం మూడు రోజుల్లోనే 100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ యాక్షన్ మూవీకి అన్ని చోట్లా విమర్శకుల నుంచి సానుకూల సమీక్షలు లభించాయి.




సత్యం సుందరం: కార్తీ, అరవింద స్వామి ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ డబ్బింగ్ చిత్రంలా కాకుండా స్ట్రెయిట్ చిత్రంలా చూపించడంలో చిత్రబృందం విజయం సాధించింది. దాంతో తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యింది. కథలోని బలాన్ని నమ్మి నటించిన కార్తీ, అరవింద స్వామి ఆ మేరకు విజయవంతమయ్యారనే చెప్పొచ్చు. కథతో ఆద్యంతం కట్టిపడేసేలా తెరకెక్కిన ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులు ఆదరించారు.



లాల్ సలామ్: గతేడాది జైలర్ చిత్రంతో హిట్ కొట్టిన రజనీకాంత్ ఈ ఏడాది తన కూతురు ఐశ్వర్య దర్శకత్వంలో మోహిద్దీన్ అనే కీలక పాత్రలో నటించారు. కోలీవుడ్‌లో పరవాలేదనిపించినా...తెలుగు ప్రేక్షకులు మాత్రం అస్సలు పట్టించుకోలేదు. స్పోర్ట్స్ డ్రామాగా వచ్చిన ఈ మూవీ తొలి రోజే చాలా చోట్ల మార్నింగ్ షోలు రద్దు చేశారు.

వెట్టయాన్: జై భీం సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కింది. రజనీకాంత్‌ను ఇందులో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా చూపించారు. మాస్ ఆడియన్స్‌ని ఆకర్షించడానికి దర్శకుడు ప్రయత్నించినప్పటికీ, సాధారణ ప్రేక్షకులను అలరించే థ్రిల్లింగ్ మూమెంట్స్ లేకపోవడంతో ఓ యావరేజ్ సినిమాగా నిలిచింది.

ద గోట్: తండ్రీ కొడుకులుగా విజయ్ ద్విపాత్రాభినయం చిత్రానికే హైలెట్‌గా నిలిచింది. హీరోగా, విలన్‌గా నటించి తన అభిమానులను మెప్పించారు విజయ్. వెంకట్ ప్రభు దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీ... కథలో కొత్తదనం లేకపోవడంతో తెలుగు ప్రేక్షకులు అంతగా ఆదరించలేదు. దీంతో బాక్సాఫీసు వద్ద యావరేజ్‌గా నిలిచింది.



కంగువ: సూర్య నటించిన పీరియడ్ యాక్షన్-ఫాంటసీ డ్రామా ఇది. భారీ బడ్జెట్‌తో నిర్మించారు. అంతే స్థాయిలో చిత్రబృందం దేశవ్యాప్తంగా చిత్ర ప్రమోషన్లు నిర్వహించింది. ద్విపాత్రాభినయంలో సూర్య అద్భుతంగా నటించినప్పటికీ ప్రేక్షకాదరణ పొందలేకపోయింది. కేవలం సూర్య అభిమానులను మాత్రమే మెప్పించగలిగింది.

తంగలాన్: విక్రమ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ మూవీ బంగారు గనుల నేపథ్యంలో వలసవాద శక్తులకు వ్యతిరేకంగా గిరిజన సంఘం చేసే పోరాటాలకు సంబంధించింది. 'తంగలాన్' ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. దర్శకుడు కథను ఓ విజువల్ వండర్‌లా తెరపై చూపేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు.



కంటెంట్ కొత్తగా ఉంది

- దర్శకుడు బాబీ కొల్లి



వెన్నెల కిశోర్, రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. నేడు విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాబీ కొల్లి మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ చాలా కొత్తగా ఉంది. డైరెక్టర్ మోహన్ సస్పెన్స్‌ని బాగా హ్యాండిల్ చేయగలడని ట్రైలర్‌తోనే అర్థమైంది. ఈ సినిమా కచ్చితంగా ఘన విజయం సాధిస్తుంది" అని చెప్పారు. మోహన్ మాట్లాడుతూ "ఈ సినిమాకి పనిచేసిన అందరూ తమ బెస్ట్ ఇచ్చారు. తప్పకుండా అందరికీ నచ్చే చిత్రమిది" అని చెప్పారు. "దర్శకుడు ఈ సినిమా కథ చెప్పగానే నచ్చింది. కచ్చితంగా సినిమాతో హిట్ కొడుతున్నాం" అని అన్నారు.

వాణిజ్యాంశాలతో పాటు మంచి సందేశం



ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు లహరిధర్, బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్ నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా హీరో ధర్మ మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథ వినగానే నచ్చేసింది. ఒక వ్యక్తి జీవితంలో జరిగిన ఆసక్తికరమైన ప్రయాణం ఈ సినిమా. వాస్తవ సంఘటనలకు కాల్పనికతను జోడించి తెరకెక్కించిన ఈ చిత్రం అందరినీ అలరిస్తుంది. దర్శకుడు సినిమాని అద్భుతంగా తీశారు. ఐశ్వర్య శర్మ భాగీ పాత్రలో అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ సినిమాలో నాది డ్రింకర్ పాత్ర. నిజానికి నాకు తాగుడు అలవాటు లేదు. ఈ పాత్ర కోసం చాలా హోంవర్క్ చేశా. యూత్‌ను ఆకట్టుకునే ఈ సినిమాలో వాణిజ్యాంశాలతో పాటు మంచి సందేశమూ ఉంటుంది" అని చెప్పారు.

ప్రతీకారంతో సాగే కథ



గౌరవ్, గోపాలరావు, నందినీ కపూర్, జబర్దస్త్ వినోదిని, రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం 'బ్లడ్'. అవధూత గోపాల్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శక నిర్మాత అవధూత గోపాల్ మాట్లాడుతూ "ట్రెండ్‌కు తగ్గట్టు తెరకెక్కించిన సినిమా ఇది. హత్యకు గురైన ఓ యువతి దెయ్యంగా మారి తనకు అన్యాయం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకోవడమే ఈ సినిమా కథ" అని చెప్పారు. "ఈ సినిమాలో అందరికీ గుర్తుండిపోయే పాత్ర చేశాను" అని హీరో గౌరవ్ చెప్పారు.









విరాట్.. ఈసారైనా?

బాక్సింగ్‌డే టెస్టు రేపటి నుంచి
ఉ.5 గం. నుంచి ప్రత్యక్ష ప్రసారం



మెల్‌బోర్న్: విరాట్ కోహ్లీ ఎలా అవుటవుతాడు? అని ఎవరిని అడిగినా.. ఆఫ్ స్టంప్‌నకు ఆవలిగా వెళ్తున్న బంతిని వేటాడి మరీ వికెట్ సమర్పించుకుంటాడని చెబుతుంటారు. అతడి ఈ బలహీనత ఈనాటిది కాదు. చాలా ఏళ్లుగా చూస్తున్నదే. తాజాగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలోనూ ఇదే రీతిన పెవిలియన్‌కు చేరుతూ అభిమానులను నిరుత్సాహపరుస్తున్నాడు. 25 ఇన్నింగ్స్‌ల తర్వాత పెర్త్ టెస్టులో ఓ శతకం బాది మురిపించినా.. ఆ తర్వాత 7, 11, 3 స్కోర్లతో విఫలమయ్యాడు. విరాట్ అవుటవుతున్న తీరుపై కెప్టెన్ రోహిత్‌ను మంగళవారం విలేకరులు అడగ్గా.. అతడు తన సహచరుడికి గట్టి మద్దతే ఇచ్చాడు. ప్రపంచ అత్యుత్తమ క్రికెటర్‌కు తన బలహీనతను ఎలా అధిగమించాలో కూడా తెలుసని తేల్చాడు. అదే సమయాన విరాట్ మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఆఫ్ స్టంప్‌నకు ఆవలిగా వెళుతున్న బంతులను వదిలేస్తూ, నేరుగా వచ్చే బాల్స్‌ను ఆడడంపై ఎక్కువగా దృష్టి సారించాడు. ప్రసిద్ధ్ పదేపదే ఐదో స్టంప్‌పై వేసిన లెంగ్త్ బంతులను కోహ్లీ అసలు పట్టించుకోలేదు. ఇలా ఈసారి తన బలహీనతను వంద శాతం అధిగమించేందుకు విరాట్ పట్టుదల చూపాడు. తన బ్యాటింగ్‌లో లోపాన్ని సరిచేసుకునేందుకు యుద్ధం చేస్తున్న ఈ స్టార్ బ్యాటర్ రాబోయే రెండు టెస్టుల్లో ఆసీస్ బౌలర్ల భరతం పట్టాలని కోరుకుంటున్నారు. గతంలో సచిన్‌కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైనప్పుడు పట్టుదలతో ఆడి సమస్యను విజయవంతంగా అధిగమించాడు. ఎంసీజీ పిచ్ బ్యాటింగ్‌కు కూడా సహకరించే అవకాశం ఉండడంతో విరాట్ ఓపిగ్గా క్రీజులో నిలిచి పరుగుల వరద పారించాలని ఆశిద్దాం.



హర్లీన్ డియోల్ (115)

టాప్‌షోతో సిరీస్

హర్లీన్ శతకం
భారత్ రికార్డు స్కోరు
మాథ్యూస్ సెంచరీ వృథా
రెండో వన్డేలో విండీస్ చిత్తు

వడోదర: భారత మహిళల జట్టు భీకర ఫామ్‌ను కొనసాగిస్తోంది. వెస్టిండీస్‌తో మంగళవారం జరిగిన రెండో వన్డేలోనూ టాపార్డర్ బ్యాటర్లు కదం తొక్కడంతో వన్డేల్లో తమ అత్యధిక స్కోరును సమం చేసింది. హర్లీన్ డియోల్ (115) కెరీర్‌లో తొలి శతకం బాదగా, ఓపెనర్లు ప్రతీక రావల్ (76), స్మృతి మంధాన (53), జెమీమా (52) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో భారత్ 115 పరుగుల తేడాతో నెగ్గి మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను 2-0తో దక్కించుకున్నట్టయ్యింది. ముందుగా భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 358 పరుగులు చేసింది. గతంలో ఐర్లాండ్‌పై కూడా ఇన్నే పరుగులు సాధించి రికార్డు నెలకొల్పింది. ఈ ఫార్మాట్‌లో మహిళల జట్టు 350+ స్కోర్లు చేయడం ఇది రెండోసారి. అద్భుత ఫామ్‌లో ఉన్న మంధాన.. ప్రతీకతో కలిసి తొలి వికెట్‌కు 110 పరుగులు జత చేసింది. ఆ తర్వాత హర్లీన్ సెంచరీతో ఎదురుదాడికి దిగడంతో పాటు జెమీమాతో కలిసి నాలుగో వికెట్‌కు 116 పరుగులు జత చేయడం విశేషం. భారీ ఛేదనలో విండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ (106) సైతం శతకంతో పోరాడినా.. 46.2 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. ప్రియాకు మూడు.. ప్రతీక, దీప్తి, టిటాస్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

సంక్షిప్త స్కోర్లు
భారత్: 50 ఓవర్లలో 358/5 (హర్లీన్ 115, ప్రతీక 76, మంధాన 53, జెమీమా 52; జోసెఫ్ 1/27).
వెస్టిండీస్: 46.2 ఓవర్లలో 243 ఆలౌట్ (మాథ్యూస్ 106, క్యాంప్‌బెల్ 38; ప్రియా మిశ్రా 3/49, ప్రతీక 2/37).

షెడ్యూల్ వచ్చేసింది

ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ
23న భారత్-పాక్ మ్యాచ్

దుబాయ్: వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ జరుగనుంది. ఎనిమిదేళ్ల తర్వాత జరుగబోతున్న సీటీలో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. వీటిని రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఎలో భారత్, పాక్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఉండగా.. గ్రూప్-బిలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, అఫ్ఘానిస్థాన్ ఉన్నాయి. ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య పాక్ జట్టు కివీస్‌తో తలపడనుంది. ఇక అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే భారత్-పాక్ పోరు ఫిబ్రవరి 23న దుబాయ్‌లో అలరించనుంది. భద్రతా కారణాల రీత్యా భారత జట్టు పాక్‌లో పర్యటించేందుకు ఇష్టపడకపోవడంతో ఈ టోర్నీ హైబ్రిడ్ పద్ధతిన సాగనున్న విషయం తెలిసిందే. ఈమేరకు భారత్ ఆడే గ్రూప్ మ్యాచ్‌లను దుబాయ్‌లో నిర్వహిస్తారు. షెడ్యూల్ ప్రకారం పాక్‌లో జరిగే మ్యాచ్‌లకు లాహోర్, కరాచీ, రావల్పిండి వేదికలు కానున్నాయి. సెమీఫైనల్స్ దుబాయ్, లాహోర్‌లో జరుగుతాయి. ఒకవేళ భారత్ సెమీస్, ఫైనల్‌కు వస్తే ఆ మ్యాచ్‌లను దుబాయ్‌లోనే నిర్వహిస్తారు. మరోవైపు రెండు సెమీస్, ఫైనల్‌కు రిజర్వ్‌డేలు ఉంటాయి. మొత్తం 15 మ్యాచ్‌లూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనే జరుగుతాయి.

భారత్ షెడ్యూల్

ఫిబ్రవరి 20	భారత్ x బంగ్లాదేశ్	దుబాయ్
ఫిబ్రవరి 23	భారత్ x పాక్	దుబాయ్
మార్చి 2	భారత్ x కివీస్	దుబాయ్

అండర్-19 ప్రపంచకప్‌కు

త్రిష, షబ్నమ్



త్రిష

న్యూఢిల్లీ: కౌలాలంపూర్‌లో వచ్చే నెల 18 నుంచి జరిగే అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో పోటీపడే భారత జట్టును మంగళవారం ప్రకటించారు. నిక్కీ ప్రసాద్ సారథ్యంలోని 15 మంది సభ్యుల ఈ జట్టులో తెలుగమ్మాయిలు గొంగడి త్రిష, మహ్మద్ షబ్నమ్, కేసరి ధృతి ఎంపికయ్యారు. భద్రాచలంకు చెందిన బ్యాటర్ త్రిష.. గతవారం అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు చాంపియన్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించింది. ఇక, విశాఖపట్నానికి చెందిన షబ్నమ్ ఇప్పటికే జూనియర్ స్థాయిలో వివిధ టోర్నీల్లో సత్తా చాటుకుంది. మొత్తం 16 జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి తలపడనున్న ఈ ప్రపంచకప్ ఫైనల్ ఫిబ్రవరి రెండున జరగనుంది. భారత్.. ఆతిథ్య మలేసియా, వెస్టిండీస్, శ్రీలంకతో కలిసి గ్రూప్-ఎ నుంచి బరిలోకి దిగుతోంది.

దరఖాస్తులో తప్పులు దొర్లాయేమో!

'ఖేల్‌రత్న' వివాదంపై మను భాకర్




న్యూఢిల్లీ: జాతీయ క్రీడా అవార్డుల సిఫారసుల్లో ఏస్ షూటర్ మను భాకర్ పేరు లేకపోవడం వివాదాస్పదమైంది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన మనును ఈసారి ప్రతిష్ఠాత్మక ఖేల్‌రత్న అవార్డుకు ఎంపిక చేస్తారని అందరూ భావించారు. కానీ, ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఆమె పేరు లేకపోవడం షాక్‌కు గురి చేసింది. క్రీడా వర్గాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నష్టనివారణ చర్యల్లో భాగంగా అవార్డుల తుది జాబితా ఖరారు కాలేదని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తగ్గించేందుకు మను స్వయంగా రంగంలోకి దిగినట్టుగా ఉంది. 'నా దరఖాస్తులోనే ఏమైనా లోపాలు ఉండి ఉండవచ్చు' అని అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టింది. తన అవార్డుకు సంబంధించిన ఊహాగానాలను పట్టించుకోవద్దని అందరికీ విజ్ఞప్తి చేసింది. కాగా, హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత ప్రవీణ్ కుమార్ పేర్లను ఖేల్‌రత్న అవార్డులకు ఎంపిక చేసినట్టు సమాచారం.

హెచ్‌సీఏ కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు

హైదరాబాద్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) కార్యాలయంపై మెరుపు దాడులు నిర్వహించారు. అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి క్యాటరింగ్, రవాణా కాంట్రాక్టులు ఇవ్వడంలో కొందరు హెచ్‌సీఏ అధికారులు అవినీతికి పాల్పడ్డారంటూ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఇటీవల విజిలెన్స్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో తాజాగా హెచ్‌సీఏ కార్యాలయంలో సోదాలు నిర్వహించిన విజిలెన్స్ అధికారులు.. టెండర్లకు చెందిన పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అవకతవకలకు సంబంధించి విచారణ చేస్తున్నారు.



రిసెప్షన్‌కు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



ఘనంగా సింధు వివాహ రిసెప్షన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, యువ వ్యాపారవేత్త వెంకట దత్తసాయి వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకకు క్రీడా, రాజకీయ, సినీ ప్రముఖులు తరలివచ్చారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే హరీశ్ రావు, సినీ స్టార్లు చిరంజీవి, నాగార్జున, అజిత్, టెన్నిస్ ఏస్ సానియా మీర్జా, చాముండేశ్వర్ నాథ్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో సింధు, వెంకట దత్తసాయిల వివాహం గత ఆదివారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన సంగతి తెలిసిందే.



చిరంజీవి

పాత కార్లపై జీఎస్టీ..

తరుగుదల అనంతర నికర విలువ కంటే అధిక ధరకు విక్రయిస్తేనే..



న్యూఢిల్లీ: పాత లేదా వాడిన కార్లను విక్రయించే సందర్భంలో ఆర్జించిన లాభంపైనే జీఎస్టీ వర్తిస్తుందని పన్ను నిపుణులు చెబుతున్నారు. అంటే, వాహన ధరలో తరుగుదల సర్దుబాటు అనంతర నికర విలువ కంటే అధిక మొత్తానికి విక్రయించగా ఆర్జించిన లాభంపై జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. పాత లేదా వాడిన వాహనాల (ఎలక్ట్రిక్ వెహికిల్స్ సహా) విక్రయాలపై ఇకపై ఏకరీతిగా 18 శాతం జీఎస్టీ విధించాలని గత శనివారం సమావేశమైన జీఎస్టీ మండలి నిర్ణయించింది. ఆదాయం పన్ను చట్టం 1961లో సెక్షన్ 32 కింద తరుగుదలను క్లెయిమ్ చేసుకున్న రిజిస్టర్డ్ వ్యక్తులు లేదా విక్రేతలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఒకవేళ ఒక వ్యక్తి మరో వ్యక్తికి పాత కారును విక్రయించిన సందర్భంలో మాత్రం జీఎస్టీ వర్తించదు. కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం..

- రిజిస్టర్డ్ వ్యక్తి లేదా విక్రేత ఎవరికైనా తన వాహనాన్ని రూ.15 లక్షలకు విక్రయించాడని అనుకుందాం. ఆ వాహనం అసలు ఖరీదు రూ.20 లక్షలు. కాగా, ఇప్పటికే కారుపై రూ.8 లక్షల తరుగుదలను క్లెయిమ్ చేశాడనుకుంటే, నికర విలువ రూ.12 లక్షలు అవుతుంది. ఈ సందర్భంలో వాహన విక్రయ ధర (రూ.15 లక్షలు), తరుగుదల అనంతరం నికర విలువ (రూ.12 లక్షలు) మధ్య వ్యత్యాసం రూ.3 లక్షలపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.
- రిజిస్టర్డ్ వ్యక్తి లేదా విక్రేత రూ.20 లక్షల కారుపై ఇప్పటికే రూ.8 లక్షల తరుగుదల క్లెయిమ్ చేసుకోగా రూ.12 లక్షల నికర విలువ చేసే కారును రూ.10 లక్షలకే విక్రయించాడనుకుంటే, ఈ సందర్భంలో నికర విలువ కంటే విక్రయ ధర తక్కువగా ఉంది కాబట్టి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

సినిమా థియేటర్లలో విక్రయించే పాప్‌కార్న్‌పై 5 శాతం పన్ను

సినిమా హాళ్లు లేదా ఇతర ప్రాంతాల్లో లూజుగా విక్రయించే పాప్‌కార్న్‌పై 5 శాతం జీఎస్టీ వర్తిస్తుందని ప్రభుత్వ వర్గాలు స్పష్టత నిచ్చాయి. ఒకవేళ పాప్‌కార్న్‌ను సినిమా టికెట్‌తో కలిపి విక్రయిస్తే, దాన్ని కాంపొజిట్ సప్లైగా పరిగణించి, అందుకు వర్తించే పన్ను రేటును వసూలు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. పాప్‌కార్న్‌పై వర్తించే పన్ను రేటుపై జీఎస్టీ మండలి గత సమావేశంలో స్పష్టత నిచ్చింది. ఉప్పు, మసాలా దినుసులు కలిసిన పాప్‌కార్న్‌ను ప్రస్తుతం నమ్‌కీన్‌గా పరిగణిస్తున్నారు. కాబట్టి ఈ పాప్‌కార్న్ లూజు విక్రయంపై 5 శాతం పన్ను వర్తిస్తుందని.. ప్రీ-ప్యాకేజ్డ్, లేబుల్‌తో విక్రయిస్తే మాత్రం 12 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని మండలి స్పష్టం చేసింది. చక్కెర కలిపిన (క్యారమెలైజ్డ్) పాప్‌కార్న్‌పైన 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.

కొత్త ఏడాది ఐటీలో నియామకాల జోరు

డేటా సైన్స్, ఏఐ నిపుణులదే హవా

- ద్వితీయ శ్రేణి నగరాల వైపు కంపెనీల చూపు
- 2024లో 7% తగ్గిన నియామకాలు



ఈ సంవత్సరం (2024) దేశీయ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగానికి చేదు అనుభవమే మిగిల్చింది. రాజకీయ, ఆర్థిక అనిశ్చితితో అమెరికా, యూరోపియన్ కంపెనీలు ఐటీ ఖర్చులు తగ్గించేశాయి. దాంతో ఈ దేశాల నుంచి భారత కంపెనీలకు వచ్చే ఐటీ ప్రాజెక్టులు తగ్గిపోయాయి. ఈ దెబ్బతో దేశీయ ఐటీ కంపెనీల్లో గత ఏడాది (2023)తో పోలిస్తే ఈ ఏడాది నియామకాల జోరు 7 శాతం తగ్గింది. ఇది కూడా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఆదుకోబట్టి మాత్రమే సాధ్యమైంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు జరిగిన ఐటీ కొలువుల నియామకాల్లో 52.6 శాతం వాటా జీసీసీలదే. కొత్త ప్రాజెక్టులు పెద్దగా రాకపోవడంతో ఐటీ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు భారీగా తగ్గించాయి. కొన్ని కంపెనీలైతే ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చిన ఆఫర్ లెటర్లనీ ఏదో ఒక పేరుతో వెనక్కి తీసుకున్నాయి. లేదా ఉలుకూ పలుకూ లేకుండా సస్పెన్స్‌లో పెట్టాయి. దీంతో ప్రముఖ ఐటీ కంపెనీలు కూడా 2023తో పోలిస్తే ఈ ఏడాది ఫ్రెషర్ల నియామకాలు రెండు నుంచి 15 శాతం మాత్రమే పెంచాయి.

కొందరికే డిమాండ్

ఈ సంవత్సరం ఐటీ రంగంలో నియామకాలు తగ్గినా కృత్రిమ మేథ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి డొమైన్స్‌లో పట్టున్న నిపుణులకు మాత్రం మంచి అవకాశాలే లభించాయి. ఈ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగుల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 2024లో 39% పెరిగాయి. ఈ డొమైన్స్‌లో పట్టున్న నిపుణులు దొరక్క చాలా ఐటీ కంపెనీలు ఉన్న ఉద్యోగులకే పెద్దఎత్తున శిక్షణ ఇస్తున్నాయి. ఇక మంచి అనుభవం ఉన్న మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగుల నియామకాలూ గత ఏడాదితో పోలిస్తే 35% పెరిగాయి.

మారిన కంపెనీల వైఖరి

ఐటీ కంపెనీల వైఖరిలోనూ మార్పు కనిపిస్తోంది. గతంలో ఈ కంపెనీలు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి మెట్రో నగరాలపైనే దృష్టి పెట్టేవి. ఇవే కంపెనీలు ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాలపైనా దృష్టి పెడుతున్నాయి. ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు స్థానికంగా నిపుణులైన ఉద్యోగులు పుష్కలంగా దొరకడమూ ఇందుకు కారణం. దీంతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో ద్వితీయ శ్రేణి నగరాల్లోని ఐటీ కంపెనీల నియామకాలు 48 శాతం పెరిగాయి.

ఆశలన్నీ 2025పైనే

భారత ఐటీ కంపెనీలకు 2025 సంవత్సరం మాత్రం ఆశావహంగానే కనిపిస్తోంది. అతిపెద్ద మార్కెట్ అయిన అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు ముగియడం, యూరోపియన్ ఆర్థిక వ్యవస్థలు గాడినపడటం ఇందుకు ప్రధాన కారణం. దీంతో వచ్చే జనవరి నుంచి పెద్ద కంపెనీలకు మళ్లీ ప్రాజెక్టుల రాక పెరుగుతుందని టీమ్ లీజ్ ఎడ్‌టెక్ సీఈఓ జైదీప్ కేవల్‌రమణి చెప్పారు. ఆ తర్వాత చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులూ పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఐటీ కంపెనీలు ఇప్పటికే డేటా సైన్స్, ఏఐ, ఎంఎల్ నిపుణుల కోసం అన్వేషణ ప్రారంభించాయి. వ్యాపార అవకాశాలను దొరక పుచ్చుకోవాలంటే ఏఐ వంటి అధునాతన టెక్నాలజీలను వేగంగా అందిపుచ్చుకోక తప్పదని విప్రో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ) సంధ్యా అరుణ్ చెప్పడం విశేషం. ఈ విషయంలో ఏ మాత్రం వెనకబడ్డా ఐటీ రంగంలో మనగలగడం కష్టమన్నారు. దీంతో ఈ అధునాతన టెక్నాలజీపై పట్టున్న నిపుణుల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 2025లో 30 నుంచి 35 శాతం వరకు పెరుగుతాయని మార్కెట్ వర్గాల అంచనా. ఐటీ పరిశ్రమ మొత్తంగా చూసినా 2025లో నియామకాలు 15 నుంచి 20 శాతం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల కారణంగా ఐటీ రంగంలో కొన్ని ఉద్యోగాలు మాయమయ్యే ప్రమాదమూ పొంచి ఉంది.

బిజినెస్

జనవరి 28న విచారణకు రండి

సెబీ చీఫ్‌కు లోక్‌పాల్ నోటీసు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్, ఆమె భర్తపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో వాంగ్మూలం ఇచ్చేందుకు జనవరి 28వ తేదీన తన ముందు హాజరు కావాలని లోక్‌పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆమెపై ఫిర్యాదు చేసిన టీఎంసీ ఎంపి మహువా మొయిత్రా సహా ఫిర్యాదుదారులందరూ కూడా అదే రోజు కోర్టుకు హాజరు కావాలంటూ లోక్‌పాల్ కార్యాలయం సమన్లు జారీ చేసింది. లోక్‌సభ సభ్యురాలైన మొయిత్రా, మరో ఇద్దరు దాఖలు చేసిన అవినీతి, ప్రయోజన వైరుధ్యం ఆరోపణలపై నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని నవంబరు 8వ తేదీన బుచ్‌కు లోక్‌పాల్ నోటీసు జారీ చేసింది. దానికి సమాధానంగా డిసెంబరు 7వ తేదీన ఆర్‌పీఎస్ (రెస్పాండెంట్ పబ్లిక్ సర్వెంట్) అఫిడవిట్ రూపంలో సమాధానం ఇచ్చినట్టు లోక్‌పాల్ తెలిపారు. తదుపరి చర్యగా నోటి మాట ద్వారా తమ వాదన వినిపించేందుకు ఆర్‌పీఎస్‌కు, ఫిర్యాదుదారులకు అవకాశం ఇవ్వాలని భావించినట్టు లోక్‌పాల్ చైర్‌పర్సన్ జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, ఐదుగురు సభ్యులు డిసెంబరు 19వ తేదీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగానే వాంగ్మూలం ఇచ్చేందుకు జనవరి 28న లోక్‌పాల్ ముందు హాజరు కావాలని తాజా ఉత్తర్వులు జారీ చేశారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	101
వరంగల్	98	గుంటూరు	104
కరీంనగర్	98	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	94
కర్నూలు	98	నెల్లూరు	94
విశాఖపట్నం	102	అనంతపురం	94
గోదావరి	101		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	585	విజయవాడ	600
వరంగల్	587	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,350 ▼	70,900 ▼	99,900 ▲
విజయవాడ	78,500 ▼	72,300 ▼	91,000 ▼
విశాఖపట్నం	76,360 ▼	70,000 ▼	88,940 ▼
రాజమండ్రి	77,350 ▼	70,900 ▼	89,700 ▼
ప్రొద్దుటూరు	78,500 ▼	72,690 ▼	90,030 ▼
ముంబై	75,874 ▼	69,501 ▼	87,511 ▲

ఇంట్రాడే లాభాలు ఆవిరి

సెన్సెక్స్ 67 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. ఇంట్రాడే లాభాలను చేజార్చుకున్న సూచీలు చివరికి స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 67.30 పాయింట్లు కోల్పోయి 78,472.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 25.80 పాయింట్లు తగ్గి 23,727.65 వద్దకు జారుకుంది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగిన నేపథ్యంలో మదుపరులు మెటల్, విద్యుత్ రంగ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగం నష్టపోయాయి.

రూపాయి మరింత పతనం: భారత కరెన్సీ సరికొత్త కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 4 పైసలు క్షీణించి రూ.85.15 వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల వడ్డన భయాల నేపథ్యంలో దిగుమతిదారుల నుంచి డాలర్‌కు గిరాకీ పెరగడంతో పాటు దేశీయ ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు కారణమయ్యాయి.

గ్రీవ్స్ ఎలక్ట్రిక్ భారీ ఐపీఓ: విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్ గ్రీవ్స్ కాటన్ సహా ఇతర వాటాదారులకు చెందిన 18.9 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. గ్రీవ్స్ ఎలక్ట్రిక్ 'ఆంపియర్' పేరుతో ఎలక్ట్రిక్ స్కూటర్లతో పాటు గ్రీవ్స్ బ్రాండ్‌నేమ్‌తో త్రిచక్ర వాహనాలను విక్రయిస్తోంది. ఈ కంపెనీ తెలంగాణలోని తూప్రాన్‌తో పాటు తమిళనాడులోని రాణిపేట్, ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ప్లాంట్లను కలిగి ఉంది.

నేడు మార్కెట్లకు సెలవు

క్రిస్మస్ సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు బుధవారం సెలవు ప్రకటించారు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. గురువారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

కార్యాలయ భవనాలకు భలే డిమాండ్

- హైదరాబాద్‌లో 56% అప్
- కోలియర్స్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీడీపీ వృద్ధి రేటు తగ్గినా దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో కార్యాలయ భవనాల లీజులు మాత్రం 2024లో భారీగా పెరిగాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు హైదరాబాద్‌తో సహా దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో రికార్డు స్థాయిలో 6.64 కోట్ల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) విస్తీర్ణం ఉన్న కార్యాలయాల భవనాల లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 14 శాతం ఎక్కువని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ కోలియర్స్ ఇండియా వెల్లడించింది. లీజు ఒప్పందాల పునరుద్ధరణ, కేవలం లెటర్ ఆఫ్ ఇంటెంట్ మాత్రమే ఇచ్చిన లీజు ఒప్పందాలను ఇందులో చేర్చలేదు. ఈ ఏడాది హైదరాబాద్‌లో 1.25 కోట్ల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజుకు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 56 శాతం ఎక్కువ. గత ఏడాది దేశంలో మరే నగరంలోనూ లీజుకు ఇచ్చిన ఆఫీసు స్పేస్ వృద్ధి రేటు ఇంత భారీగా పెరగలేదని కోలియర్స్ తెలిపింది. లీజుకు ఇచ్చిన ఆఫీస్ స్పేస్ విస్తీర్ణం పరంగా చూస్తే ఈ విషయంలో 2.17 కోట్ల ఎస్ఎఫ్‌టీతో బెంగళూరు ముందుంది. అయితే గత ఏడాదితో పోలిస్తే ఇది 39 శాతం మాత్రమే ఎక్కువ. ఇదే సమయంలో ముంబై, పుణెల్లోనూ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాల్లో వృద్ధి కనిపించింది.

ఫ్యూచర్ సిటీ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు రూ.2వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి పనులకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు రూ.2000 కోట్లు మంజూరు చేస్తూ పనుల ప్రారంభానికి పచ్చజెండా ఊపింది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను, రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)ను అనుసంధానం చేస్తూ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబరు 13 రావిర్యాల నుంచి రంగారెడ్డి జిల్లా అమన్‌గల్ మండలం ఆకుతోటపల్లి వరకు నిర్మించనున్న ఈ రహదారి ఫ్యూచర్ సిటీ నుంచి వెళ్లి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీని చేరుతుంది. రెండుదశల్లో నిర్మాణం కానున్న ఈ ప్రాజెక్టు పనుల్లో తొలిదశలో 20 కి.మీ కోసం రూ.2000 కోట్లు విడుదల చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. రేడియల్ రోడ్డు తొలిదశ కోసం ఆరు మండలాల్లోని 15 గ్రామాల్లో 916 ఎకరాలు సేకరించనున్నారు. మహేశ్వరం మండలంలో కొంగరకుర్దు, కందుకూరు మండలం లెమూరు, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్ఖాన్‌పేట్, ముచ్చెర్ల, కడ్తాల్ మండలంలో కడ్తాల్, ముద్విన్, అమన్‌గల్ మండలంలో అమన్‌గల్, ఆకుతోటపల్లి, యాచారం మండలంలో కుర్మిద్ది, ఇబ్రహీంపట్నం మండలం ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్ ఉన్నాయి. 916 ఎకరాల్లో 568 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరణ చేయాల్సి ఉంది. 156 ఎకరాలు తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ)కు సంబంధించినది. 169 ఎకరాలు అటవీ భూమి, ఇతరుల ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూమి 23 ఎకరాలైతే ఈ ప్రాంతంలో భూముల విలువ రూ.కోట్లలో ఉండటంతో ప్రత్యేక పట్టణ ప్రణాళిక పథకం అమలు చేయడానికి పురపాలక శాఖ సన్నద్ధమైంది. రహదారికి ఇరువైపులా కిలోమీటరు వరకు ఉన్న భూములకు హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ పథకాన్ని అమలు చేయనుంది. సుమారు 519 ఎకరాలు మిగిలే అవకాశం ఉందని అంచనా వేసిన అధికారులు.. రోడ్లు, పార్కులు, ఇతర మౌలిక వసతులకు కేటాయించగా మిగిలిన 354 ఎకరాల్లో 60 శాతం భూ యజమానుల వాటాగా, 40 శాతం హెచ్ఎండీఏ వాటాగా ప్రతిపాదించారు. భూసేకరణకు సంబంధించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రకటన కూడా జారీ చేశారు.

2 నమూనాలతో ప్రతిపాదనలు

41.5 కిలోమీటర్ల మేర నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు ఇరువైపులా సమీకరించే భూముల్లో లాజిస్టిక్ పార్కులు, పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటుచేయనున్న నేపథ్యంలో ఆ భూముల్లో లే అవుట్లు చిన్న చిన్న బిట్లుగా కాకుండా పెద్ద బిట్లు వచ్చేలా వేయనున్నారు. అంటే.. 200 గజాలు, 500 గజాలు ఇలా కాకుండా ఎకరం, రెండెకరాల నుంచి అవసరమైతే 10 ఎకరాల వరకు ఒకే బిట్ ఉండేలా అభివృద్ధి చేయనున్నారు. ఇంత పెద్ద బిట్లు వేస్తే ఒక ఎకరానికి రానున్న అభివృద్ధి చేసిన స్థలం కూడా పెరుగుతుంది. ఈ కారణంగానే ఒక ఎకరా.. లే అవుట్‌లో రోడ్లు, ఇతర సౌకర్యాల కోసం 31.51 శాతం భూమి మాత్రమే పోగా, ఏకంగా 68.49శాతం మేర భూమి అభివృద్ధి చెందిన ప్లాటుగా వస్తుందని అంచనా. ఇందుకు సంబంధించి ఇప్పటికే రెండు నమూనాలను కూడా సిద్ధం చేశారు. ఒక నమూనాలో కిలోమీటరు మేర, మరో నమూనాలో అర కిలోమీటరు మేర భూ సమీకరణ చేసి, వాటిలో లాజిస్టిక్ పార్కులు, పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటుచేస్తారు. ఈ రెండింటిలో ఏ విధానాన్ని అనుసరించినా సమీకరించిన భూములను ఎకరన్నర నుంచి పదెకరాల వరకు పెద్ద పెద్ద బిట్లుగా వచ్చేలా లే అవుట్‌ను అభివృద్ధి చేయనున్నారు. పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు పెద్ద పెద్ద కంపెనీలకు ఇచ్చేలా లే అవుట్ ఉండనుంది. ఆ భూముల్లో రోడ్ ఏరియా (లే అవుట్‌లో రోడ్డు నిర్మాణం), సోషల్ ఇన్‌ఫ్రా ఏరియా, సౌకర్యాలకు, పార్కింగ్ కోసం భూమిని విభజించనున్నారు. సమీకరించిన భూములను అభివృద్ధి చేసి రోడ్లు, పార్కులు, సోషల్ ఇన్‌ఫ్రా ఏరియా, తదితర సౌకర్యాలకు పోగా మిగిలిన భూమిలో 60 శాతం రైతులకు ఇవ్వనున్నారు. 40 శాతం ప్రభుత్వం వాటాగా ఉంటుంది. ఒక ఎకరంలో రోడ్ల నిర్మాణం, సోషల్ ఇన్‌ఫ్రా, సౌకర్యాలకు, పార్కింగ్ ఏరియాలకు కలిపి 31.51శాతం మేర భూమి పోగా, మిగిలిన 68.49శాతం మొత్తంలో 60శాతం మేర.. అంటే 41.09 శాతం రైతులకు, మిగిలిన 27.39 (40శాతం) శాతం హెచ్ఎండీఏకు వాటా ఉండనుంది. ఒకవేళ అర ఎకరంలో అయితే సౌకర్యాల నిర్మాణాలన్నింటికీ కలిపి 36.27శాతం భూమి పోగా, మిగిలిన మొత్తం 63.73 శాతం మొత్తంలో 60శాతం మేర అంటే 38.23శాతం రైతులకు, మిగిలిన 25.49 శాతం హెచ్ఎండీఏకు వాటా ఉంటుంది.

ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధుల్లోకి ట్రాన్స్‌జెండర్లు



హైదరాబాద్ సిటీ/సైదాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లు బాధ్యతలు చేపట్టారు. మంగళవారం హైదరాబాద్‌లోని పలు చౌరస్తాల వద్ద విధులు నిర్వహించారు. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో భానుప్రియ, నక్షత్ర, మలకపేటలో మానస, ప్రేమ ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఆంధ్రజ్యోతి పలకరించగా, మమ్మల్ని గుర్తించి ట్రాఫిక్ విభాగంలోకి తీసుకోవడం చాలా సంతోషం ఉందని, తమపై నమ్మకంతో అప్పగించిన ట్రాఫిక్ విధులను క్రమశిక్షణతో నిర్వర్తిస్తామని భానుప్రియ, నక్షత్ర చెప్పారు.

వాజ్‌పేయి అజాత శత్రువు

- నైతిక విలువలకు కట్టుబడి ప్రధాని పదవిని కూడా వదులుకున్న గొప్ప నేత
- ఆయన జీవితం భావితరాలకు డిక్షనరీ
- వాజ్‌పేయి శతజయంతి వేడుకల్లో కిషన్‌రెడ్డి
- వాజ్‌పేయి స్థితప్రజ్ఞుడు: విద్యాసాగర్‌రావు

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అటల్ బిహారీ వాజ్‌పేయి అజాత శత్రువని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఆయన జీవిత చరిత్ర భావితరాలకు ఒక డిక్షనరీ అని వ్యాఖ్యానించారు. ప్రధాని పదవిని సైతం తృణప్రాయంగా వదులుకుని నైతిక విలువలకు పట్టం గట్టిన గొప్ప నేత వాజ్‌పేయి అని కొనియాడారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం తాజ్ దక్కన్‌లో ఏబీవీ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 1999 ఏప్రిల్‌లో పార్లమెంటులో విశ్వాస పరీక్ష సందర్భంగా పార్టీ ఫిరాయించి వచ్చేందుకు ఎంతోమంది ఎంపీలు సంసిద్ధత వ్యక్తం చేసినా, ప్రభుత్వం పడిపోయినా ఫరవాలేదని, అలాంటి పద్ధతిలో ఎవరినీ తీసుకోవద్దని వాజ్‌పేయి స్పష్టం చేశారని గుర్తుచేశారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తాను బీజేవైఎం జాతీయ అధ్యక్షుడిగా ఉన్నానని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. వాజ్‌పేయికి ఆయన వ్యక్తిత్వంతోనే గౌరవం దక్కిందన్నారు. "పార్లమెంటుపై దాడి జరిగిన సందర్భంలో నేను హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నాను. అంతటి ఉద్రిక్త పరిస్థితిలో కూడా ప్రశాంతంగా ఆలోచించి వాజ్‌పేయి నిర్ణయాలు తీసుకున్నారు. మన ప్రజాస్వామ్యం ఓడిపోదు. మరుసటి రోజు పార్లమెంటు జరగాలి అని స్పష్టం చేశారు. వాజ్‌పేయి స్థితప్రజ్ఞతకు ఇది నిదర్శనం" అని విద్యాసాగర్‌రావు వివరించారు. ప్రజా నాయకులుగా ఎదిగి ప్రధానిగా బాధ్యతలు చేపట్టింది వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని మోదీ మాత్రమే అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సుధాంశు త్రివేది అన్నారు. వాజ్‌పేయి హయాంలో నిర్వహించిన పోఖ్రాన్ అణు పరీక్షలను గుర్తు చేశారు. కాగా, వాజ్‌పేయి జీవితానికి సంబంధించిన ఫోటో ప్రదర్శనను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మరపురాని రాజనీతిజ్ఞుడు

భారత రాజకీయాల్లో వాజపేయిది చెరిగిపోని ముద్ర

నైతిక విలువలకు కట్టుబడిన రాజకీయం.. పార్టీలకు అతీతమైన రాజనీతిజ్ఞత.. పార్లమెంటులో ఎంపీలనే కాదు.. విద్యారంగ సదస్సులో విద్యావేత్తల్ని, బహిరంగ సభల్లో సామాన్య ప్రజల్ని సైతం సమ్మోహితుల్ని చేసే ఉపన్యాస ఝురి, భిన్నత్వంలో ఏకత్వమనే భారతీయ వారసత్వ సంపదే ఈ దేశం ఆత్మ అనే తాత్విక అవగాహన.. ఇవన్నీ కలిపితే అటల్ బిహారీ వాజపేయి అవుతారు. రాజకీయ పార్టీల, సిద్ధాంతాల సరిహద్దులకు అతీతంగా గౌరవాభిమానాల్ని పొందిన అజాతశత్రువు ఆయన. వాజపేయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆయన జీవితంలో స్ఫూర్తినిచ్చే ఘట్టాల అవలోకనం.

- మూడుసార్లు ప్రధానిగా దేశ సారథ్యం
- అనైతిక పద్ధతుల్లో అధికారం వద్దన్న నైతికత.. ఐదేళ్లు తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం
- రక్షణరంగం బలోపేతానికి పోఖ్రాన్
- పాక్‌తో మైత్రికి లాహోర్ బస్సు యాత్ర
- కార్గిల్ యుద్ధంతో పాక్‌కు గుణపాఠం

(సెంట్రల్ డెస్క్)


వాజపేయి దేశ ప్రధానిగా మూడు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించారు. తొలిసారి కేవలం 13 రోజులే ఆ పదవిలో ఉండగా, రెండోదఫాలో 13 నెలలపాటు అధికారంలో ఉండటం విశేషం. మూడోసారి మాత్రం పూర్తి కాలంపాటు ప్రధాని పదవిలో కొనసాగారు. 1996లో జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది కానీ మెజారిటీ సమకూరలేదు. రాష్ట్రపతి ఆహ్వానంతో వాజపేయి మే నెలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే, మెజారిటీ సంపాదించుకోలేకపోవటంతో 13 రోజుల వ్యవధిలోనే ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి బదులిస్తూ.. 'పార్టీలను చీల్చి కొత్త భాగస్వాములతో కలిసి అధికారాన్ని చేపట్టటం నా లక్ష్యం కాదు. ఆ విధంగా దక్కిన అధికారాన్ని నేను కనీసం పట్టకారుతో కూడా తాకటానికి ఇష్టపడను' అంటూ వాజపేయి చేసిన ప్రసంగం ఆయన కట్టుబడిన నైతిక విలువలకు అద్దం పట్టింది. ప్రధానిగా ఆయన తొలిదఫా ప్రభుత్వమిది. అయినప్పటికీ, అనైతికమార్గాల్లో ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవటానికి వాజపేయి ఎంతమాత్రం ప్రయత్నించలేదు. రెండోసారి కూడా అంతే. రెండేళ్ల వ్యవధిలోనే 1998లో మళ్లీ లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కూడా బీజేపీకి మెజారిటీ దక్కనప్పటికీ అతిపెద్ద పార్టీగా నిలిచింది. పలు పార్టీల మద్దతుతో కలిసి వాజపేయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ, మరుసటి ఏడాదే అన్నాడీఎంకే కూటమి నుంచి వైదొలిగింది. విశ్వాస పరీక్షలో కేవలం ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం ఓడిపోయి.. వాజపేయి రాజీనామా చేశారు. అదే ఏడాది మళ్లీ లోక్‌సభ ఎన్నికలు జరిగాయి (రెండేళ్లలో మూడుసార్లు). ఈ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ 303 సీట్లతో మెజారిటీ సాధించి తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వం 2004 వరకూ కొనసాగింది. కేంద్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఐదేళ్లపాటు విజయవంతంగా నడిపించిన తొలి నేత వాజపేయి.

కార్గిల్ విజయం

వాజపేయి హయాంలో జరిగిన కార్గిల్ యుద్ధం.. భారత సైన్యం చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. 1999 మే నెలలో పాకిస్థాన్ సైనికులు, మిలిటెంట్లు కార్గిల్ పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో చొరబాట్లు, ఆక్రమణ ప్రారంభించారు. దీనిని తిప్పికొట్టటానికి మే నెల 26న భారత సైన్యం ఆపరేషన్ విజయ్‌ను ప్రారంభించింది. 3 నెలలపాటు జరిగిన యుద్ధంలో 500 మందికిపైగా జవాన్లు అమరులయ్యారు. పాకిస్థాన్ వైపున దాదాపు 4 వేల మంది సైనికులు, మిలిటెంట్లు మరణించినట్లు తర్వాత కాలంలో నివేదికలు వెల్లడయ్యాయి. కార్గిల్ విజయంతో వాజపేయి ప్రతిష్ఠ పెరిగిపోయింది. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు దీనికి అద్దం పట్టాయి. పూర్తి మెజారిటీతో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చింది.

పోఖ్రాన్ అణుపరీక్షలు

1998 మే నెలలో వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే భారత్.. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఎడారి ప్రాంతంలో ఐదు భూగర్భ అణుపరీక్షలు నిర్వహించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. శత్రుదేశాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. 1974లో భారత్ తొలి అణుపరీక్ష నిర్వహించగా.. మళ్లీ 24 ఏళ్ల తర్వాత పోఖ్రాన్‌లో ఆ పరీక్షలు జరిపి తన అణ్వాయుధ పాటవాన్ని యావత్ ప్రపంచం ఎదుట చాటిచెప్పింది. తొలుత ఆంక్షలు విధించిన అమెరికా.. అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ కేవలం ఆరునెలల్లోనే వాటిని ఎత్తివేసింది.



నెహ్రూనే కట్టిపడేసిన ప్రసంగం

వక్తగా వాజపేయి పార్టీలకు అతీతంగా అభిమానుల్ని సంపాదించుకున్నారు. 1957లో ఎంపీగా వాజపేయి లోక్‌సభలో తొలిసారి చేసిన ప్రసంగం నాటి ప్రధాని నెహ్రూను అమితంగా ఆకర్షించింది. ఎంతగా నంటే.. అప్పట్లో భారత సందర్శనకు వచ్చిన ఓ విదేశీ నేతకు ఎంపీలను పరిచయం చేస్తూ.. వాజపేయి దగ్గరికి వచ్చే సరికి 'ఈ యువకుడు ఏదో ఒకనాడు భారత దేశ ప్రధానమంత్రి అవుతారు' అని నెహ్రూ చెప్పారట. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసేతర పార్టీలన్నీ కలిసి ఏర్పాటు చేసిన జనతా ప్రభుత్వంలో వాజపేయి విదేశాంగమంత్రిగా పని చేశారు. పార్లమెంటులోని సౌత్‌బ్లాక్ నుంచి నెహ్రూ ఫొటోను తొలగించటంపై వాజపేయి అసంతృప్తి వ్యక్తం చేస్తూ తిరిగి ఆ ఫొటోను అక్కడే ఏర్పాటు చేయించారు. పార్టీలకు అతీతంగా ఆయన వ్యవహరిస్తారనటానికి ఇదొక ఉదాహరణ. వాజపేయి కవి కూడా. స్వయంగా పలు కవితలు రాసిన ఆయన ప్రసంగాల్లోనూ కవితాత్మక ధోరణి కనిపించేది. 'చోటే మన్ సే కోయి బడా నహీ హోతా! టూటే మన్ సే కోయీ ఖడే నహీ హోతా!' (అల్ప బుద్ధి కలవారు గొప్ప పనులు చేయలేరు! హృదయం ముక్కలైన వారు నిటారుగా నిలబడలేరు) వంటి పంక్తులు వాజపేయి ప్రసంగాల్లో జాలు వారి శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తుండేవి.

భారత ప్రతినిధిగా విపక్ష నేత

పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో విపక్షనేతగా ఉన్న వాజపేయిని జెనీవాలో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశాలకు భారత ప్రతినిధిగా పంపించారు. వాజపేయి సామర్థ్యంపై పీవీకి ఉన్న నమ్మకానికి ఇది ఒక నిదర్శనంగా భావిస్తారు. పాకిస్థాన్ సేనలతో పోరాడి బంగ్లాదేశ్ ఆవిర్భావానికి దారులు వేసిన నాటి ప్రధాని ఇందిరా గాంధీని వాజపేయి అప్పట్లో దుర్గాదేవితో పోల్చారు. దేశానికి సంబంధించిన అంశాల్లో వాజపేయి పార్టీలకతీతంగా వ్యవహరించేవారనటానికి ఇవన్నీ నిదర్శనాలు.

చర్చలే అత్యుత్తమ మార్గం

వాజపేయి ఉత్తమ పార్లమెంటేరియన్లలో ఒకరిగా పేరుగాంచారు. ఆయన ఎల్లప్పుడూ చర్చలు, ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నాలు చేసేవారు. అధికారపక్షం విపక్షాల గొంతు నొక్కటాన్ని ఆయన సమర్థించేవారు కాదు. అలాగే, విపక్షం పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకుంటూ వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన చేపట్టటాన్నీ ఆమోదించేవారు కాదు. పత్రికా స్వాతంత్ర్యానికి వాజపేయి అమిత ప్రాధాన్యతనిచ్చేవారు. 2003లో ప్రముఖ ఆంగ్ల దినపత్రిక హిందూ 125వ వార్షికోత్సవంలో మాట్లాడుతూ, 'భారత ప్రజాస్వామ్యంలో పత్రికాస్వేచ్ఛ విడదీయరాని భాగం. దానికి రాజ్యాంగం రక్షణ కల్పిస్తోంది. ఈ దేశ సంస్కృతి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను గౌరవించటమే కాదు.. స్వయంగా భిన్నాభిప్రాయాలకు అండగా ఉంటుంది. భిన్న వాదనలను ప్రోత్సహిస్తుంది' అని చెప్పారు. 2002లో యూజీసీ స్వర్ణోత్సవాల్లో విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రధాని హోదాలో వాజపేయి చెప్పిన మాటలు వింటే.. విద్యారంగాన్ని అమితంగా ప్రేమించే ఓ విద్యావేత్త మాటల్లాగా ఉంటాయి. 'విద్య అసలు సారం స్వీయ ఆవిష్కరణ. నిన్ను నువ్వు ఒక శిల్పంగా మల్చుకోవటమే ఆ ప్రక్రియ. విద్య ద్వారా లభించే శిక్షణ ఏదో ఒక రంగంలో కొన్ని మెళకువలనో, కొంత జ్ఞానాన్నో సంపాదించటం కాదు.. నీలోని మేధోపరమైన, కళాత్మకమైన, మానవత్వంతో కూడిన సామర్థ్యాలను ఆ శిక్షణ వికసింపజేయాలి' అని వాజపేయి ఉద్బోధించారు.

లాహోర్ బస్సుయాత్ర

దేశ విభజన జరిగిన భారత్-పాకిస్థాన్‌లుగా విడిపోయిన తర్వాత తొలిసారిగా రెండు దేశాల మధ్య బస్సు సర్వీసును వాజపేయి హయాంలోనే ప్రారంభించారు. ఢిల్లీ-లాహోర్ బస్సును ప్రారంభిస్తూ 1999 ఫిబ్రవరిలో వాజపేయి స్వయంగా పాకిస్థాన్‌కు బస్సులో వెళ్లారు. ఈ బస్సు యాత్ర పాకిస్థాన్‌తో సంబంధాలను మెరుగుపరిచింది. వాజపేయి, నాటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ సంయుక్తంలా లాహోర్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఇరుదేశాల మధ్య ఉన్న వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, వాణిజ్యాన్ని పెంపొందించుకోవాలని ఈ డిక్లరేషన్ నిర్దేశించింది. ఇరుదేశాల సంబంధాలు మెరుగుపడుతున్న దశలో సంభవించిన కార్గిల్ చొరబాట్లు పరిస్థితిని తిరిగి క్షీణింపజేశాయి. అనంతరం రెండేళ్లకు 2001లో అప్పటి పాకిస్థాన్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌తో ఆగ్రాలో జరిపిన శిఖరాగ్ర సమావేశం కూడా గొప్ప మలుపు. అయితే, అది ఆశించిన ఫలితాలను సాధించలేదు.

శానిటైజర్ బాటిల్ పేలి ముగ్గురికి తీవ్రగాయాలు

- క్రిస్మస్ సందర్భంగా ఇంటిని శుభ్రం చేస్తుండగా ఘటన

మద్దూర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): హ్యాండ్ శానిటైజర్ బాటిల్ పేలి ముగ్గురు తీవ్రగాయాల పాలయ్యారు. ఈ దుర్ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఎస్సీ కాలనీలో నివసించే భాస్కర్.. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో ఇంటిని శుభ్రం చేసుకుంటూ పనికిరాని సామాన్లు, చెత్తను బయట పడేశాడు. అప్పుడు అందులో ఉన్న ఓ శానిటైజర్ బాటిల్ ఒక్కసారిగా పేలింది. దాంతో భాస్కర్‌తో పాటు అక్కడే తరుణ్, రాజేశ్ అనే ఇద్దరు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలో ఉన్న పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించారు. గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

జఫర్‌గఢ్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన నూకల అనిల్ (32) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. పంటల పెట్టుబడుల కోసం అప్పులు చేశాడు. సరైన దిగుబడులు లేక నష్టపోయి తాగుడుకు బానిసయ్యాడు. దీనికి తోడు పంట కోసం తీసుకున్న రుణం తీర్చేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి లోనై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనిల్ పురుగుల మందు తాగి పడిపోయాడు. అనంతరం కుటుంబసభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

తెలంగాణ వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి వైద్యవిద్యార్థుల విజ్ఞప్తి

పంజాగుట్ట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలని, నీట్ పీజీ 2024-25 మెరిట్ లిస్టును ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి పలువురు వైద్య విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నీట్ పరీక్ష రాసిన వైద్య విద్యార్థులు వినయ్ కుమార్, వంశీ, మల్లికార్జున, అభినవ్ మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఆగస్టులో నీట్ పీజీ 2024-25 పరీక్ష జరగ్గా, అదే నెల 25న ఫలితాలు వచ్చాయని వారు తెలిపారు. రాష్ట్ర విద్యార్థులకు న్యాయం చేకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఓ జీవో తెచ్చిందని, దీనిని తాము స్వాగతిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పీజీ వైద్య ప్రవేశాలు జరుగుతున్నాయని, జాతీయ స్థాయిలో ఇప్పటికే రెండుసార్లు కౌన్సెలింగ్ జరిగిందని, ఈనెల 26తో కౌన్సెలింగ్ ముగుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కౌన్సెలింగ్ ఆలస్యం అయితే తెలంగాణ విద్యార్థులు నష్టపోతారని, సుప్రీంకోర్టులో తీర్పు రావడానికి ఆలస్యం జరుగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయడానికి ప్రత్యామ్నాయ పద్ధతులు గుర్తించి త్వరగా న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

వర్గీకరణ అమలుకు పోరాడదాం

వ్యతిరేక కుట్రలను ఎదుర్కొందాం: మందకృష్ణ

ఫిబ్రవరి 3న 'లక్ష డప్పులు-వెయ్యి గొంతుకల'తో సభ

పంజాగుట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కుట్రలను సమర్థంగా ఎదుర్కొందామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. వర్గీకరణ అమలు కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 3న మండే మాదిగల గుండె చప్పుడు 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులతో' అంబేద్కర్ విగ్రహం వద్ద సభ, దండోరా ప్రదర్శనను పురస్కరించుకుని మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంద కృష్ణ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తే కొందరు ప్రతిఫలం అనుభవించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా, ఆ పార్టీలో ఉన్న కొంతమంది అడ్డుకోవాలని చూస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో మాల సామాజిక వర్గం వారి మాటే చెల్లుతుందన్నారు. వర్గీకరణ సాధన కోసం టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను కలిశానని, సందర్భానుసారంగా వారికి సహాయం చేశానని తెలిపారు. వారు వర్గీకరణ చేస్తామని చెప్పారు కానీ, బీజేపీ మాత్రం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని అన్నారు. వర్గీకరణ ఆలస్యమయ్యే కొద్దీ విద్య, ఉద్యోగ రంగాల్లో వాటా కోల్పోతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే వర్గీకరణ చేయాలని కోరారు. ఫిబ్రవరి 3న మండే మాదిగల గుండె చప్పుడు దండోరా ప్రదర్శన సచివాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమవుతుందన్నారు.

ధాన్యం కొనుగోళ్లు జరగక రైతుల అవస్థలు: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరపకపోవడంతో రైతులు అవస్థ పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరిగితే ప్రభుత్వం కొన్నది 46 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనన్నారు. కొన్నది కాకరకాయ కొసిరింది గుమ్మడికాయ అన్నట్లుగా కాంగ్రెస్ తీరు ఉందని మంగళవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. కల్లోల కాంగ్రెస్ పాలనలో రైతుకే భరోసా లేని పరిస్థితి.. అలాంటిది కౌలు రైతులు, రైతు కూలీల ఊసెక్కడుంటుందని వ్యాఖ్యానించారు.

అంబేడ్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమే

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

- అల్లు అర్జున్ వ్యవహారంలో ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు: తమ్మినేని

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో చాలా మంది రాజకీయ నాయకులకు అంబేడ్కర్‌ను ఎగతాళి చేయడం, అవమానించడం ఫ్యాషన్‌గా మారిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. అంబేడ్కర్‌ను అవమానించడం అంటే దేశ రాజ్యాంగాన్ని అవమానించడమే అని ఆయన పేర్కొన్నారు. మంగళవారంహైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 30న దేశవ్యాప్తంగా నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికైనా అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, ఆయన్ను ప్రధానమంత్రి మోదీ మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జనవరి 25 నుంచి 28 వరకు జరగాల్సిన 4వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. సమాఖ్య వ్యవస్థను నాశనం చేయడానికే ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని తెరమీదకు తెచ్చారని ఆక్షేపించారు. ఎన్నికల సంఘం సిఫార్సుల మేరకు కేంద్రప్రభుత్వం ఎన్నికల నిర్వహణ నిబంధనలను సవరిస్తూ ప్రకటన చేయడాన్ని తప్పు పట్టారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని రాఘవులు తెలిపారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ, అల్లు అర్జున్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని, మరో రూ.11 వేల కోట్లు బ్యాంకర్లకు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు హైడ్రా, మూసీ అంశాలు తెరమీదకు తెస్తున్నారని, వీటిపై సమగ్రంగా చర్చించాల్సి ఉందని అన్నారు. అల్లు అర్జున్ కేసులో పోలీసులపై కూడా విచారణ చేయాల్సిన అవసరం ఉందని తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు.

మున్నేరుకు 23 కిలోమీటర్ల రక్షణ గోడ

మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

వరద ముంపునుంచి ఖమ్మం ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు గాను చేపట్టిన మున్నేరు రక్షణ గోడ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మున్నేరు ముంపు నుంచి ఖమ్మం పట్టణాన్ని కాపాడేందుకు నదికి ఇరువైపులా ఆర్‌సీసీ కాంక్రీట్ గోడలు నిర్మిస్తున్నామని, 23 కి.మీ మేర జరిగే నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, వరద సజావుగా ప్రవహించే విధంగా గోడను డిజైన్ ఉండాలని అధికారులకు సూచించారు. రక్షణగోడ నిర్మాణ పనుల్లో వేగం పెరగాలన్నారు. ఈ గోడ నిర్మాణానికి అవసరమైన ఈ వాల్ నిర్మాణానికి అవసరమయ్యే భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. దీనికి సంబంధించి రెండు, మూడు రోజుల్లో ఖమ్మం జిల్లాలోని అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని పొంగులేటి తెలిపారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసిన అభ్యర్థులు

2017 నోటిఫికేషన్ ప్రకారమే

సర్వేయర్ పోస్టులు భర్తీ చేయండి

- మంత్రి పొంగులేటికి అభ్యర్థుల వినతి

హైదరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పాత వీఆర్‌వో, వీఆర్‌ఏ ఉద్యోగుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హత ఉన్న వారికి సర్వేయర్లుగా అవకాశం కల్పించడం సరికాదని, 2017 నోటిఫికేషన్ ప్రకారం డిప్యూటీ సర్వేయర్ పోస్టులను ఐటీఐ డిప్లొమా, సివిల్ ఇంజినీరింగ్ అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఇవ్వాలని పలువురు అభ్యర్థులు కోరారు. ఈ మేరకు సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. సాంకేతిక అర్హతలు లేని వారికి సర్వేయర్ పోస్టులు కేటాయించవద్దని కోరారు. దీనిపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ డిప్యూటీ సర్వేయర్ పోస్టులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరుగా నియమిస్తామని, 2025 జాబ్ క్యాలెండర్‌లో వాటిని చేర్చుతామని హామీ ఇచ్చారు.

త్వరలో రూ.10 లక్షల లోపు
పెండింగ్ బిల్లులకు ఆమోదం!

- సర్పంచులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సర్కారు యోచన
- వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు సంబంధించి రూ.10 లక్షల లోపు పెండింగ్ బిల్లులను ఆమోదించే ఆలోచన ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సర్పంచులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు గత ఏడాది డిసెంబరు 7వ తేదీ నాటికి పూర్తి చేసిన పనుల తాలూకు రూ.1,300 కోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించారు. వీటిలో రూ.10 లక్షల లోపు బకాయిలు దాదాపు రూ.400 కోట్ల వరకు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా ఈ బిల్లులను క్లియర్ చేసే ఆలోచన చేస్తున్నామని, ఈ మేరకు వీటిని త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులతో పనులు చేయించి, బిల్లులను పెండింగ్‌లో పెట్టారని, వారిని వీధిపాలు చేశారని భట్టి విమర్శించారు. ఇప్పుడు ఆ పార్టీ నేతలే బిల్లుల విడుదల కోసం రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తామంటున్నారని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధుల పెండింగ్ బిల్లుల గురించి బీఆర్ఎస్ నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని డిప్యూటీ సీఎం హితవు పలికారు.

సౌరవిద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసుకోండి

- 25 ఏళ్లపాటు యూనిట్‌కు రూ.3.13 చెల్లిస్తాం
- రైతులు, సహకారసంఘాలు దరఖాస్తు చేసుకోండి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వ్యవసాయ భూముల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే.. 25ఏళ్లపాటు యూనిట్‌కు రూ.3.13 చెల్లించి, కరెంట్‌ను ప్రభుత్వం కొంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఎవమ్ ఉత్థాన్ మహాభియాన్ కింద 0.5-2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. వ్యవసాయ భూముల్లో లేదా బంజరు భూముల్లో వీటిని ఏర్పాటు చేసుకోవచ్చని, రైతులు, రైతు సహాయక సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు ప్లాంట్లు పెట్టుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈ మేరకు తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



పొంగులేటి శ్రీనివాసరెడ్డి నుంచి పదోన్నతి ఉత్తర్వులను అందుకుంటున్న గృహ నిర్మాణ సంస్థ సీఈ చైతన్యకుమార్

గృహ నిర్మాణ సంస్థ సీఈగా చైతన్యకుమార్

హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్ (సీఈ)గా ఎం. చైతన్యకుమార్ నియమితులయ్యారు. ఆయన్ను ఆ పోస్టులో నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ధౌర్యా తండా వాసి అయిన చైతన్య 1994లో వర్క్ ఇన్‌స్పెక్టర్ పోస్టులో ఉద్యోగంలో జాయిన్ అయ్యారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. తాజాగా డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ నిర్ణయం మేరకు సీనియారిటీ ప్రకారం చైతన్యకుమార్‌ను ప్రభుత్వం సీఈగా నియమించింది. ఈ మేరకు పదోన్నతి కల్పించిన ఉత్తర్వులను శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆయనకు అందించారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో చైతన్య కీలకంగా వ్యవహరించనున్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు మరోసారి పొడిగింపు

ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు చెల్లించే గడువును అధికారులు మరోసారి పొడిగించారు. ఈ విషయాన్ని బోర్డు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీతో ఫీజు చెల్లింపు గడువు ముగియనుండగా, ఈనెల 31వ తేదీ వరకు గడువును పొడిగించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. కాగా, మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అలాగే ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చే వరకు పోరాటం

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించకుండా ఎగవేయాలని చూస్తే ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కార్ హామీలను అమలుచేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు. బీసీల సమస్యలను కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోకపోవడం దారుణమని, కుల వృత్తుల వారికి కనీస మద్దతు ఇవ్వడం లేదని అన్నారు. కేసీఆర్ హయాంలో బీసీల కోసం అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

రాధాకిషన్ రావుకు మధ్యంతర బెయిల్

హైదరాబాద్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు రాధాకిషన్‌రావుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆయన మామ అంత్యక్రియల్లో పాల్గొనేందుకుగాను ఈ నెల 25న ఉదయం 10 నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఎస్కార్ట్ బెయిల్ ఇచ్చింది. కుటుంబ సభ్యులను, సమీప బంధువులను కలవడానికి రాధాకిషన్‌రావును అనుమతించాలని, అంత్యక్రియలు, ఇతర కార్యక్రమాలకు ఎస్కార్ట్ సిబ్బంది ఆటంకాలు కలిగించకూడదని మధ్యంతర బెయిల్ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. జస్టిస్ కె.సుజన ధర్మాసనం.. మంగళవారం ఈ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు

- ఐదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

న్యూఢిల్లీ/అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన కంభంపాటి హరిబాబు ఒడిశా నూతన గవర్నర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన మిజోరాం గవర్నర్‌గా ఉన్నారు. ఐదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఒడిశా గవర్నర్ పదవికి రఘుబర్ దాస్ చేసిన రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ఆయన స్థానంలో హరిబాబును నియమించారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌ను బిహార్‌కు, బిహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కేరళకు బదిలీ చేశారు. మణిపూర్ గవర్నర్‌గా కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లాను, మిజోరాం గవర్నర్‌గా జనరల్ విజయ్‌కుమార్ సింగ్‌ను నియమించారు. ఇటీవల అస్వస్థతకు గురైన హరిబాబును ప్రధాని మోదీ ఫోన్‌లో పరామర్శించినట్లు తెలిసింది. కాగా, ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు నియమితులు కావడం సంతోషకరమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆయన నియామకంతో ఏపీ, ఒడిశా సరిహద్దు సమస్యలతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి, ఇరు రాష్ట్రాల అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తప్పయిపోయింది





చిక్కడపల్లి పోలీసు ఠాణా వద్దకు భారీగా చేరుకున్న జనం; తన ఇంటి వద్ద అభిమానులకు అల్లు అర్జున్ అభివాదం

(మొదటిపేజీ తరువాయి)

చూసి ఆయన కంటతడి పెట్టుకున్నారు!! తొక్కిసలాటకు సంబంధించి పోలీసులు చూపిన 10 నిమిషాల వీడియో చూసి ఆయన భావోద్వేగానికి గురైనట్టు సమాచారం. 'పుష్ప-2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసుకు సంబంధించి విచారణకు రావాలంటూ చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌కు నోటీసులిచ్చిన సంగతి తెలిసిందే. ఈమేరకు.. మంగళవారం ఉదయం 10.30 గంటలకు.. భార్య, కుమార్తె గేటుదాకా వచ్చి సాగనంపగా.. తండ్రి అల్లు అరవింద్, మామ చంద్రశేఖర్ రెడ్డి, బన్నీ వాసుతో కలిసి ఆయన జూబ్లీహిల్స్‌లోని తన ఇంటి నుంచి బయల్దేరారు. మరోవైపు.. చిక్కడపల్లి పోలీసులు ఠాణా పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. అటువైపు ఎలాంటి వాహనాలనూ అనుమతించలేదు. పాదచారులను సైతం రానివ్వలేదు. చుట్టుపక్కల ఉన్న దుకాణాలన్నింటినీ మూయించారు. ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. 11.05 గంటలకు అల్లు అర్జున్ పోలీస్ స్టేషన్‌కు చేరుకోగానే గేట్లు మూసేశారు. అల్లు అరవింద్‌ను, చంద్రశేఖర్ రెడ్డిని, బన్నీ వాసును కిందే ఆపేసిన పోలీసులు.. బన్నీని ఠాణా మొదటి అంతస్తులోని ఏసీపీ కార్యాలయంలోకి తీసుకెళ్లారు. అక్కడ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ బృందం.. అల్లు అర్జున్ తరఫు న్యాయవాది సమక్షంలో విచారణ ప్రారంభించారు. మధ్యాహ్నం 2.45 వరకు.. మూడున్నర గంటలపాటు ఈ విచారణ కొనసాగింది.

ప్రశ్నల వర్షం..

విచారణలో భాగంగా అల్లు అర్జున్‌పై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం.. "ప్రీమియర్ షోకి హీరో హీరోయిన్‌లను రానివ్వొద్దంటూ పోలీసులు థియేటర్ యాజమాన్యానికి లిఖిత పూర్వకంగా తెలిపిన విషయం మీ దృష్టికి వచ్చిందా? రాలేదా? ఒకవేళ యాజమాన్యం ఆ విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడంలో విఫలమైతే.. మీరు కుటుంబంతో పాటు ప్రీమియర్ షోకు వచ్చినప్పుడు నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా బయట నుంచే ఓపెన్ టాప్ వాహనంలో నిలబడి చేతులు ఊపుతూ రోడ్‌షో ఎందుకు చేశారు? అలా చేయడానికి మీకు ఎవరు అనుమతి ఇచ్చారు? అనుమతి లేకుండా రోడ్‌షో చేయడం తప్పని మీకు తెలియదా? జరిగిన ఘోరం గురించి మీ దృష్టికి తెచ్చి.. వెంటనే అక్కణ్నుంచీ వెళ్లిపోవాలని సూచించినా ఎందుకు వెళ్లలేదు? అదే విషయాన్ని థియేటర్ యాజమాన్యం ద్వారా చెప్పించినా, స్వయంగా ఏసీపీ వచ్చి చెప్పినా మీరు ఎందుకు పట్టించుకోలేదు? మీ వల్ల జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ నిండు ప్రాణాలు కోల్పోవడంతోపాటు ఆమె కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిన విషయం మీకు ఎప్పుడు తెలిసింది? ఎలాంటి అనుమతులూ లేకుండా బౌన్సర్‌లను, ప్రైవేట్ సెక్యూరిటీని థియేటర్ వద్దకు ఎలా తీసుకొస్తారు? మీతో పాటు.. మీ కోసం వచ్చి ప్రైవేట్ సెక్యూరిటీ, బౌన్సర్‌ల అత్యుత్సాహం వల్ల, థియేటర్‌లో తొక్కిసలాటకు జరుగుతుంటే మీరు ఎందుకు స్పందించలేదు?" అంటూ డీసీపీ ప్రశ్నలు సంధించారు. రేవతి చనిపోయిన విషయం తనకు ఆరోజు తెలియదని, ఇంటికి వెళ్లిన తర్వాత తన ఫోన్ బయటపెట్టి, ఉదయం వరకూ లేపవద్దని చెప్పి తాను పడుకున్నానని, బన్నీ వాస్‌కు ఆ రాత్రే ఈ విషయం తెలిసిందని, మర్నాడు ఉదయం అతని ద్వారా తమకూ తెలిసిందని అర్జున్ పోలీసులకు వివరించినట్లు తెలుస్తోంది. విచారణ సందర్భంగా పోలీసులు ఒక్కొక్క ప్రశ్నా వేస్తూ.. దానికి అల్లు అర్జున్ చెప్పిన జవాబు విని, సంబంధిత వీడియోను ఆయనకు చూపించినట్టు సమాచారం. ఉదాహరణకు.. "పోలీసు అధికారులు థియేటర్‌లో ఉన్న మీ వద్దకు రాలేదని అన్నారుగా?" అనే ప్రశ్నకు.. రాలేదని బన్నీ సమాధానమివ్వగా, 'అయితే ఇదిగో ఈ వీడియో చూడండి' అంటూ పోలీసు ఉన్నతాధికారులు థియేటర్ లోపలికి వస్తున్న వీడియోను ఆయనకు చూపించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే.. అల్లు అర్జున్ థియేటర్‌కు రావడానికి ముందు నుంచీ బౌన్సర్లు వ్యవహరించిన తీరును, ఆయన గేట్లు మూసి వేయాలని బౌన్సర్లకు చెప్పిన దృశ్యాలను పోలీసులు చూపించినప్పుడు.. తన వల్ల తప్పు జరిగిందని ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. థియేటర్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా కారు టాప్ నుంచి ఆయన అభిమానులకు అభివాదం చేసిన వీడియోలు, ట్రాఫిక్ జామ్ వీడియోలనూ పోలీసులు చూపించారు. అలాగే.. ఇటీవల పెట్టిన ప్రెస్ కాన్ఫరెన్స్ గురించి ప్రశ్నించినప్పుడు.. తనని తాను డిఫెండ్ చేసుకోవడానికి, తన న్యాయవాదుల బృందం ఇచ్చిన సూచనలమేరకే తాను మాట్లాడానని ఆయన వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. పోలీసులు తన విషయంలో మీడియాకు అవాస్తవాలు చెప్పారని కూడా ఆయన అన్నట్లు సమాచారం. మొత్తమ్మీద పోలీసులు దాదాపు 20 ప్రశ్నలు సంధించగా.. వాటిలో ఒకటి రెండు వినహా మిగతా అన్ని ప్రశ్నలకూ ఆయన బదులిచ్చారని.. న్యాయవాదుల సూచనల మేరకు మిగతా ప్రశ్నలకు ఆయన సమాధానం దాటవేశారని, పోలీసులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు హాజరవుతానని చెప్పారని విశ్వసనీయంగా తెలిసింది. ఈ విచారణ ప్రక్రియ మొత్తాన్నీ పోలీసులు వీడియో రికార్డింగ్ చేశారు.

మూడుసార్లు విరామం..

మధ్యాహ్నం 2:45 వరకు విచారించిన పోలీసులు మధ్యలో మూడుసార్లు బ్రేక్ ఇచ్చినట్లు తెలిసింది. బ్రేక్ సమయంలో తాను ఇంటి నుంచి తెచ్చుకున్న బిస్కట్స్, డ్రైఫ్రూట్స్‌ను తీసుకున్న అల్లు అర్జున్.. పోలీసులు తెప్పించిన టీ, తాగినట్లు తెలిసింది. విచారణ పూర్తయిన అనంతరం అల్లు అర్జున్ కిందకు వచ్చి తన వాహనంలో ఇంటికి వెళ్లిపోయారు.

పీఎస్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత..

విచారణ నిమిత్తం అల్లు అర్జున్ వస్తున్న నేపథ్యంలో ఆయన అభిమానులు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు ఠాణా వద్దకు రానివ్వకపోవడంతో.. చుట్టుపక్కల భవనాలపైకి ఎక్కిన అభిమానులు, స్థానిక ప్రాంతాల నివాసులు అల్లు అర్జున్‌ను చూసేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగలేదు.

నన్నే రానివ్వరా?

అల్లు అర్జున్‌ను పోలీసులు విచారిస్తున్న సమయంలో.. ఒక వ్యక్తి తాను అడ్వొకేట్‌నంటూ పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చి.. తాను న్యాయవాదినని, తానే కేసు వేశానని, తనను విచారణ గదిలోకి వెళ్లకుండా ఆపివేశారని పేర్కొంటూ మీడియా ముందు గట్టిగా అరవడం మొదలుపెట్టారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆయనను పంపించివేశారు.

సీన్ రీకన్‌స్ట్రక్షన్ వదంతులు

సంధ్య థియేటర్ వద్దకు వందలాది అభిమానులు

అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి ఠాణాలో విచారిస్తున్న సమయంలో.. ఆ రోజు జరిగిన ఘటనకు సంబంధించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తారన్న వదంతులు విస్తృతంగా వ్యాపించాయి. దీంతో కొంతమంది మీడియా ప్రతినిధులు సంధ్య థియేటర్ వద్దకు చేరుకున్నారు. బన్నీ అభిమానులు సైతం పెద్ద ఎత్తున అక్కడికి వచ్చారు. అల్లు అర్జున్ టీమ్ కూడా థియేటర్‌కు చేరుకుని అక్కడి పరిస్థితులను సమీక్షించారు.





సీఎంను కలిసి మాట్లాడా

- శ్రీతేజ్ కుటుంబ బాధ్యత తీసుకోవడంపై చర్చించా
- బాలుడి తండ్రికి పరిశ్రమలో ఉద్యోగమిస్తాం
- సినిమా వాళ్లందరం వెళ్లి ముఖ్యమంత్రిని కలుస్తాం
- శ్రీతేజ్‌ను పరామర్శించిన నిర్మాత దిల్ రాజు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడి ఆస్పత్రిలో ఉన్న శ్రీతేజ్ కుటుంబ బాధ్యతను తీసుకోవడంపై తాను సీఎంతో చర్చించానని.. ఆయన ఓకే అన్నారని, ఆయన ఆదేశాల మేరకు బాలుణ్ని పరామర్శించడానికి వచ్చానని ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. అలాగే.. చిత్ర పరిశ్రమను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందంటూ కొందరు మాట్లాడుతున్నారని, అందులో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. "చిత్ర పరిశ్రమకు అన్ని రకాలుగా అండగా ఉంటామని, ఎఫ్‌డీసీ ద్వారా సహాయసహకారాలు అందిస్తామని సీఎం రేవంత్ చెప్పారు. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్య అనుసంధానకర్తగా ఉంటూ ఎలాంటి సమస్యలూ లేకుండా చూసుకునే బాధ్యతను ముఖ్యమంత్రి నాకు అప్పగించారు. బుధవారం లేదా గురువారం సమయం ఇస్తానన్నారు. దీనిపై పలువురు సినీ పెద్దలతో మాట్లాడాను. ఇండస్ట్రీ తరఫున అందరం వెళ్లి సీఎంను కలుస్తాం" అని దిల్ రాజు వెల్లడించారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని.. అతడి ఆరోగ్యం మెరుగైనట్లు వైద్యులు చెప్పారని వెల్లడించారు. 'వెంటిలేటర్ తొలగించి రెండు రోజులైందట. ఆ తర్వాత కూడా రికవరీ కనిపిస్తోంది. కాబట్టి త్వరలోనే కోలుకుంటాడు' అని పేర్కొన్నారు. 'పుష్ప' ప్రీమియర్ షో సమయంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని.. ఎవరూ కావాలని చేయరని ఆయన వ్యాఖ్యానించారు. తాను వేరే కార్యక్రమంలో పాల్గొనడానికి అమెరికాకు వెళ్లానని, తిరిగి రాగానే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని చెప్పారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబాన్ని సినీ పరిశ్రమ, ప్రభుత్వం కలిసి అన్ని రకాలుగా ఆదుకుంటాయని తెలిపారు. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా ఆ బాధ్యతను సీఎం రేవంత్ రెడ్డి తనకు అప్పగించారని.. తానే ఆ పనులన్నీ చూసుకుంటానని వెల్లడించారు. 'అల్లు అర్జున్ ద్వారా కూడా వారి కుటుంబానికి అందాల్సిన సాయం అందుతుంది. ఇండస్ట్రీ పెద్దగా.. అల్లు అర్జున్‌ను కూడా కలిసి ఆయన స్పందన కూడా తెలియజేస్తాను. ఇండస్ట్రీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేస్తూ ఈ సమస్యలన్నీ త్వరలోనే సమసిపోయేందుకు కృషి చేస్తాను' అని దిల్ రాజు పేర్కొన్నారు. రేవతి భర్త భాస్కర్‌కు సినీ పరిశ్రమలో ఏదో ఒక ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కూడా ఆ కుటుంబానికి వీలైనంత సహకారం అందిస్తామన్నారు.

అల్లు అర్జున్.. రూ. 10లక్షల డీడీ పంపారు

- మంత్రి కోమటిరెడ్డి రూ.25లక్షలు, మైత్రీ మూవీస్ తరఫున 50లక్షలు అందజేశారు
- శ్రీతేజ్ కళ్లు తెరిచినా నన్ను గుర్తు పట్టలేదు
- ఆరోగ్యం కొంత మెరుగైంది: శ్రీతేజ్ తండ్రి భాస్కర్



రాంగోపాల్‌పేట్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీతేజ్ కళ్లు తెరిచి చూశాడు కానీ.. తనను గుర్తు పట్టడం లేదని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రి వద్ద మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిలో కొద్దిగా మెరుగుదల కనిపిస్తుందని వివరించారు. ఇప్పటి వరకు మైత్రీ మూవీస్ తరఫున రూ.50లక్షలు అందగా, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ తరఫున మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రూ.25లక్షలు అందించారని వెల్లడించారు. శ్రీతేజ్ వైద్యం కోసం అల్లు అర్జున్ రూ.10లక్షల డీడీ పంపినట్లు వివరించారు. మీడియా నుంచి తనకు అపూర్వ మద్దతు లభించిందని, అల్లు అర్జున్ సైతం సానుకూలంగా స్పందించడంతో కేసు వాపసు తీసుకుంటున్నాని చెప్పినట్లు పేర్కొన్నారు. ఆ రోజు సినిమా హాల్‌లోకి ముందుగా తన భార్య పిల్లలు వెళ్లారని, రద్దీ ఎక్కువగా ఉండడంతో తాను వెళ్లలేకపోయానని చెప్పారు. కాసేపటికే తొక్కిసలాట జరిగి ఒక మహిళ చనిపోయిందని తెలిసిందన్నారు. చనిపోయింది తన భార్యేనని, కొడుకు అపస్మారక స్థితిలో ఉన్నాడని తెలిసి నిర్ఘాంత పోయినట్లు వెల్లడించారు. ప్రస్తుతం తన కుమారుడు శ్రీతేజ్‌కు వైద్యులు మంచి వైద్యం అందిస్తున్నారని, కానీ కోలుకోవడానికే చాలా సమయం పడుతుందని చెబుతున్నారని తెలిపారు.

సినీ పరిశ్రమనంతా బోనులో నిలబెట్టే యత్నం

సీఎం రేవంత్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్నట్టు ఉంది.. శ్రీతేజ్ వైద్య ఖర్చును అల్లు అర్జునే భరించాలి: ఈటల

- సెన్సార్ బోర్డును ప్రక్షాళన చేయాలి
- బౌన్సర్ల వ్యవస్థను రద్దు చేయాలి: కూనంనేని



హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనను సాకుగా చూపి సినీ పరిశ్రమనంతా బోనులో నిలబెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. శ్రీతేజ్ కుటుంబ సభ్యులతోపాటు డాక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ 'ప్రధాన మంత్రి మా నియోజకవర్గానికి వచ్చారు.. రోడ్ షో చూడడానికి ఒక పాత బిల్డింగ్ మీద చాలా మంది ఎక్కారు.. ఇల్లు కూలి ఏమన్నా అవుతుందేమోనని భయపడ్డాం. ఒకవేళ ఏమన్నా అయితే ప్రధాన మంత్రి గారినీ బాధ్యుల్ని చేస్తారా? సంధ్య థియేటర్ ఘటనను రాద్ధాంతం చేస్తున్నది బీజేపీ కాదు. కాంగ్రెస్ పార్టీనే. ఈ విషయంలో సీఎం రేవంత్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్నట్టు ఉంది. ఇప్పటికైనా చిల్లర వేషాలు మాని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నా" అని పేర్కొన్నారు. . ప్రస్తుత సెన్సార్ బోర్డు బడా నిర్మాతల చేతిలో బందీ అయిందని, దాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో సినిమాలు సమాజంలో మార్పు కోసం తీస్తే.. నేడు సంపాదనే లక్ష్యంగా సినిమాలు రూపొందించడం ఆక్షేపణీయమన్నారు . బౌన్సర్ల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను కూనంనేని పరామర్శించారు. కాగా, నిఘా విభాగం వైఫల్యం వల్లనే సంధ్యా థియేటర్‌లో తొక్కిసలాట ఘటన చోటుచేసుకుందని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. కిమ్స్‌లో శ్రీతేజ్‌ను జూలకంటి రంగారెడ్డితో పాటు సీపీఎం ప్రతినిధులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇల్లు, సినీ పరిశ్రమ నుంచి రూ.5కోట్లు ఇప్పించాలని కోరారు.

రేవంత్ బాగా నటిస్తున్నారు!

అల్లు అర్జున్‌పై వివాదం రాజకీయ ప్రేరేపితం: అన్నామలై

సినీ నటుడు అల్లు అర్జున్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ద్వేష భావంతో వ్యవహరిస్తున్నారని తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో, కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డి బాగా నటిస్తున్నారని, అల్లు అర్జున్ కన్నా తానే పెద్ద సూపర్‌స్టార్‌నని చెప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ ప్రభుత్వం మొత్తం అల్లు అర్జున్‌పై దాడికి పాల్పడుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి చెందినవారు అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లదాడికి పాల్పడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

11 కలిసి రావడం లేదా!

నంద్యాల ఘటన నుంచి తాజా కేసులో ఏ-11 వరకు సామాజిక మాధ్యమాల్లో చర్చ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు అల్లు అర్జున్‌కు 11 కలిసి రావడం లేదా..? అంటే ఔనన్నదే సమాధానం. ఏపీ ఎన్నికల నేపథ్యంలో మే 11వ తేదీన ఆయన నంద్యాలకు వెళ్లారు. వైఎస్సార్‌సీపీ తరఫున నంద్యాల అభ్యర్థిగా పోటీ చేసిన శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి మద్దతు పలికారు. ఇది అప్పట్లో వివాదస్పదమైంది. మెగా కాంపౌండ్‌కు చెందిన అర్జున్.. జనసేన కూటమిని కాదని.. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వడం చర్చనీయాంశమైంది. డిసెంబరు 4న సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన రేవతి మృతిని నిమ్స్ వైద్యులు అదే రోజు 11 గంటల సమయంలో నిర్ధారించినట్టు సమాచారం. ఈ కేసులో అర్జున్ ఏ-11గా ఉన్నారు. ఇవన్నీ యాదృచ్ఛికంగానే జరిగినా.. 11 నంబర్ అర్జున్‌కు కలిసి రావడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

18కి చేరిన నిందితుల సంఖ్య

- ఏ18గా మైత్రీమూవీస్ నిర్మాతలు
- పరారీలో ఏడుగురు.. పోలీసుల గాలింపు
- న్యాయస్థానానికి సీల్డ్ కవర్‌లో.. అల్లు అర్జున్ విచారణ నివేదిక

హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో నిందితుల సంఖ్య 18కి చేరింది. ఇప్పటి వరకు 10 మంది అరెస్టవ్వగా.. తాజాగా ఆంటోనీ అనే బౌన్సర్‌ను అరెస్టు చేసినట్లు వచ్చిన వార్తలను పోలీసులు ఖండించారు. నిందితుల్లో అసలు ఆ పేరుతో ఎవరూ లేరని పేర్కొంటూ.. ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్ ఆ చిట్టాను విడుదల చేశారు. ఇదివరకు ఈ కేసులో అల్లు అర్జున్ సహా.. 16 మంది నిందితులుగా ఉండగా.. తాజాగా ఏ17గా అర్జున్ అంగరక్షకుడు ఫర్వాజ్, ఏ18గా మైత్రీమూవీస్ నిర్మాతలను చేర్చినట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ ఇప్పటికే అరెస్టవ్వగా.. హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. సంధ్య థియేటర్ భాగస్వాములు పెద్ద రామారెడ్డి, చిన్న రామారెడ్డి, సందీప్, మేనేజర్ నాగరాజు, బాల్కనీ ఇన్‌చార్జి విజయ్ చందర్, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, అభిమానులను తరలించే ఫిరోజ్, బౌన్సర్లు అర్జున్, వినయ్ అరెస్టయ్యారు. వీరిలో పెద్ద రామారెడ్డి, చిన్న రామారెడ్డి బెయిల్‌పై బయటకు రాగా.. మిగతావారు జైలులోనే ఉన్నారు. కొందరు బౌన్సర్లతోపాటు.. అభిమానులను తరలించే వ్యక్తులు సహా.. మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. వారిని గాలించేందుకు పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కాగా.. అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు మంగళవారం మూడున్నర గంటల పాటు విచారించారు. ఆ సమయంలో అర్జున్ లాయర్ అశోక్‌రెడ్డి ఉన్నారు. అర్జున్ వాంగ్మూలాన్ని వీడియో రికార్డింగ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. విచారణకు సంబంధించిన నివేదికను కోర్టుకు సీల్డ్ కవర్‌లో అందజేయనున్నట్లు తెలిసింది.

నిందితులు వీరే

పెద్దరామిరెడ్డి(ఏ1), చిన్నరామిరెడ్డి(ఏ2), ఎం.సందీప్(ఏ3), సుమిత్(ఏ4).. థియేటర్ భాగస్వాములు-- ఆగమాటి వినయ్(ఏ5), అశుతోశ్‌రెడ్డి(ఏ6), రేణుకాదేవి(ఏ7), అరుణారెడ్డి(ఏ8), థియేటర్ మేనేజర్ నాగరాజు(ఏ9), బాల్కనీ ఇన్‌చార్జి విజయ్‌చందర్(ఏ10), అల్లు అర్జున్(ఏ11), అల్లు అర్జున్ పీఏ సంతోష్(ఏ12), అల్లు అర్జున్ మేనేజర్ శరత్(13), అల్లు అర్జున్ సెక్యూరిటీ టీమ్-- రమేశ్(ఏ14), రాజు(ఏ15), ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యుడు వినయ్‌కుమార్(ఏ16), బాడీగార్డ్ పర్వేజ్(ఏ17), మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు(ఏ18).

వ్యక్తులను టార్గెట్ చేసి వేధించడం ఏంటి?

అల్లు అర్జున్ కేసుపై సీఎంకు హరీశ్ ప్రశ్న



హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'వ్యక్తులను టార్గెట్ చేసి కేసుల్లో ఇరికించి వేధించడం ఏంటి? చట్టం అందరికీ సమానంగా ఉండాలి కదా? చట్టం నీకు, మీ పార్టీ నాయకులకు చుట్టమా.. రేవంత్ రెడ్డీ?' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. సంధ్య థియేటర్‌లో తొక్కిసలాటలో మహిళ చనిపోవడం దురదృష్టకరమని, అయితే ఉద్దేశపూర్వకంగా ఒక వ్యక్తిని టార్గెట్ చేయడం వల్ల రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతిని, నష్టం జరిగే అవకాశం ఉందని తెలుసుకోవాలని సూచించారు. సినీ నటుడు అల్లు అర్జున్ విషయంలో చూపుతున్న చొరవను మిగతా వారి విషయంలోనూ చూపాలని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 'నీ తమ్ముడి అరాచకాల వల్ల చనిపోతున్నానని సూసైడ్ నోట్ రాసి, సాయిరెడ్డి అనే మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకుంటే ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. ఇంతవరకు నీ తమ్ముడిని ఎందుకు అరెస్టు చేయలేదని సీఎంను ప్రశ్నించారు. 80 మంది ఆటోడ్రైవర్లు ప్రాణాలు తీసుకున్నా.. 450 మందికి పైగా రైతులు చనిపోయినా సీఎంలో చలనం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 50మందికి పైగా గురుకులాల విద్యార్థులు చనిపోయారని ఆరోపించారు. అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలందరూ రేవంత్ రెడ్డితో ఫొటోలు దిగిన వాళ్లేనని పేర్కొన్నారు. సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంపై దాడి చేయించిందీ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. భౌతికదాడులతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయాలని, ప్రశ్నించకుండా చేయాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో ఇలాంటి సంస్కృతి లేదని, రాయలసీమ తరహా దాడులు, ఫ్యాక్షనిస్టు సంస్కృతిని తెచ్చిపెట్టిన రేవంత్ రెడ్డి శాంతిభద్రతలను కుప్పకూలుస్తున్నారన్నారు. ఈ చర్యను తెలంగాణ ప్రజలు హర్షించరని, దీనికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదని హరీశ్‌రావు హెచ్చరించారు.



మనాలీపై మంచు దుప్పటి

మనాలీ, డిసెంబరు 24: హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీని మంచు దుప్పటి కప్పేసింది. రహదారులపై అర అడుగు నుంచి ఒక అడుగు మేర మంచు గడ్డకట్టింది. దీంతో.. సోలాంగ్-రొహతంగ్ రహదారిపై వెయ్యికి పైగా వాహనాలు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. 700 మందికి పైగా పర్యాటకులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నెహ్రూ కుండ్ నుంచి సోలాంగ్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో అధికారులు ముందు జాగ్రత్తగా అటల్ టన్నెల్‌కు వెళ్లడాన్ని నిషేధించారు. ఆ మార్గంలో వాహనాలను అనుమతించడం లేదు. డిసెంబరు-ఫిబ్రవరి కాలంలో మనాలీకి పర్యాటకులు పోటెత్తుతారు. ఈ సీజన్‌లో పర్వతాలు, కొండలు, లోయలను మంచు కప్పేసి.. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే.. సోమవారం నుంచి భారీగా మంచు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించిపోయింది. కోట్లిలో 48, రోహ్రూలో 27 ప్రధాన రహదారులు మంచుతో నిండిపోయి, రాకపోకలు జరగడం లేదు.

లోయలో పడిన ఆర్మీ వాహనం

» ఐదుగురు జవాన్ల మృతి, మరో అయిదుగురికి గాయాలు

జమ్మూ, డిసెంబరు 24: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో మంగళవారం ఘోర ప్రమాదం జరిగింది. జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం 350 అడుగుల లోయలో పడి అయిదుగురు మృతి చెందగా మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. భద్రతా చర్యల్లో భాగంగా జవాన్లు బాల్‌నోయ్ చెక్ పోస్టుకు వెళ్తుండగా ఘరోవా ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదం వెనుక ఉగ్రవాదుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎక్స్ వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతిచెందిన సైనికుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

మా థోరియాన్ని వాడుకొని విద్యుత్ ఇవ్వండి

» కేంద్రానికి కేరళ ప్రభుత్వం వినతి

తిరువనంతపురం, డిసెంబరు 24: కేరళలో సమృద్ధిగా ఉన్న థోరియం నిక్షేపాలను సద్వినియోగం చేసుకొని తమ రాష్ట్రానికి విద్యుత్‌ను సరఫరా చేయాలని కేంద్రమంత్రి మనోహర్ ఖట్టర్‌ను ఆ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి కృష్ణన్‌కుట్టి కోరారు. తమ రాష్ట్రం విద్యుత్ లోటును ఎదుర్కొంటున్న నేపథ్యంలో థోరియం నిక్షేపాలను వాడుకుని వాటి నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కేరళకు సరఫరా చేయాలని విన్నవించారు. ఇటీవల జరిగిన అత్యున్నత స్థాయి చర్చల్లో కేంద్రమంత్రికి కేరళ విద్యుత్ మంత్రి ఈ మేరకు విన్నవించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దీనిపై మనోహర్ లాల్ ఖట్టర్ స్పందిస్తూ.. కేరళ విద్యుత్ లోటును ఎదుర్కొంటూ పక్క రాష్ట్రాల నుంచి కొంటున్న నేపథ్యంలో అక్కడే న్యూక్లియర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదని సూచించినట్లు పేర్కొన్నాయి. దీనికోసం కేరళ ప్రభుత్వం భూమిని ఇస్తే న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం అవుతుందని ఆయన పేర్కొన్నట్లు తెలిపాయి.

'అంబేడ్కరే' 2025 ఎజెండా!

రేపటి బెళగావి వర్కింగ్ కమిటీ భేటీలో కాంగ్రెస్ కార్యాచరణ.. అమిత్‌షా రాజీనామా కోసం ఉద్యమం!

» సమావేశానికి 'నవ సత్యాగ్రహ బైఠక్'గా నామకరణం



ప్రయాగ్‌రాజ్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళనలు

న్యూఢిల్లీ, డిసెంబరు 24: అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యసభలో అవమానించారంటూ పెద్దఎత్తున ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ అంశాన్నే ప్రధాన ఎజెండాగా చేసుకుని 2025లో ఉద్యమించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని గురువారం బెళగావిలో జరిగే వర్కింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించనుంది. 1924లో మహాత్మా గాంధీ అధ్యక్షతన కర్ణాటకలోని బెళగావిలో జాతీయ కాంగ్రెస్ సదస్సు జరిగి వందేళ్లు గడచిన సందర్భంగా వర్కింగ్ కమిటీ భేటీని అక్కడ ఏర్పాటు చేశారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని గట్టిగా జనంలోకి తీసుకెళ్లి ఉద్యమిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, మీడియా-పబ్లిసిటీ విభాగం అధిపతి పవన్ ఖేరా మంగళవారమిక్కడ విలేకరులకు తెలిపారు. గురువారంనాటి సమావేశానికి 'నవ సత్యాగ్రహ బైఠక్' అని నామకరణం చేసినట్లు జైరాం వెల్లడించారు. తమ పార్టీ ఈ వారాన్ని 'అంబేడ్కర్ సమ్మాన్ సప్తాహ్'గా పాటిస్తున్నట్లు తెలిపారు. అమిత్‌షాను హోం మంత్రిగా తొలగించడం.. ఆయన తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పడమే ఈ సమస్యకు ఏకైక పరిష్కారమన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని ప్రధాని మోదీ, బీజేపీ భావిస్తున్నారని.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానంపై ఏం చేయాలి.. భవిష్యత్‌లో ఎలాంటి కార్యాచరణ చేపట్టాలో వర్కింగ్ కమిటీ భేటీలో లోతుగా చర్చిస్తామని వేణుగోపాల్ చెప్పారు. అమిత్‌షా రాజీనామాను డిమాండ్ చేస్తూ.. మంగళవారం దేశవ్యాప్తంగా జిల్లా కాంగ్రెస్ కమిటీలు ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్ల ద్వారా రాష్ట్రపతికి మెమోరాండం సమర్పించాయన్నారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు నవ సత్యాగ్రహ బైఠక్ ప్రారంభమవుతుందన్నారు. మర్నాడు 27న బెళగావిలోనే 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' ర్యాలీ జరుగుతుందని.. ఇందులో లక్షలమంది కార్యకర్తలు, ఎంపీలు, ఏఐసీసీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

ఎన్నికల నిబంధనల్లో మార్పులపై 'సుప్రీం'కు కాంగ్రెస్

న్యూఢిల్లీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనల్లో మార్పులు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను కేంద్రం సవరించడంపై సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ వేసింది. ప్రభుత్వ చర్యలతో ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు భంగం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని జైరాం రమేశ్ మంగళవారం ఎక్స్ ద్వారా వెల్లడించారు. కాగా, ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం ఇటీవల మార్పులు చేసింది. పోలింగ్ సీసీ టీవీ ఫుటేజీ, వెబ్ క్యాస్టింగ్ రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2) (ఏ)ను కేంద్ర న్యాయశాఖ సవరించింది. ఈ నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించడం, కీలకమైన చట్టాన్ని కేంద్రం సవరించడం సరికాదని జైరాం రమేశ్ అన్నారు.

నేడు ఎన్డీయే నేతల కీలక భేటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 24: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలు బుధవారం భేటీ కానున్నాయి. ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఈ కీలక సమావేశం జరగనుంది. దివంగత నేత, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శత జయంతి వేడుకల నేపథ్యంలో ఎన్డీయే నేతలు ఆయనకు ఘనంగా నివాళులర్పించనున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు నడ్డా నివాసంలో నేతలు భేటీ కానున్నట్లు సమాచారం. దేశంలో తాజా రాజకీయ పరిస్థితులు, ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో చోటుచేసుకున్న ఘటనలు, తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం ఉంది. ఏపీ సీఎం చంద్రబాబు సహా ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు పాల్గొననున్నారు. అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలతో తీవ్ర రాజకీయ దుమారం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ అంశంలో కాంగ్రెస్‌కు గట్టిగా సమాధానం చెప్పే విషయంపైనా నేతలు చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కెనడాలో శాశ్వత నివాసం కష్టమే!

» జాబ్ ఆఫర్ పాయింట్లు ఎత్తివేత
» ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానంలో మార్పు
» భారతీయులపై భారీ ప్రభావం

టొరంటో, డిసెంబరు 24: కెనడాలో శాశ్వత నివాసం ఉండాలనుకునే విదేశీయులకు భారీ షాక్ తగిలింది. "నాకు ఉద్యోగ అవకాశం వచ్చింది. ఇక ఇక్కడే ఉండిపోతాను" అంటే కుదరదని కెనడా తేల్చి చెప్పింది. ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానం ద్వారా సంపాయించుకునే జాబ్ ఆఫర్ పాయింట్లను ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని తెలిపింది. తద్వారా జాబ్ ఆఫర్ పాయింట్లను ఆధారంగా చేసుకుని శాశ్వత నివాసం కోరేందుకు అవకాశం లేకుండా పోతుంది. ఈ మేరకు ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానంలో కెనడా ప్రభుత్వం మార్పులు చేసింది. ప్రస్తుతం తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న వారికి కూడా ఈ మార్పులు వర్తిస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. "అభ్యర్థులు ఉద్యోగం పొందినా.. అదనపు పాయింట్లు జోడించినా.. శాశ్వత నివాసం కోసం అభ్యర్థించలేరు" అని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇప్పటి వరకు శాశ్వత నివాసం కోసం కనీసం 50 పాయింట్లు రావాలి. కొన్నికొన్నిసార్లు అభ్యర్థుల మధ్య ఈ పాయింట్ల విషయంలో వ్యత్యాసం ఉంటోంది. అయితే, ఈ విషయంలో మోసాలు జరుగుతున్నాయని గుర్తించిన కెనడా ప్రభుత్వం పూర్తిగా ఈ వ్యవస్థను ఎత్తివేసింది. ఈ మేరకు రిఫ్యూజీస్, సిటిజన్ షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, ఇప్పటికే దరఖాస్తులు పరిశీలనలో ఉన్నవారిపై ఎలాంటి ప్రభావం ఉండదని ఐఆర్‌సీసీ పేర్కొంది. కెనడాలో స్థిరపడాలనుకునే భారతీయులకు ప్రస్తుత నిర్ణయం శరాఘాతమేనని నిపుణులు చెబుతున్నారు. కెనడాలో ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానం ద్వారా ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్న విదేశీయుల్లో భారతీయులే ఎక్కువగా ఉంటున్నారని తెలిపారు. తాజా నిర్ణయంతో వారంతా శాశ్వత నివాస అర్హత కోల్పోయినట్టేనని పేర్కొన్నారు. 2023 లెక్కల ప్రకారం 85,760 మంది విదేశీయులు ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానం ద్వారా కెనడాలో ఉద్యోగాలు పొందితే.. వారిలో 40,775 మంది భారతీయులే ఉన్నారు.

అవినీతి కేసులో షేక్ హసీనాపై దర్యాప్తు

» చెల్లెలి కుమార్తె అయిన బ్రిటన్ ఆర్థిక మంత్రి తులిప్ సిద్దిక్‌పై కూడా

ఢాకా/న్యూఢిల్లీ, డిసెంబరు 24: అణు విద్యుత్ కేంద్రం నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా(77), కుటుంబ సభ్యులపై కేసు నమోదైంది. హైకోర్టు ఆదేశాల మేరకు దీనిపై యాంటీ కరప్షన్ కమిషన్ (ఏసీసీ) దర్యాప్తు ప్రారంభించింది. రాజధాని ఢాకాకు 160 కి.మీ.దూరంలోని రోప్పూర్‌లో రష్యా ప్రభుత్వరంగ సంస్థ అయిన రోసటోమ్ సాయంతో 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.43వేల కోట్లు) వ్యయంతో ఈ అణు విద్యుత్తు కేంద్రం నిర్మాణం జరుగుతోంది. ఇందుకు సంబంధించిన నిధులను మలేసియా బ్యాంకుకు మళ్లించారని, ఇందుకు షేక్ హసీనాతో పాటు ఆమె కుమారుడు సజీబ్ వాజేద్ జాయ్, ఆమె చెల్లెలి కుమార్తె, బ్రిటన్ ఆర్థిక మంత్రి తులిప్ సిద్దిక్‌లను ఎందుకు ప్రశ్నించకూడదని హైకోర్టు ప్రశ్నించింది. దాంతో ఆమెతో పాటు, కుటుంబ సభ్యులపైనా ఏసీసీ దర్యాప్తు చేయనుంది.

అమెరికాలో స్మగ్లర్ సునీల్ యాదవ్ కాల్చివేత

న్యూఢిల్లీ, డిసెంబరు 24: కరుడుగట్టిన మాదక ద్రవ్యాల స్మగ్లర్ సునీల్ యాదవ్ అమెరికాలో హత్యకు గురయ్యాడు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కి అనుచరుడిగా ఉన్న రోహిత్ గొదారా అతడిపై తుపాకీతో కాల్పులు జరిపాడు. ప్రతీకారంతోనే ఈ హత్య చేసినట్టు తెలిపాడు. కాలిఫోర్నియా రాష్ట్రంలోని స్టాక్‌టన్ సిటీలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పంజాబ్‌లోని ఫజిల్కా జిల్లాకు చెందిన సునీల్‌పై స్మగ్లింగ్‌కు సంబంధించి రాజస్థాన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. రెండేళ్ల క్రితం అతడు అమెరికా వెళ్లాడు. లారెన్స్ ముఠాలో పనిచేసినప్పుడు సునీల్, రోహిత్ మధ్య మంచి స్నేహం ఉండేది. అయితే పంజాబ్ పోలీసులతో కలిసి తనకు సోదరుడులాంటి అంకిత్ భాదును ఎన్‌కౌంటర్ చేయించాడన్న కారణంతో సునీల్‌పై రోహిత్ కక్ష పెట్టుకున్నాడు.

ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్

హైదరాబాద్, డిసెంబరు 24: ఇండో- టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)లో 7 హెడ్ కానిస్టేబుల్(మోటార్ మెకానిక్), 44 కానిస్టేబుల్(మోటార్ మెకానిక్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న ఆసక్తిగల పురుషులు వచ్చే ఏడాది జనవరి 22వ తేదీలోపు ఈ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాల కోసం https://recruitment.itbpolice.nic.in/rect/ index.php ను సందర్శించవచ్చు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.